
'ప్రాజెక్టులు పూర్తి చేసి
శాశ్వత వనరుల ద్వారా
రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 68

గురువారం 30-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కసరత్తులు షురూ!

మైదానంలో శ్రమించిన భారత క్రికెటర్లు. తొలి రోజు ఫిట్‌నెస్‌పై దృష్టి -12లో



భారత్ అవుట్‌లుక్.. పాజిటివ్

'స్టేబుల్' నుంచి అప్‌గ్రేడ్.. ఆర్థిక నిర్వహణ బాగుందన్న ఎస్అండ్‌పీ -13లో



బెంగాల్‌లోకి అక్రమ వలసలు

'వికసిత్ భారత్' సాకారం కావాలంటే 'వికసిత్ బెంగాల్' కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



'కరణ్' కాన్వాయ్ బీభత్సం

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ కుమారుడు, కైసర్‌గంజ్ బీజేపీ అభ్యర్థి కరణ్‌భూషణ్ కాన్వాయ్ ఢీకొని ఇద్దరు మృతి చెందారు.

వివరాలు 6లో ▸



కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

మధ్యంతర బెయిలు పొడిగింపు విషయంలో కేజ్రీవాల్‌కు సుప్రీంలో ఊరట దక్కలేదు. ఆయన జూన్ 2న సరెండర్ కావాల్సి ఉంది.

వివరాలు 6లో ▸



పాకిస్తాన్‌లో ఘోర ప్రమాదం

పాక్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఘోర ప్రమాదం జరిగింది. బస్సు లోయలో పడిన ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'ప్లాస్టిక్‌ఫ్రీ జోన్'గా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను జూలై ఆఖరులోగా పూర్తి ప్లాస్టిక్ రహిత జోన్‌గా మార్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎస్ శాంతికుమారి అధికారులను ఆదేశించారు.

- వివరాలు 14లో▶

మెడికల్ షాపులపై దాడులు



వివిధ ప్రాంతాల్లో ఔషధాల ధరలు ఎక్కువ చేసి విక్రయించడం, తప్పుడు లేబుళ్లతో చేస్తున్న ఉల్లంఘనలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కొరడా ఝుళిపించింది. పలు మందులను స్వాధీనం చేసుకోవడమే కాక, ఓ నకిలీ క్లినిక్‌పైనా దాడి చేసింది.

- వివరాలు 3లో▶

చేప పిల్లలా? చేయూతా?



చేపపిల్లల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి. మే నెల చివరికి వస్తున్నా ఈ పథకంపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనితో ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీ ఉంటుందా? లేదా అన్న సందిగ్ధత ఏర్పడింది.

- వివరాలు 5లో▶

పోలీసుల అదుపులో ముగ్గురు తహసీల్దార్లు!

- వివరాలు 3లో▶

తెలంగాణ పదేళ్ల ఉత్సవాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల హడావుడి

దశాబ్ది దంగల్!

అధికారంలో ఉండటంతో తమ ముద్ర వేసుకునేందుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

ఆర్భాటంగా వేడుకల నిర్వహణకు ప్రణాళిక.. సోనియాకు ఆహ్వానం

అధికారిక గేయం ఎంపిక.. అధికారిక చిహ్నానికి మార్పులపై కసరత్తు

గత ఏడాదే 21 రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలను నిర్వహించిన నాటి బీఆర్ఎస్ సర్కారు

అధికారం కోల్పోవడంతో ఇప్పుడు పార్టీ పరంగా మూడు రోజుల పాటు ముగింపు వేడుకలు

కేసీఆర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీకి ప్రణాళిక.. రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు

అధికారిక చిహ్నాలను మారుస్తుండటంపై తీవ్ర విమర్శలు



దశాబ్ది ఉత్సవాలపై నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, అందెశ్రీ, కీరవాణితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటై పదేళ్లు పూర్తవుతున్న సమయంలో రాష్ట్రంలో రాజకీయ రగడ ప్రారంభమైంది. దశాబ్ది ఉత్సవాలపై తమ ముద్ర వేసుకునేందుకు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ హడావుడి చేస్తున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉండటంతో పూర్తిగా తమ మార్క్ కనిపించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యక్రమాలను రూపొందిస్తోంది. మరోవైపు అధికారంలో ఉండగానే (గత ఏడాది జూన్‌లోనే) దశాబ్ది ఉత్సవాలను ప్రభుత్వపరంగా నిర్వహించిన బీఆర్ఎస్.. ఇప్పుడు పార్టీపరంగా దశాబ్ది ముగింపు ఉత్సవాలకు సిద్ధమవుతోంది. మరోవైపు దశాబ్ది ఉత్సవాలకు కొనసాగింపుగా పలు అంశాలపై కసరత్తు చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. తెలంగాణ అధికారిక గేయాన్ని ఖరారు చేశారు. అధికారిక చిహ్నంలోనూ మార్పులపై దృష్టిపెట్టారు. ఈ మార్పులను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. కాంగ్రెస్ సర్కారుపై విమర్శలు గుప్పిస్తోంది.

రాష్ట్ర గేయం.. 2.30 నిమిషాలు!

- అశోకచక్రం, వ్యవసాయం, రాజ్యాంగాన్ని ప్రతిబింబించేలా రాష్ట్ర అధికారిక చిహ్నం
- దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సమావేశంలో సీఎం రేవంత్ నిర్ణయాలు

2లో

గన్ పార్క్ నుంచి మొదలు..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా నిర్వహించే ప్రధాన కార్యక్రమానికి

మిగతా 2వ పేజీలో ▶

కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవ ర్యాలీ

- జూన్ 1న పది వేల మందితో గన్‌పార్కు నుంచి అమరజ్యోతి వరకు ఊరేగింపు.. 2న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరణ
- తర్వాతి రోజు జిల్లా కేంద్రాల్లో వేడుకలు, సేవా కార్యక్రమాలు
- బీఆర్ఎస్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కమిటీ భేటీలో నిర్ణయాలు
- వివరాలను వెల్లడించిన మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

2లో



లోగో మార్పిడిపై బీఆర్ఎస్ నిరసన

- నేడు చార్మినార్ వద్ద కేటీఆర్ ఆధ్వర్యంలో ధర్నా
- వరంగల్‌లోనూ నిరసన తెలపాలని యోచన

- వివరాలు 2లో

తల్లఢిల్లీ: మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం దండా



52.9

ఢిల్లీలోని ముంగేష్‌పూర్‌లో బుధవారం మధ్యాహ్నం 2.30 సమయంలో 52.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కాగా, సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షం కురిసింది.

నమోదైందన్న ఐఎండీ.. నిర్ధారణ కాలేదన్న రిజిజు 6లో

రోహిణి భగభగలు అంతంతే!

- ఈ కార్తెలో సాధారణంగా 43 నుంచి 46 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు
- కానీ ప్రస్తుతం కాస్త తక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదు
- రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం తగ్గుదల
- రానున్న రెండ్రోజుల్లో పెరిగే చాన్స్ ఉందన్న వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చిత్రమైన వాతావరణ పరిస్థితి కొనసాగుతోంది. పగలంతా ఎండలు మండిపోతుండగా, రాత్రికి మాత్రం కాస్త చల్లని వాతావరణం నెలకొంటోంది. సాధారణంగా రోహిణి కార్తెలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. దీనికి తోడు తీవ్రమైన ఉక్కపోత చిరాకు కలిగిస్తుంటుంది. అయితే ప్రస్తుతం రోహిణి కార్తె ప్రవేశించి 5 రోజులు కావస్తున్నా ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణానికి కాస్త అటుఇటుగానే నమోదవుతున్నాయి. రోహిణి కార్తెలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 8 డిగ్రీల సెల్సియస్ అధికంగా..అంటే 43 నుంచి 46 డిగ్రీల మధ్య నమోదవుతాయి. కానీ ఈసారి కాస్త తక్కువగా నమోదవుతుండటం గమనార్హం. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే..అత్యధికంగా ఆదిలాబాద్‌లో 44.3 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. రెండు మూడు చోట్ల 43కు అటుఇటుగానే నమోదు కాగా మిగతా ప్రాంతాల్లో తక్కువ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. హనుమకొండ, నల్లగొండ, నిజామాబాద్, రామగుండం ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదు అయ్యాయి. మరోవైపు కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా తక్కువగానే నమోదవుతుండటం గమనార్హం. రోహిణి కార్తెలో సాధారణంగా 30 డిగ్రీల వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సి ఉండగా చాలా

మిగతా 3వ పేజీలో ▶

గ్రూప్-1 పరీక్షపై అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ సూచనలు

- చెప్పులు మాత్రమే ధరించాలి.. బూట్లు వేసుకుని రాకూడదు
- పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే లోనికి అనుమతి
- పరీక్షకు అరగంట ముందే గేట్లు మూసివేత
- జూన్ 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రిలిమ్స్
- 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు హాల్ టికెట్ల జారీ

నగలు ధరిస్తే నో ఎంట్రీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని 563 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి జూన్ 9వ తేదీన ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు హాల్ టికెట్లు జారీ చేయనుంది. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. జూన్ 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించనుంది. పరీక్షా సమయానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థుల్ని హాల్లోకి అనుమతిస్తారు. పరీక్షకు అరగంట ముందే

మిగతా 3వ పేజీలో ▶

1,000 నుంచి 1,200 ఫోన్ల ట్యాపింగ్

- ప్రతిపక్షాలకు నిధులిస్తున్న సంస్థల డబ్బు స్వాధీనానికి ప్రత్యేక ఆపరేషన్లు
- ఈసీని తప్పుదోవ పట్టించి ఈ నగదుకు హవాలా రంగు
- సీసీ కెమెరాలు ఆఫ్‌చేసి హార్డ్‌డిస్క్‌లు బయటకు తీశారు
- 50 హార్డ్‌డిస్క్‌లను ఎలక్ట్రానిక్ కట్టర్‌తో కట్ చేసి మూసీ నదిలో పడేశారు
- డీఎస్పీ ప్రణీత్‌రావు వాంగ్మూలంలో కీలకాంశాలు



సాక్షి, హైదరాబాద్: ఎస్ఐబీ కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారిగా ఉన్న డీఎస్పీ ప్రణీత్‌రావు నేతృత్వంలోని బృందం 1,000 నుంచి 1,200 మంది ఫోన్లు ట్యాప్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. తమ కస్టడీలో ప్రణీత్‌రావు అనేక కీలకాంశాలు వెల్లడించినట్లు కోర్టుకు తెలిపారు. ప్రతిపక్షాలకు నిధులు ఇస్తున్న సంస్థల డబ్బును స్వాధీనం చేసుకోవడం కోసం ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు నాంపల్లి కోర్టుకు నేరాంగీకార

మిగతా 2వ పేజీలో ▶

'సడలింపు'ని సరిదిద్దండి

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

- పోస్టల్ బ్యాలెట్ నిబంధనల మినహాయింపులపై ఆక్షేపణ.. ఈసీఐ నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ఎన్నికల ప్రధానాధికారి సడలింపులు
- అటెస్టింగ్ అధికారుల స్పెసిమెన్ సంతకాల సేకరణ ఈసీఐ నిబంధనలకు విరుద్ధం
- ఇది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తిరస్కరించేందుకు దారితీస్తుందంటూ ఆందోళన
- సడలింపు ఉత్తర్వులను తక్షణమే సమీక్షించి, తగు నిర్ణయం తీసుకోవాలని వినతి

- వివరాలు 10లో

ఇదండీ సంగతి



ఇప్పట్లో 'స్థానిక' ఎన్నికలు లేనట్టేనా?

సాక్షి, హైదరాబాద్

'స్థానిక' ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. లోక్‌సభ ఎన్నికలు ముగిశాక.. జూన్‌లో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వపరంగా అడుగులు ముందుకు పడడం లేదనే చెప్పాలి. బీసీ కమిషన్ ఆధ్వర్యంలో జనగణన చేపట్టినా.. స్థానికంగా (క్షేత్రస్థాయిలో) ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో ఇప్పట్లో ఈ ఎన్నికలు జరిగే అవకాశాలు లేవనే ఊహాగానాలు సాగుతున్నాయి. జూన్ 6వ తేదీ వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండడంతో ప్రభుత్వం లేదా బీసీ కమిషన్ పరంగా... స్థానిక ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ముందస్తు కార్యాచరణ చేపట్టేందుకు వీలు లేదు. గ్రామపంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం ముగిసి ఈ నెలాఖరుకు నాలుగు నెలలు పూర్తికానుండగా... జూలై 4 నాటికి జిల్లా, మండల ప్రజా పరిషత్ పాలకమండళ్ల కాలపరిమితి కూడా ముగియనుంది. అదేవిధంగా వచ్చే ఏడాది మొదట్లో వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకమండళ్ల పదవీకాలం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశం చర్చనీయాంశమవుతోంది.

జూన్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని గతంలో సీఎం ప్రకటన

- బీసీ జనాభా గణన, రిజర్వేషన్ల ఖరారుపై ఇంకా మొదలు కాని బీసీ కమిషన్ కసరత్తు
- జనాభా గణన సుదీర్ఘకాలం సాగే అవకాశం
- ఓటర్ల జాబితా ప్రకారమైనా ఆగస్ట్ లేదా సెప్టెంబర్‌లోనే స్థానిక ఎన్నికల నిర్వహణకు అవకాశాలు
- జనవరి చివర్లోనే ముగిసిన గ్రామ పంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం
- జూలై మొదటి వారంతో ముగియనున్న జిల్లా, మండల పరిషత్‌ల కాలపరిమితి



బీసీలకు 42% స్థానిక రిజర్వేషన్లపై హామీ

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని చెప్పడంతో పాటు ఉపకులాల వారీగా కూడా రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు బీసీ కమిషన్ నుంచి నివేదిక తెప్పించుకుంటామని ప్రకటించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు, ఇతర గ్రూపులకు రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు గతంలోనే 'ట్రిపుల్ టెస్ట్' పేరిట మార్గదర్శకాలు నిర్దేశించింది. మొత్తంగా రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి) 50 శాతానికి మించకుండా ఉండాలని స్పష్టం చేసింది. స్థానిక సంస్థల పరిధిలో ఆయా గ్రూపుల వెనుకబాటుపై బీసీ కమిషన్ ద్వారా విచారణ జరపాలని, ఏయే నిష్పత్తిలో రిజర్వేషన్లు ఇవ్వాలనే దానిపై తేల్చాలని సుప్రీం పేర్కొంది. ఈ నేపథ్యంలో బీసీ కమిషన్ విచారణ జరిపి తుది నివేదిక ఇస్తే దాని ఆధారంగానే పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో కొత్తగా రిజర్వేషన్లను ఖరారు చేసే అవకాశముంది. బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆధ్వర్యంలో ట్రిపుల్ టెస్ట్ మేరకు క్షేత్రస్థాయి పరిశీలనలు ఇప్పటికే పూర్తిచేసినట్టు తెలుస్తోంది. కొత్త ఓటర్ల జాబితా (లోక్‌సభ ఎన్నికల

మిగతా 3వ పేజీలో ▶

'స్కూటీ' అంటే పాప 'బైక్' అంటే బాబు



కోడ్ భాషలో పసికందుల విక్రయాలు

- ఉత్తరాది రాష్ట్రాల్లో హైదరాబాద్ పోలీసుల తనిఖీలు.. యూపీ, ఢిల్లీ, పుణే నగరాల్లోని ముఠాపై ఆరా

14లో

ఆ చిన్నారులు మా వద్ద క్షేమంగా ఉన్నారు

పెంపుడు తల్లిదండ్రులకు పిల్లలను ఇచ్చేది లేదు: కాంతి వెస్లీ

క్లుప్తంగా...

జూన్ 3న హాజరు కండి

కవితకు రౌజ్ అవెన్యూ కోర్టు ఆదేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహా నలుగురు నిందితులను జూన్ 3న హాజరు కావాలని ట్రయల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈడీ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీటును పరిగణనలోకి తీసుకొనే క్రమంలో న్యాయమూర్తి కావేరి బవేజా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. అనుబంధ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంట్లో నిందితులుగా చేర్చిన కల్వకుంట్ల కవిత, చరణ్‌ప్రీత్, దామోదర్ శర్మ, అరవింద్ సింగ్‌ను జూన్ 3న హాజరు కావాలని పేర్కొన్నారు. కవిత, చరణ్‌ప్రీత్ జైలులో ఉండడంతో ప్రొడక్షన్ వారెంట్లు, మిగిలిన ఇద్దరికి కోర్టు సమన్లు జారీ చేశారు. తదుపరి విచారణ జూన్ 3కు వాయిదా వేశారు. కాగా, కవిత బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పు రిజర్వు చేసిన విషయం విదితమే.

ఒడిశాలో ప్రచారానికి భట్టి విక్రమార్క

నేడు రాహుల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఒడిశా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భువనేశ్వర్ బయలుదేరి వెళ్లారు. గురువారం భద్రలోక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి ప్రచారం నిర్వహిస్తారు. గడిచిన వారం రోజులుగా భట్టి విక్రమార్క పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్ కోట్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్ర గీతంపై జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. పంజాబ్ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి ముందు కేరళలో సైతం భట్టి ప్రచారం నిర్వహించిన సంగతి తెలిసిందే.

బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఏం చేశారో చెప్పండి

కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల కోసం ఏం చేశారో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు చెప్పాలని ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో విత్తనాల కోసం రైతులపై లాఠీచార్జ్ చేశారంటూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బుధవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై కేటీఆర్ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, రైతులకు సంకెళ్లు వేసి జైలుకు పంపించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని ఆరోపించారు. ఆగస్టు 15 లోగా రుణమాఫీ హామీ అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వ చిహ్నాల మార్పు తుగ్లక్ చర్య



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం మారగానే.. ప్రభుత్వ చిహ్నాలు మార్చడం తుగ్లక్ చర్య అని కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల జీవితాల్లో మార్పు తెస్తానని అధికారం హస్తగతం చేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రభుత్వ గుర్తులు మార్చడం విడ్డూరమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ చిహ్నాలు మార్చి తెలంగాణ చరిత్ర ఆనవాళ్లను తుడిచివేసే పనిలో పడటం తన అవివేకానికి, మూర్ఖత్వానికి, మరుగుజ్జు మనస్తత్వానికి పరాకాష్ట అని స్పష్టం చేశారు.

మీకు మద్యమే ఆదాయ వనరా?

బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు లిక్కర్ మార్గం ఎంచుకుందని, రాష్ట్రంలో బీర్ల కొరత సృష్టించి, 5 కొత్త బ్రాండ్లను తీసుకొచ్చిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ఆరోపించారు. బుధవారం పార్టీ అధి కార ప్రతినిధి పోరెడ్డి కిశోర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.42 వేల కోట్ల ఆదాయం గడించడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆదాయ సమీకరణపై ఆశ పుట్టుకొచ్చిందని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సోండిస్టిలరీస్‌ను బ్యాక్ డోర్ ఎంట్రీగా తీసుకొచ్చారని, కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ఫండింగ్‌లో ఈ సంస్థ గురుదక్షిణ కింద కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయని సుభాష్ చెప్పారు. పాఠశాలలు మొదలయ్యే సీజన్‌లో కొత్త బట్టలు తీసుకురావడం ఒక ఆనవాయితీ కాగా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఢిల్లీ పెద్దల సూచనల మేరకు కొత్త మద్యం బ్రాండ్లను తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవ ర్యాలీ

1న పది వేల మందితో గన్‌పార్కు నుంచి అమరజ్యోతి వరకు ఊరేగింపు | జూన్ 2న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో జెండా ఎగురవేత | తర్వాతి రోజు జిల్లా కేంద్రాల్లో వేడుకలు, సేవా కార్యక్రమాలు

- బీఆర్ఎస్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కమిటీ భేటీలో నిర్ణయాలు
- వివరాలను వెల్లడించిన మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దినోత్సవం నేపథ్యంలో పార్టీ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. దీనికి సంబంధించి బీఆర్ఎస్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కమిటీ బుధవారం తెలంగాణ భవన్‌లో సమావేశమైంది. జూన్ 1 నుంచి మూడు రోజుల పాటు పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాల నిర్వహణపై నేతలు చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఈ వివరాలను మీడియాకు వివరించారు. కేసీఆర్ పోరాటం, అమరుల త్యాగంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందన్నారు. ఇక్కడ తమ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందనే భయంతోనే కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. కేసీఆర్ నేతృత్వంలో జరిగిన ఉద్యమంతో తెలంగాణ ఏర్పాటైందని.. దీనికి పదేళ్ల పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, పార్టీ నేతలు వై.సతీశ్‌రెడ్డి, దేవీప్రసాద్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ దశాబ్ది ఉత్సవాల ముగింపు షెడ్యూల్ ఇదీ..

- జూన్ ఒకటో తేదీన సాయంత్రం ఆరు గంటలకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దకు చేరుకుంటారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పార్టీ నేతలతో కలసి పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కుకు చేరుకుంటారు. సాయంత్రం ఆరున్నర గంటలకు తెలంగాణ అమరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తారు. తర్వాత కేసీఆర్ ఆధ్వర్యంలో సుమారు పది వేల మందితో గన్‌పార్క్ నుంచి ట్యాంక్‌బండ్ సమీపంలోని తెలంగాణ అమరజ్యోతి వరకు ర్యాలీ నిర్వహిస్తారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బోనాలు, బతుకమ్మలు, ఇతర కళారూపాలను ప్రదర్శించనున్నారు.
- రెండో రోజు జూన్ 2న ఉదయం 9 గంటలకు కేసీఆర్ తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను, బీఆర్ఎస్ పతాకాన్ని ఎగురవేస్తారు. 11 గంటలకు తెలంగాణ భవన్ పక్కనే ఉన్న కళింగ భవన్‌లో 'తెలంగాణ యాది' పేరిట ఉద్యమ ఘట్టాల చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడనున్నారు.
- మూడో రోజు జూన్ 3న జిల్లా కేంద్రాల్లోని బీఆర్ఎస్ కార్యాలయాల్లో జాతీయ జెండాలు, పార్టీ పతాకాలను ఆవిష్కరిస్తారు. రోగులకు పండ్ల పంపిణీ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

దశాబ్ది దంగల్!

▶ మొదటి పేజీ తరువాయి

అతిరథ మహారథులు హాజరుకానున్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి సోనియా గాంధీని ఆహ్వానించింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన నాయకురాలిగా ఆమెను సత్కరించాలని నిర్ణయించింది. 2న అసెంబ్లీ ఎదుట ఉన్న గన్‌పార్క్ అమర వీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించడంతో దశాబ్ది ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లి ప్రసంగిస్తారు. ఇక సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కార్నివాల్, లేజర్ షో, శాస్త్రీయ, జానపద, దక్కనీ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అధికారిక గేయమైన 'జయజయహే తెలంగాణ'కు జాతీయ జెండాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

గత ఏడాది జూన్‌లోనే ఉత్సవాలు చేపట్టి..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం పదో ఏట అడుగుపెడుతున్న సందర్భంలోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ప్రారంభ ఉత్సవాలను చేపట్టింది. 2023 జూన్ 2వ తేదీ నుంచి 21 రోజుల పాటు గ్రామగ్రామాన ఈ వేడుకలను నిర్వహించింది. కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పోరాటంతోనే రాష్ట్ర సాధన జరిగిందని చెప్పుకోవడంతోపాటు అసెంబ్లీ ఎన్నికలకు ఉపయోగపడేలా కార్యక్రమాలను నిర్వహించింది. ఇప్పుడు దశాబ్ది ముగింపు ఉత్సవాల పేరుతో మూడు రోజుల కార్యక్రమాలకు బీఆర్ఎస్ సిద్ధమైంది. జూన్ 1వ తేదీనే గన్ పార్కు వద్ద అమరవీరులకు నివాళులు అర్పించి అమరజ్యోతి ర్యాలీ నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. 2న కేసీఆర్ అధ్యక్షతన సభ నిర్వహించనున్నారు. 3వ తేదీన జిల్లాల్లో బీఆర్ఎస్ జెండా, జాతీయ పతాకం ఆవిష్కరణ, హాస్పిటళ్లు, అనాథ శరణాలయాల్లో పండ్లు, మిఠాయిల పంపిణీ వంటి కార్యక్రమాలకు సిద్ధమవుతోంది.

అధికార చిహ్నం మార్పులపై విమర్శలు

దశాబ్ది ఉత్సవాల క్రమంలోనే.. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాచరిక ఆనవాళ్లు లేకుండా చార్మినార్, కాకతీయ కళాతోరణం చిహ్నాలను అధికారిక లోగో నుంచి తొలగించే ప్రతిపాదనలపై బీఆర్ఎస్ తీవ్రంగా విరుచుకుపడుతోంది. తెలంగాణలో మార్పు కావాలని ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పిందని.. అధికారిక చిహ్నాలను మార్చడమే మీరు తెచ్చే మార్పా అని నిలదీస్తోంది. అయితే ఈ అంశాలపై బీజేపీ ఏమాత్రం స్పందించకపోవడం గమనార్హం. దశాబ్ది వేడుకలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు కూడా చేపట్టలేదు. కానీ దశాబ్ది వేడుకలకు సోనియాగాంధీని ఏ హోదా ఉందని పిలుస్తారంటూ బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. రాష్ట్రం ఇచ్చిన దేవతగా సోనియా ఈ కార్యక్రమానికి వస్తారంటూ కాంగ్రెస్ నేతలు ప్రతిస్పందిస్తుండటంతో.. బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. మరోవైపు ప్రముఖ కవి అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ'ను రాష్ట్ర అధికారిక గేయంగా ప్రకటించిన ప్రభుత్వం.. దానికి తుదిరూపునిచ్చే క్రమంలో ఏపీకి చెందిన సంగీత దర్శకుడు కీరవాణిని ఎంచుకోవడంపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. కళాకారులకు ప్రాంతీయ హద్దులేమిటని.. అయినా బీఆర్ఎస్ హయాంలో ఆంధ్రా ప్రాంతానికి చెందినవారికి లభించిన గౌరవం మాటేమిటంటూ కాంగ్రెస్ నేతలు నిలదీస్తున్నారు. మొత్తంగా దశాబ్ది ఉత్సవాలతో రాష్ట్రంలో రాజకీయ దంగల్ జరుగుతోంది.

రాష్ట్ర గేయం.. 2.30 నిమిషాలు!

- కుదించిన జయజయహే గేయాన్ని ఖరారు చేసిన సర్కారు
- అమరవీరులు, ఉద్యమకారులకు అండగా ఉంటామని వెల్లడి



రాష్ట్ర అధికారిక చిహ్నంపై చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి, కోదండరాం, రుద్ర రాజేశం తదితరులు

సాక్షి, హైదరాబాద్: రెండున్నర నిమిషాల నిడివికి కుదించిన 'జయజయహే తెలంగాణ' గీతాన్ని తెలంగాణ రాష్ట్ర అధికారిక గేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. 'జయజయహే తెలంగాణ' గేయం ఒరిజినల్ వెర్షన్‌లోని ఒకట్రెండు పదాలను తొలగించి.. స్వల్ప మార్పులు, చేర్పులు చేసి పదమూడున్నర నిమిషాల పూర్తి నిడివితో మరో వెర్షన్‌ను ఖరారు చేసింది. గేయ రచయిత అందెశ్రీ మార్గదర్శకత్వంలో, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి సంగీతాన్ని అందించగా.. ప్రముఖ గాయనీ గాయకులతో రికార్డు చేసిన రెండు వెర్షన్ల రాష్ట్ర గేయాన్ని సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఎంఎం కీరవాణి సంగీత దర్శకత్వంలో గాయనీగాయ కులు ఈ రెండు వెర్షన్ల గేయాన్ని లైవ్‌గా పాడి వినిపించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రజలను ఉర్రూతలూగించిన జయజయహే తెలంగాణ గేయాన్ని సరికొత్త స్వరాలు, సంగీత బాణీలతో అద్భుతంగా తీర్చిదిద్దారని, మరోసారి ప్రజలను ఉర్రూతలూగించడం ఖాయమని ఆ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఇందులో మంత్రి జూపల్లి కృష్ణారావు, టీజేఎస్ అధినేత కోదండరాం, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ జేఏసీ చైర్మన్ కె.రఘు, తెలంగాణ అధికారిక చిహ్నం రూపొందిస్తున్న చిత్రకారుడు రుద్ర రాజేశం, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాంచంద్రు నాయక్, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారిక చిహ్నంలో మార్పులపైనా..

తెలంగాణ తొలిదశ ఉద్యమం, అశోక చక్రం, వ్యవసాయం, రాజ్యాంగాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఈ భేటీలో సూచించారు. చిత్రకారుడు రుద్ర రాజేశం రూపొందించిన పలు నమూనా చిహ్నాలను పరిశీలించి వాటిలో ఒకదానిని ఎంపిక చేశారని.. అందులో కొన్ని మార్పులను సూచించారని తెలిసింది. అయితే ఇదే అధికారిక చిహ్నమంటూ.. మూడు నమూనా చిహ్నాలు బుధవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వాటిలో దేనిని కూడా ఎంపిక చేయలేదని సీఎంఓ వర్గాలు తెలిపాయి. తెలంగాణ రాష్ట్ర గేయం, తెలంగాణ అధికారిక చిహ్నాన్ని జూన్ 2న దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఆవిష్కరించనున్నారు.

అమరవీరులు, ఉద్యమకారులకు అండ

గత బీఆర్ఎస్ సర్కారు తెలంగాణ అమరవీరులు, ఉద్యమకారులను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వారి విషయంలో స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీ అమలుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. జూన్ 2న ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే దశాబ్ది వేడుకలకు తెలంగాణ తొలి, మలి విడత ఉద్యమకారులను ఆహ్వానించాలని నిర్ణయించామని తెలిపారు.

నేడు మిత్రపక్షాలతో సమావేశం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, రాష్ట్ర గేయం, అధికారిక చిహ్నం రూపకల్పన అంశాలపై చర్చించేందుకు గురువారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో మిత్రపక్షాలు సీపీఐ, సీపీఎం, టీజేఎస్ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కానున్నారు. మిత్రపక్షాల నేతల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ సమావేశానికి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలను ఆహ్వానించలేదు.

1,000 నుంచి 1,200 ఫోన్లు ట్యాపింగ్

▶ మొదటి పేజీ తరువాయి

వాంగ్మూలాన్ని సమర్పించారు. అందులోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

ప్రణీత్ ప్రవర్తనపై ఫిర్యాదులు

వరంగల్ జిల్లా మేడేపల్లికి చెందిన ప్రణీత్ 2008లో శిక్షణ పూర్తి చేసుకుని ఎస్సైగా బయటకు వచ్చారు. నల్లగొండ జిల్లా మోత్కూరులో ప్రాక్టికల్ ట్రైనింగ్ చేశారు. ఐపీఎస్ అధికారి రాజేష్ కుమార్ నల్లగొండ ఎస్పీగా ఉండగా ప్రణీత్‌రావు ప్రవర్తన సరిగ్గా లేదంటూ అనేక ఫిర్యాదులు వచ్చాయి. వీటి ఆధారంగా ఆయన ప్రణీత్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు నల్లగొండ ఎస్పీగా బదిలీపై రావడంతో ప్రణీత్‌రావు ఆయనతో పరిచయం పెంచుకున్నారు. ఒకే సామాజిక వర్గం కావడంతో ఇరువురి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. దీంతో ప్రణీత్‌ను బీబీనగర్ ఎస్సైగా ప్రభాకర్‌రావు నియమించారు. 2016లో ప్రభాకర్‌రావు నిఘా విభాగానికి బదిలీ అయ్యారు. దీంతో ఆయన్ను సంప్రదించిన ప్రణీత్ కూడా అందులోకే వచ్చారు. ప్రణీత్‌కు సీనియారిటీ ప్రాతిపదికన 2017లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి వచ్చింది. అదే సమయంలో ప్రభాకర్‌రావు సైతం డీఐజీ నుంచి ఐజీగా పదోన్నతి పొంది ఎస్ఐబీ చీఫ్‌గా మారారు. అదే సామాజిక వర్గానికి చెందిన ఎస్పీ వేణుగోపాల్‌రావు వద్ద పని చేయాలని ప్రణీత్‌కు ప్రభాకర్‌రావు సూచించారు. అప్పటి నుంచి ప్రణీత్ నేరుగా వీరిద్దరికి మాత్రమే రిపోర్ట్ చేసేవారు. ఎవరిపై నిఘా ఉంచాలి, ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేయాలనే వివరాలు వీరిద్దరి నుంచి ప్రణీత్‌కు అందేవి.

అక్రమ ట్యాపింగే ప్రధాన విధిగా..

ప్రభాకర్‌రావు చొరవతోనే ప్రణీత్‌కు 2023లో యాక్సిలేటరీ పదోన్నతి వచ్చింది. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ఏర్పాటు చేసుకున్న ప్రణీత్‌కు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్సైలు, మరో ఇద్దరు ఏఎస్సైలు, ముగ్గురు కానిస్టేబుళ్లను కేటాయించారు. ఎస్ఐబీ కార్యాలయం మొదటి అంతస్తులో వీరి కోసం రెండు గదులు కేటాయించారు. వాటిలోనే లాగర్ రూమ్స్ ఏర్పాటు చేసుకున్న ప్రణీత్ 17 కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌తో అక్రమ ఫోన్ ట్యాపింగ్‌ల కథ నడిపారు. బీఆర్ఎస్‌లోని అసమ్మతి నేతలు, అసంతృప్తులతో పాటు ప్రతిపక్షాలపై నిఘా పెట్టడం కోసం అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడటమే ఎస్ఓటీ ప్రధాన విధిగా పని చేసింది. ప్రభాకర్‌రావు ఆదేశాలతో చేసిన అనేక ఆపరేషన్ల వివరాలు దర్యాప్తు అధికారుల వద్ద వెల్లడించడానికి నిరాకరించిన ప్రణీత్ 1,000 నుంచి 1,200 మంది ఫోన్లు ట్యాపింగ్ చేశామని బయటపెట్టారు. వారి వివరాలను సైతం బయటకు చెప్పనంటూ పోలీసులకు స్పష్టం చేశారు.

ప్రణీత్ వద్ద 8 ఫోన్లు


ఎస్ఓటీ పనిని పర్యవేక్షించడానికి, టీమ్‌లోని వారితో సంప్రదింపులు జరపడానికి ప్రణీత్‌రావు 8 ఫోన్లు నిర్వహించారు. వీటిలో 3 అధికారిక నంబర్లు కాగా, మిగిలినవి వ్యక్తిగతమైనవి. ఎన్నికలు, ఉప ఎన్నికల సమయంలో అనేక మంది ఫోన్లు ట్యాప్ చేసిన ప్రణీత్ టీమ్ ప్రధానంగా నగదు రవాణాపై దృష్టి పెట్టింది. ఎస్ఓటీ నిఘాలో ఉన్న వారిలో ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థులతోపాటు వారికి ఆర్థిక సహాయం చేస్తున్న వ్యాపారులు, ఫైనాన్షియర్లు కూడా ఉన్నారు. వీరి ఫోన్లు ట్యాప్ చేయడంతోపాటు కదలికల్ని పసిగట్టిన ప్రణీత్ బృందం ఆ సమాచారాన్ని ఆయా జిల్లాలకు చెందిన పోలీసులకు అందించేది. ఆ బృందాలు వాళ్ల రవాణా చేస్తున్న నగదును స్వాధీనం చేసుకునేవి. అయితే ప్రతిపక్షాలతోపాటు ఎన్నికల సంఘాన్నీ తప్పుదోవ పట్టించిన ప్రణీత్ టీమ్ ఈ నగదుకు హవాలా రంగు పూసింది. ట్యాపింగ్, నిఘాకు వినియోగించిన ఉపకరణాల్లో కొన్నింటిని నగరానికి చెందిన కన్వర్జెన్స్ ఇన్నోవేషన్స్ ల్యాబ్ అనే సంస్థ నుంచి సమీకరించుకున్నారు.

బీఆర్ఎస్ ఓడిపోతోందని...

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతోందని గత నవంబర్ 30న ఎగ్జిట్ పోల్స్‌లో రావడంతో ఆ రోజు నుంచి ట్యాపింగ్ కార్యకలాపాలు ఆపేయాలని ప్రభాకర్‌రావు ఆదేశించారు. డిసెంబర్ 4న ఫలితాలు వెలువడటంతోనే తన పోస్టుకు రాజీనామా చేసిన ప్రభాకర్‌రావు ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు ధ్వంసం చేయాలని ప్రణీత్‌కు సూచించారు. దీంతో ప్రణీత్ అదే రోజు రాత్రి 7.30 నుంచి 8.15 గంటల వరకు సీసీ కెమెరాలు ఆఫ్ చేసి కన్వర్జెన్స్ ఇన్నోవేషన్స్ ల్యాబ్ సంస్థకు చెందిన శ్రీనివాస్, అనంత్ సహకారంతో హార్డ్‌డిస్క్‌లు, డాక్యుమెంట్లు బయటకు తీశారు. సర్వర్లు తదితరాలను వారిద్దరికీ అప్పగించి... 50 హార్డ్‌డిస్క్‌ల్ని ఆర్ఎస్సై హరికృష్ణతో కలిసి ధ్వంసం చేశారు. హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణ ద్వారా ఈ హార్డ్‌డిస్క్‌ల్ని ఎలక్ట్రిక్ కట్టర్‌తో ముక్కలు చేయించారు. కంప్యూటర్లను ఫార్మాట్ చేసి, పత్రాలను ఎస్ఐబీ కార్యాలయం ఆవరణలోనే కాల్చేసిన ప్రణీత్‌రావు హార్డ్‌డిస్క్ ముక్కల్ని మాత్రం నాగోల్, మూసారాంబాగ్ వద్ద మూసీ నదిలో పారేశారు. ఫార్మాట్ చేసిన సెల్‌ఫోన్లు, పెన్‌డ్రైవ్స్‌ని బేగంపేట నాలాలో విసిరేశారు. ఎట్టకేలకు విషయం బయటకు రావడంతో పంజగుట్టలో కేసు నమోదై అరెస్టులు చోటు చేసుకున్నాయి.

లోగో మార్పిడిపై బీఆర్ఎస్ నిరసన

నేడు చార్మినార్ వద్ద కేటీఆర్ ఆధ్వర్యంలో ధర్నా



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ అధికారిక లోగో నుంచి చారిత్రక చిహ్నాలు చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగించడంపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. కాకతీయ కళాతోరణం తొలగింపుపై బుధవారం వరంగల్ కోటలో నిరసన తెలిపిన బీఆర్ఎస్.. చార్మినార్ చిహ్నం తొలగింపుపైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు గురువారం ఉదయం 10.30 గంటలకు చార్మినార్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఓ వైపు రాష్ట్ర అధికార గీతంగా ప్రకటించనున్న 'జయ జయహే తెలంగాణ' గీతంలో చార్మినార్ గొప్పతనం, కాకతీయుల కళాప్రభను కీర్తిస్తూ మరో వైపు తెలంగాణ అధికారిక లోగో నుంచి రాజరిక చిహ్నాలుగా పేర్కొంటూ తొలగించడంపై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. వరంగల్‌లో నిరసన కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు అన్ని జిల్లాల్లోనూ నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వాలని భావిస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న అధికారిక చిహ్నానికి సంబంధించిన వివరాలు అధికారికంగా వెలువడిన తర్వాతే పూర్తి స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

ధాన్యం కొనేవారు లేరు.. విత్తనాలు అమ్మేవారు లేరు

సాక్షి, హైదరాబాద్: 'విత్తనాల కోసం రైతులు పడుతున్న వెతలు ప్రభుత్వానికి పట్టడం లేదు, రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా లేనట్లా' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రశ్నించారు. 'పర్యవేక్షించాల్సిన వ్యవసాయ మంత్రి ఎక్కడున్నారు, ముందుచూపులేని ముఖ్యమంత్రి జాడేది' అని బుధవారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో నిలదీశారు. 'ఎన్నికల ప్రచారంలో తిరగడం తప్ప ఎన్ని ఎకరాలకు విత్తనాలు అవసరమో లెక్కలేదా? నిన్నటి దాకా ధాన్యం అమ్ముకుందామంటే కొనేవారు లేరు. నేడు విత్తనాలు కొందామంటే అమ్మేవారు లేరు. రాష్ట్రంలో పాలన పూర్తిగా పడకేసిందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి. సాగునీళ్లు ఇవ్వడం చేతకాక పంటలు ఎండబెట్టిన ప్రభుత్వానికి

ప్రభుత్వం ఉన్నట్లా.. లేనట్లా?: కేటీఆర్

ప్రస్తుతం కనీసం విత్తనాలు ఇచ్చే దూరదృష్టి కూడా లేదా? తెల్లవారుజామున 4 గంటలకు లైన్లో నిలబడితే సాయంత్రం 4 గంటల వరకూ విత్తనాలు ఇవ్వలేరా. గడిచిన పదేళ్లలో పది నిమిషాల్లో విత్తనాలు చేతికి అందితే ఇప్పుడు రైతులు పది గంటలపాటు పడిగాపులు పడినా ఫలితం ఉండటం లేదు. బీఆర్ఎస్ పాలనలో పండుగలా సాగిన వ్యవసాయాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ఆగం చేసింది. ఇప్పటికైనా రైతుల అవసరాలకు సరిపడా విత్తనాలు తెప్పించండి. అన్నదాతల సమస్యలు పరిష్కరించకుంటే రైతుల సంఘటిత శక్తిని ప్రభుత్వానికి చూపిస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

కేసీఆర్‌ను బదనాం చేసేందుకే 'ఫోన్ ట్యాపింగ్'

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుతో పాటు పార్టీ నేతలను బదనాం చేయడమే లక్ష్యంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడుస్తోందని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు తెరమీదకు వస్తున్న నేపథ్యంలో డైలీ సీరియల్‌ను తలపిస్తూ ఏదో ఒక లీకు ఇస్తూ ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఇప్పటివరకు ప్రభుత్వం, సీఎం, మంత్రులు ఒక్క అధికారిక ప్రకటన కూడా చేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, పార్టీ నేత అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. వ్యవస్థలో భాగంగా జరిగే ఫోన్ ట్యాపింగ్‌పై రోజువారీ లీకులు ఇస్తూ వార్తలు రాయించడం, తీర్పులు ఇవ్వడం కూడా నేరమేనని నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో భాగంగా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన వ్యక్తి.. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని, లై డిటెక్టర్ పరీక్షల గురించి సీఎం మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. లీకులతో వార్తలు రాయిస్తున్న సూత్రధారులపై లీగల్‌గా ముందుకు వెళ్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజకీయ దుగ్ధతో కేసీఆర్‌పై అభాండాలు మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విఫలమైతే మల్లన్నసాగర్ నుంచి మూసీ, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌కు నీళ్లు తేవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రైతుల నడ్డి విరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లకు బోనస్ ఇవ్వడం సహా అన్ని అంశాల్లోనూ మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీదే గెలుపు



- కాంగ్రెస్ సరిగా పనిచేయకపోతే ప్రజలు ఎదురు తిరుగుతారు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సీఎం రేవంత్ ఎందుకు మౌనం వహిస్తున్నారు?
- బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీదే గెలుపని ఆ పార్టీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ప్రజలు ఎదురు తిరిగే అవకాశం ఉందన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు జరిగితే బీజేపీనే అధికారంలోకి వస్తుందంటూ జోస్యం చెప్పారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలన్నారు. తప్పు చేసిన వారిని జైలుకు పంపిస్తామని రేవంత్ చెప్పిన మాటలను గుర్తు చేశారు. రేవంత్ కూడా ఫోన్ ట్యాపింగ్‌లో ఓ బాధితుడే కదా అన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్, హరీశ్‌రావుల ప్రమేయం ఉందని ఆ కేసులో నిందితులుగా ఉన్న పోలీసులే విచారణలో చెప్పినా చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణాలను సీఎం రేవంత్ వెల్లడించాలని నిలదీశారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ విలీనం అవుతుందని ఆరోపించారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో జైలుకెళ్లిన ఎమ్మెల్సీ కవితను బయటకు తెచ్చేందుకే ఎమ్మెల్యేల కొనుగోలు కేసును తెరమీదకు తెచ్చారని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును తక్షణం సీబీఐకి అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. ఇక తెలంగాణ పాటగా అందెశ్రీ పాటను తాము ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

బీజేపీ నేత రామచంద్రరావుకు 'ఆటా' ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకు అమెరికాలోని అట్లాంటాలో జరగనున్న 18వ అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) కన్వెన్షన్, యూత్ కాన్ఫరెన్స్‌కు గౌరవ అతిథిగా బీజేపీనేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావును ఆహ్వానించింది. ఈ సభల్లో భాగంగా నిర్వహిస్తున్న రాజకీయసమావేశాల్లో బీజేపీ తరఫున ఆయన ప్రసంగించనున్నారు. ఈ మేరకు ఆయనకు ఆటా అధ్యక్షుడు మధు బొమ్మినేని, కన్వీనర్ కిరణ్‌రెడ్డి పాశం నుంచి ఆహ్వానం అందింది. ఇదిలా ఉండగా...ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు రామచంద్రరావు వచ్చేనెల 7న ఇక్కడి నుంచి బయల్దేరనున్నారు.

క్లుప్తంగా...

నేటి నుంచి టీఎస్ లాసెట్-2024 హాల్‌టికెట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: జూన్ 3న జరగనున్న టీఎస్ లాసెట్, పీజీఎల్‌సెట్-2024 హాల్ టికెట్లను https://lawcet. tsche.ac.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి బుధవారం తెలిపారు. మూడు విడతలుగా జరిగేలా కోర్సుల ప్రవేశ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 68 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సు కు 36,079 మంది, అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీకి 10,197 మంది, ఎల్‌ఎల్‌ఎం కోర్సుకు 4,408 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మూడేళ్ల లాసెట్ పరీక్ష 3వ తేదీన ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకూ జరుగుతుందని వెల్లడించారు. పీజీ లాసెట్ సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకూ జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యాశాఖలో డిపార్ట్‌మెంట్ పరీక్షలు వాయిదా

సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలో గెజిటెడ్ ఆఫీసర్ ఉద్యోగాలకు నిర్వహించే డిపార్ట్‌మెంట్ టెస్ట్ పేపర్ కోడ్ 88, 97 పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. జూన్ 12, 21 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించే ఈ పరీక్షలను ఉద్యోగుల వినతుల మేరకు వాయిదా వేస్తున్నట్లు స్పష్టం చేసింది. కొత్త తేదీలను త్వరలో వెల్లడిస్తామని తెలిపింది.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

రెండో పే రివిజన్ కమిషన్‌ను కోరిన ఉద్యోగుల సంఘం

సాక్షి, హైదరాబాద్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం కోరింది. ప్రతి సంవత్సరం ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, పదోన్నతులకు సంబంధించి కేలండర్ విడుదల చేయాలని పేర్కొంది. ఈ మేరకు బుధవారం రెండో పే రివిజన్ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మార్త రమేశ్, ఆకుల వెంకట్‌రావు, ఉపాధ్యక్షుడు దేవేందర్ తదితరులు కలిసి 20 ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. 51 శాతంగా ఫిట్‌మెంట్ ఇవ్వాలని, రూ.36 వేలు కనీస వేతనం ఉండాలని, హెచ్‌ఆర్‌ఏ అలవెన్స్‌లను 12, 14, 20, 30 శాతం పద్ధతిలో పునరుద్ధరించాలని, రిటైర్‌మెంట్ గ్రాట్యుటీ రూ. 25 లక్షలకు పెంచాలని వివరించారు. వాలంటరీ రిటైర్‌మెంట్ సర్వీసును 15 ఏళ్లకు తగ్గించాలని, సర్వీసులో చనిపోయిన ఉద్యోగ కుటుంబంలో కారుణ్య నియామకానికి అర్హత లేకపోతే వారికి ప్రోత్సాహం ఇవ్వాలని కమిషన్‌ను సంఘం నేతలు కోరారు.

ఫీజు బకాయిల విడుదలకు వినతి

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం సమర్పించారు. మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల నిధులు విడుదల చేయకపోవడంతో దాదాపు రూ.7వేల కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేయాలని జాజుల కోరారు.

317 జీవో బాధితులకు న్యాయం చేయాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, 13 జిల్లాల్లో స్పౌజ్‌ల బదిలీకి ఉత్తర్వులు ఇవ్వాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్వతీ సత్యనారాయణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత సెప్టెంబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతన స్కేల్ ఇవ్వాలని కోరారు.

ఫిజిక్స్ టీచర్లను గణితం బోధించమనడం అన్యాయం

ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ తెలంగాణ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ టీచర్లను ఆరు, ఏడు తరగతులకు గణితం బోధించమంటూ విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాలు సహేతుకంగా లేవని ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్, తెలంగాణ స్టేట్ ప్రతినిధులు తెలిపారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌సింగ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ నేతృత్వంలోని బృందం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశానికి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల కన్నా, గణితం చెప్పే టీచర్లు 20 శాతం ఎక్కువగా ఉన్నారని తెలిపారు. కొత్త నిబంధన వల్ల ఒక్కో టీచర్ వారానికి 30 పీరియడ్లు చెప్పాల్సి వస్తుందని, దీనివల్ల ఒత్తిడికి లోనయ్యే ప్రమాదం ఉందని వివరించారు. ఈ కారణంగా ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుకు కూడా న్యాయం చేసే అవకాశం ఉండదన్నారు. వెంటనే ఈ ఆదేశాలు వెనక్కి తీసుకోవాలని కోరారు.

పోలీసుల అదుపులో ముగ్గురు తహసీల్దార్లు!

- ఒక వీఆర్వోతో పాటు మరికొందరు కూడా..
- అసైన్డ్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారమే కారణం

నల్లగొండ క్రైం/నిడమనూరు: అసైన్డ్ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారనే అభియోగంతో నల్లగొండ జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లు, ఒక వీఆర్వోను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. నిడమనూరు మండలం తుమ్మడం రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను మార్తివారిగూడేనికి చెందిన మార్తి సురేందర్‌రెడ్డి, అతని కుటుంబసభ్యులు అక్రమ మార్గాల్లో పట్టా చేయించుకున్నారని, అదే గ్రామానికి చెందిన మార్తి వెంకట్‌రెడ్డి 2022లో విజిలెన్స్ అధికారులు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని సురేందర్‌రెడ్డితోపాటు ఆయన భార్య, తల్లిపేరుతో పట్టా చేశారని, అంతేగాక వీఆర్వో వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే వ్యక్తి కూడా తన పేరుతోపాటు భార్య, తండ్రి పేరుతో ఏడు ఎకరాలు పట్టా చేయించుకున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఆ ఫిర్యాదుపై అప్పుడే రంగంలోకి దిగిన పోలీసులు, అధికార పార్టీ నేతల హస్తం ఉండడంతో విచారణ ముందుకు సాగించలేకపోయారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరోసారి పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమంగా పట్టా చేసుకున్న వారిలో ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంలో ఒక తహసీల్దార్ ఫైల్ పెట్టగా, మరొక తహసీల్దార్ ప్రభుత్వానికి, అసైన్డ్ కమిటీకి ఫార్వర్డ్ చేయగా, ఇంకో తహసీల్దార్ పట్టా జారీ చేసినట్టు తెలిసింది. ఈ విషయంపై హైకోర్టులో కేసు వేయగా, కోర్టు ఆదేశాలను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కేసు వేసిన వ్యక్తులు మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో.. కోర్టు ధిక్కరణ కింద అధికారులు, పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దీంతో పోలీసులు బుధవారం ఆయా రెవెన్యూ అధికారులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం.

నగలు ధరిస్తే నో ఎంట్రీ



▶ మొదటి పేజీ తరువాయి

గేట్లు మూసివేస్తారు. ముఖ్యంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థి ఎలాంటి నగలు (జ్యువెల్లరీ) ధరించకూడదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలకు ఈ తరహా నిబంధన గతంలో ఎప్పుడూ పెట్టకపోవడం గమనార్హం. జ్యువెల్లరీ అని సూచనలో పేర్కొన్నప్పటికీ ఎలాంటి నగలు ధరించకూడదనే అంశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇక అభ్యర్థులు కేవలం చెప్పులు మాత్రమే ధరించాలి. బూట్లు వేసుకుని రాకూడదు. గ్రూప్–1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పాటించాల్సిన సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షా విధానం, ఓఎంఆర్ షీట్ నమూనా తదితరాలకు సంబంధించిన వివరాలను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ బుధవారం వెల్లడించారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

- ప్రింటెడ్ హాల్ టికెట్లో అభ్యర్థి ఫొటోగ్రాఫ్, సంతకం స్పష్టంగా ఉన్నప్పుడే అది చెల్లుబాటు అవుతుంది. కాబట్టి లేజర్ ప్రింటర్‌తో లేదా కలర్ ప్రింటర్‌తో ఏ4 సైజు కాగితంపై ముద్రించిన హాల్ టికెట్‌ని తీసుకోవాలి. పరీక్షా కేంద్రానికి వచ్చే ముందు ప్రింటెడ్ హాల్ టికెట్‌లోని నిర్దేశిత స్థలంలో అభ్యర్థి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అతికించాలి. లేనిపక్షంలో అనుమతించరు.
- ఒకవేళ డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్‌లో అస్పష్టమైన ఫొటో ఉన్నట్లయితే, అభ్యర్థి మూడు (3) పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను విధిగా అండర్ టేకింగ్‌తో పాటు చివరిగా చదువుకున్న విద్యా సంస్థ గెజిటెడ్ అధికారి/ప్రిన్సిపాల్ చేత ధ్రువీకరణతో తీసుకురావాలి (ఫార్మాట్ వెబ్‌సైట్ https://www.tspsc.gov.in)లో అందుబాటులో ఉంది). లేకుంటే పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
- పరీక్ష కేంద్రంలో ప్రవేశించిన అభ్యర్థి నుంచి బయోమెట్రిక్ వేలిముద్రలు సేకరిస్తారు. ఒకవేళ బయోమెట్రిక్ ఇవ్వకుంటే సదరు అభ్యర్థి జవాబు పత్రం మూల్యాంకనం చేయబోమని కమిషన్ స్పష్టం చేసింది. ఉదయం 9.30 నుంచే దీనిని ప్రారంభిస్తారు. బయోమెట్రిక్ పూర్తయ్యేవరకు అభ్యర్థులెవరూ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లడానికి వీల్లేదు. అభ్యర్థుల సౌకర్యార్థం అరగంటకోసారి బెల్ మోగించి పరీక్ష సమయాన్ని తెలియజేస్తారు. అవసరమైతే ఇన్విజిలేటర్లను అడిగి సమయం తెలుసుకోవచ్చు.
- అభ్యర్థులకు వ్యక్తిగత సమాచారం ముద్రించిన ఓఎంఆర్ జవాబుపత్రాన్ని ఇస్తారు. అభ్యర్థులు ఓంఎఆర్, ప్రశ్నపత్రంలో ముద్రించిన నిబంధనలు సూచనలు పాటించాలి. అభ్యర్థుల సౌకర్యార్థం నమూనా ఓఎంఆర్ పత్రాన్ని కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ కాపీని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. అందులోని సూచనల ప్రకారం సరైన విధానంలో వివరాలు రాయడంతో పాటు బబ్లింగ్ చేయడాన్ని ప్రాక్టీస్ చేసుకోవాలి.
- అభ్యర్థులు పరీక్ష ముగిసేవరకు పరీక్ష కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదు పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ పత్రాన్ని ఇన్విజిలేటర్‌కు అప్పగించాలి. హాల్ టికెట్‌పై ముద్రించిన సూచనల కాపీని కూడా కమిషన్ ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సూచనలు జాగ్రత్తగా చదివి పరీక్ష సమయంలో వాటిని పాటించాలి. అభ్యర్థులు పొరపాట్లు చేసినా, ఓఎంఆర్, హాల్ టికెట్లలోని నిబంధనలు పాటించకున్నా.. కమిషన్ ఎలాంటి బాధ్యత వహించదు.

2022 కానిస్టేబుల్ అభ్యర్థులను శిక్షణకు పంపించాలి: ఆర్.కృష్ణయ్య



పంజగుట్ట (హైదరాబాద్): కానిస్టేబుల్–2022 పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులను చిన్నచిన్న కారణాలు చూపి శిక్షణకు పంపకపోవడం అన్యాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆ అభ్యర్థులపై వివిధ కారణలతో అకారణంగా పెట్టిన కేసులు, స్కూల్ బోనఫైడ్ సర్టిఫికెట్ లేదన్న కారణాలతో సెలక్షన్ ఆర్డర్ అందుకున్నప్పటికీ శిక్షణకు మాత్రం పంపించలేదని, ఇలాంటి చిన్నచిన్న కేసులు ఎత్తివేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీరిని కూడా శిక్షణకు పంపించాలని ఆయన కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 2022 కానిస్టేబుల్ అభ్యర్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులను వెంటనే శిక్షణకు పంపకపోతే ప్రజాసంఘాలు, బీసీ, దళిత సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని, తదుపరి జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని కృష్ణయ్య హెచ్చరించారు.

ఫీడర్లలో అంతరాయాలు తగ్గించాం

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



హనుమకొండ: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని ఆర్‌టీడీఏఎస్, స్కాడా ద్వారా 569 ఫీడర్లలో అంతరాయాలు గణనీయంగా తగ్గించామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ తెలిపారు. మానవ ప్రమేయం లేకుండా రియల్ టైమ్ డాటా అక్విజిషన్, సూపర్‌వైజరీ డాటా అక్విజిషన్ ద్వారా 569 ఫీడర్లలో గత ఏడాది జనవరి నుంచి మే వరకు 11కేవీ ట్రిప్పింగ్స్ 57,771 ఉండగా.. ఈ ఏడాది అదే కాలానికి 40,724 నమోదయ్యాయన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే 17,047 ట్రిప్పింగ్‌లు తగ్గాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది జనవరి నుంచి మే వరకు 10,558 గంటలు అంతరాయాలు ఉండగా ఈ ఏడాది అదే కాలానికి 7,262 గంటలు నమోదయ్యాయని, 3,296 గంటల అంతరాయాల సమయాన్ని తగ్గించగలిగామని వివరించారు. ప్రీ మాన్‌సూన్ ఇన్‌స్పెక్షన్, విద్యుత్ లైన్ల నిర్వహణ, జంపర్లు, వంగిన స్తంభాలను సరిచేయడం ద్వారా అంతరాయాలు తగ్గించామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత నాణ్యమైన, మెరుగైన విద్యుత్ అందించడానికి అహర్నిశలు కృషి చేస్తామని వివరించారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

నెన్నెల/తాండూర్ (మంచిర్యాల జిల్లా): మంచిర్యాల జిల్లాలో బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన హమాలీ కార్మికుడు తోట తిరుపతి(36), తాండూర్ మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు టోకెమ్ భీమ్‌రావు(26) వడదెబ్బకు గురై చనిపోయారు.

కుల గణన కమిషన్ ఏర్పాటు చేయాలి: జాజుల



అభివాదం చేస్తున్న వివిధ బీసీ కుల సంఘాల నాయకులు


పంజగుట్ట (హైదరాబాద్): బీసీల రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. జూన్ 5 తర్వాత ఎన్నికల కోడ్ ముగియగానే కుల గణన కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం, బీసీ కుల సంఘాల జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో 'స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లు భవిష్యత్ కార్యాచరణ'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాజుల మాట్లాడుతూ తాము కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి తేవడంతో ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడమే కాకుండా, స్వయంగా రాహుల్‌గాంధీ కులగణన జరిపి రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు కులగణన చేపడతామని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, జీవో 26 తీసుకొచ్చి రూ.150 కోట్ల బడ్జెట్ కూడా కేటాయించారని గుర్తుచేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ కులగణన ద్వారానే భవిష్యత్‌లో న్యాయపరమైన వివాదాలు లేకుండా రిజర్వేషన్లు పెంచుకోవచ్చని తెలిపారు. బీసీలకు అన్ని నామినేటెడ్ పోస్టుల్లో, వైస్‌చాన్స్‌లర్ పదవుల్లో 50 శాతం ఇవ్వాలన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, ప్రొఫెసర్ ఇ.వెంకటేశ్, చిన్న శ్రీశైలం యాదవ్, బాలగోని బాలరాజు, వేముల వెంకటేశం, కనకాల శ్యామ్ కురుమ, భైరి రవికృష్ణ, పలు కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోహిణి భగభగలు అంతంతే!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాంతాల్లో తక్కువగా 25, 26, 27 డిగ్రీల మేరకే నమోదు అవుతున్నాయి. బుధవారం కనిష్టంగా నల్లగొండలో 25.0 డిగ్రీ సెల్సీయస్ నమోదైంది. వాతావరణంలో నెలకొన్న మార్పుల ప్రభావంతోనే గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రానున్న రెండ్రోజులు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇలావుండగా రాష్ట్రంలో అత్యధికంగా మంచిర్యాల జిల్లా కొండాపూర్‌లో 46.4 డిగ్రీ సెల్సీయస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం, బెల్లంపల్లిలో 45.8, ఆసిఫాబాద్‌లో 45.2 డిగ్రీ సెల్సీయస్ చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నేడు కేరళను తాకనున్న నైరుతి: బంగాళాఖాతంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు గురువారం కేరళను తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవనాల విస్తరణకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు తెలిపింది. కేరళను తాకిన వారం రోజుల్లో ఏపీకి విస్తరించి ఆ తర్వాత తెలంగాణలోకి ప్రవేశిస్తాయని వివరించింది.



ఇప్పట్లో 'స్థానిక' ఎన్నికలు లేనట్టేనా?



▶ మొదటి పేజీ తరువాయి

సందర్భంగా వెలువరించిన జాబితా) ప్రాతిపదికన పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలను నోడల్ ఏజెన్సీలుగా నియమించి.. ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఓటర్ల వివరాలను సేకరించాలని బీసీ కమిషన్ భావిస్తున్నట్టు కమిషన్ వర్గాల సమాచారం. అయితే ఇప్పుడు ఓటర్ల లిస్ట్‌కు అనుగుణంగానా? లేక క్షేత్రస్థాయిలో చేపట్టే సామాజిక, ఆర్థిక, కుల సర్వే ఆధారంగా ముందుకెళ్లాలా అనే దానిపై స్పష్టత కొరవడినట్టు సమాచారం.

ఈ కసరత్తు జరిగితే... ఆగస్ట్, సెప్టెంబర్‌లో ఎన్నికలు?

ఓటర్ల జాబితాకు అనుగుణంగా అయితే పెద్దగా శ్రమ లేకుండా త్వరగానే క్షేత్రస్థాయిలో ఆయా సామాజికవర్గాల జనాభా వివరాలు తేల్చవచ్చునని, సామాజిక, ఆర్థిక కుల సర్వే అయితే ఇంకా సమయం ఎక్కువ పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓటర్ల జాబితా ప్రకారం కసరత్తు పూర్తిచేసి ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించుకోవచ్చుననే సూచనలను రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ కమిషన్ ద్వారా వెళ్లినట్టుగా తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అంటున్నారు. ఒకవేళ ఈ ఆలోచనకు ప్రభుత్వపెద్దలు ఓకే చెబితే రిజర్వేషన్ల ఖరారు పూర్తిచేసి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు పంపిస్తే ఆగస్ చివర్లో లేదా సెప్టెంబర్‌లో ముందుగా గ్రామపంచాయతీ ఆ తర్వాత జిల్లా, మండలపరిషత్ ఎన్నికల నిర్వహణకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది మొదట్లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలు నిర్వహించుకోవచ్చుననే అభిప్రాయపడుతున్నారు.

కొత్త కమిషన్ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారా?

ఈ ఆగస్టుతో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం కూడా ముగియనుంది. ఈ పరిస్థితుల్లో పాత కమిషన్ ఆధ్వర్యంలోనే బీసీ జనగణన కసరత్తును పూర్తిచేసి ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళుతుందా ? లేక కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసుకునే బీసీ కమిషన్ ద్వారానే ఈ కార్యాచరణను నిర్వహిస్తారా అన్నది కూడా అధికారవర్గాల్లో చర్చకు వస్తోంది. ఆగస్ట్‌లో కొత్తగా బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించాక... బీసీ జనగణనకు సంబంధించిన కార్యక్రమం చేపట్టాలని భావిస్తే మాత్రం ఈ ఎన్నికల నిర్వహణ ఇంకా ఆలస్యం కావొచ్చునని భావిస్తున్నారు. దీనిని బట్టి ఈ ఎన్నికలు ఏడాది చివరి వరకు వెళ్లొచ్చుననే ఊహాగానాలు సాగుతున్నాయి. దీంతో ఏ ఎన్నికలు ముందు జరుగుతాయి ? ముందుగా జీపీ ఎన్నికలుంటాయా లేక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎలక్షన్లు మొదట నిర్వహిస్తారా? లేక ఈ ఏడాది చివర్లో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకటి తర్వాత మరొకటి వరుసగా నిర్వహిస్తారా అన్న దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ఇదిలా ఉంటే... తొలుత జీపీ ఆ తర్వాత 10, 15 రోజులకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్

ఉగ్రవాదులకు సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్‌నంబర్ ఇచ్చానని గోషామహల్ ఎమ్మెల్యే వెల్లడి



అబిడ్స్(హైదరాబాద్): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మరోసారి బెదిరింపు కాల్స్ వచ్చాయి. బుధవారం ఉదయం 9.19 గంటల నుంచి క్రమం తప్పకుండా తన ఫోన్‌కు గుర్తు తెలియనివ్యక్తులు బెదిరింపు కాల్స్ చేస్తూనే ఉన్నారని రాజాసింగ్ సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు. చేసిన ప్రతిసారి ఒక్కో నంబర్ నుంచి కాల్స్ వస్తున్నాయని చెప్పారు. కొన్నిసార్లు వాయిస్ మెసేజ్ కూడా చేసి బెదిరిస్తున్నారన్నారు. వచ్చిన కాల్స్‌లో పాలస్తీనాకు చెందిన ఒక తీవ్రవాది ఫొటో, నంబరు స్పష్టంగా కనిపించిందని రాజాసింగ్ వెల్లడించారు. బెదిరింపు కాల్స్ చేసిన వ్యక్తి తనను ఇంకో నంబరు ఉందా? అని అడిగాడని, దానికి సమాధానంగా గూగుల్‌లో అన్వేషించి సీఎం రేవంత్‌రెడ్డి నంబర్‌ను ఇచ్చానని తన వీడియోలో పేర్కొన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో కూడా ఇలాంటి బెదిరింపు కాల్స్ చాలాసార్లు వచ్చాయని, పోలీసు ఉన్నతాధికారులు, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదన్నారు. ఒక ఎమ్మెల్యేకు బెదిరింపు కాల్స్ వస్తే అది ఎవరు చేస్తున్నారు, ఎందుకు చేస్తున్నారన్నది కూడా పోలీసులు తెలుసుకోలేకపోయారని ఆ శాఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, మళ్లీ బెదిరింపు కాల్స్ వస్తున్నందున సీఎం రేవంత్‌రెడ్డి నంబర్‌ను ఇచ్చానని, ఒకవేళ ఆ వ్యక్తులు ఆ నంబరకు బెదిరింపు కాల్స్ చేస్తే ప్రభుత్వం, పోలీసులు విచారణ జరిపిస్తారేమో అనే భావంతోనే సీఎం నంబర్ ఇచ్చానంటూ రాజాసింగ్ వెల్లడించారు.

కబళించిన కాలువ

- బాపట్ల జిల్లా నల్లమడ డ్రెయిన్‌లో నలుగురు గల్లంతు
- ఇద్దరి మృతదేహాలు లభ్యం..ఇద్దరి కోసం గాలింపు
- బంధువుల ఇంటికొచ్చి..అనంత లోకాలకు



నల్లమడ డ్రెయిన్‌లో గల్లంతైన వారికోసం గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది

బాపట్ల టౌన్: వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి వచ్చి సరదాగా గడుపుదామనుకున్న వ్యక్తులు మార్గ మధ్యలోనే కానరాని లోకాలకు వెళ్లిపోయారు. ఈ ఘటన బాపట్ల జిల్లా అప్పికట్ల శివారులో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల పట్టణం, క్రిష్టియన్‌పేటకు చెందిన దొరబడి సునీల్ కొన్నేళ్ళ క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వేసవి సెలవులకు కుటుంబ సమేతంగా బంధువులను కలిసేందుకు పొన్నూరు మండలం వడ్డిముక్కల గ్రామానికి వచ్చారు. అక్కడి నుంచి బుధవారం ఉదయం పర్చూరు మండలం వీరన్నపాలెంలోని బంధువులను కలిసేందుకు 12 మంది వాహనంలో బయల్దేరారు. మార్గమధ్యలో బాపట్ల మార్గంలోని నల్లమడ డ్రెయిన్‌లో స్నానాలు చేసేందుకు వాహనాన్ని నిలిపి నలుగురు కాలువలోకి దిగారు. వారిలో అను రాజ్ అలియాస్ సన్ని (11) కాలువలోకి దిగిన వెంటనే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సన్నిని కాపాడేందుకు అతని తండ్రి సునీల్ కుమార్ (37) కూడా నీటిలో దూకాడు. వారికి ఈత రాకపోవడంతో ఇద్దరూ కాలువలో మునిగిపోయారు. వారిని కాపాడేందుకు పక్కనే ఉన్న నందు, కిరణ్‌లు కాలువలో దిగడంలో వారు కూడా కొట్టుకుపోయారు. రెప్పపాటులో జరిగిన ఈ ఉదంతంతో సంఘటనా స్థలం రోదనలతో మిన్నంటింది. గల్లంతయిన వారిలో తండ్రి కొడుకుల (అనురాజ్, సునీల్ కుమార్) మృతదేహాలు కాలువలో లభ్యమయ్యాయి. నందు, కిరణ్‌ల కోసం డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎన్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో గాలింపు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రూరల్ సీఐ శ్రీహరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ షాపులపై డీసీఏ దాడులు

ఉల్లంఘనలపై చర్యలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఔషధాల ధరలు ఎక్కువ చేసి విక్రయించడం, తప్పుడు లేబుళ్లతో చేస్తున్న ఉల్లంఘనలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) కొరడా ఝుళిపించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలో యాంటీ ఫంగల్ మెడిసిన్ 'ట్రిస్టా–200 క్యాప్సూల్స్'ను ఓ మందులషాపులో కేంద్రం నిర్దేశించిన ఎమ్మార్పీపై చాలా అధిక ధరకు విక్రయిస్తుండడంతో మందులు స్వాధీనం చేసుకున్నట్లు ఔషధ నియంత్రణ సంస్థ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మందు పది క్యాప్సూల్స్‌ను రూ.50.30 అధిక ధరకు విక్రయించినట్టు వివరించారు. అత్యవసర మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని, ఇలాంటి మందులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కళ్ల మందును జ్వరం మందు అంటూ...

కళ్ల వ్యాధి చికిత్సకు ఉపయోగించే మందును.. జ్వరానికి మందు అంటూ తప్పుడు లేబుల్స్‌తో మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న వారిని డీసీఏ గుర్తించిందని కమలాసన్‌రెడ్డి తెలిపారు. పీ–మైసిటిన్ అనే ఆయింట్‌మెంట్ అల్లోపతి మందును కళ్లవ్యాధి చికిత్సకు ఉపయోగించే మందుగా, మహాసుదర్శన కథ అనే ఆయుర్వేదిక్ మందును జ్వరాన్ని తగ్గించేదిగా తప్పుడు ప్రచారం చేయడంపై చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మల్కాజిగిరి జిల్లా కాప్రాలోని ఓ మెడికల్ హాలుపై, ఖమ్మంలో మందుల దుకాణంపై దాడులు చేసి ఆయా మందులు స్వాధీనం చేసుకున్నారు.

గచ్చిబౌలిలో నకిలీ క్లినిక్‌పై దాడి

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో ఓ నకిలీవైద్యురాలు కె. స్వరూప తగిన అర్హతలు లేకుండా 'స్వరూప ఫస్ట్ ఎయిడ్ సెంటర్'పేరిట నిర్వహిస్తున్న క్లినిక్‌పై డీసీఏ అధికారులు దాడి చేసి డ్రగ్ లైసెన్స్‌లు లేకుండా ఉన్న 17 రకాల మందులు (యాంటీ బయోటిక్స్‌తో సహా) స్వాధీనం చేసుకున్నారు.

జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్రకు ప్రత్యేక రైలు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దక్షిణ భారతదేశంలోని జ్యోతిర్లింగాలు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలను దర్శించుకునే యాత్రికుల కోసం భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ 'జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర' పేరుతో ప్రత్యేక భారత్ గౌరవ్ పర్యాటక రైలు నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజు ఒక ప్రకటలో తెలిపారు. జూన్ 22న సికింద్రాబాద్‌లో బయలుదేరే ఈ పర్యటక రైలు అరుణాచలం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తంజావూరు, తిరుచ్చి, త్రివేంద్రం తదితర ప్రాంతాలను సందర్శించి జూన్ 30న తిరిగి సికింద్రాబాద్ చేరుకుంటుంది. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ప్రయాణంలో ఉదయం అల్పాహారం, టీ, మధ్యాహ్నం, రాత్రి భోజనం, పర్యటక ప్రదేశాలను సందర్శించేందుకు రోడ్డు రవాణా సదుపాయం, రాత్రుళ్లు బస ఏర్పాట్లు ఉంటాయి. సికింద్రాబాద్‌లో బయలుదేరే ఈ ప్రత్యేక రైలుకు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్‌లలో యాత్రికులు ఎక్కిదిగేందుకు అవకాశం కల్పించారు. ఈ ప్యాకేజీలో ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్ రూ.14,250, 3 ఏసీ రూ.21,900, 2 ఏసీ రూ.28,450గా ధర నిర్ణయించారు. ఆసక్తి కలిగిన యాత్రికులు ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ లేదా విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయం గాని సెల్ : 9281495848, 8287932312 నంబర్ల ద్వారా టికెట్‌లు బుకింగ్ చేసుకోవచ్చు.

“ ఒక శక్తిమంతమైన ఆత్మ మాత్రమే ప్రేమను ఇవ్వగలదు. ఒక శక్తిమంతమైన ఆత్మ మాత్రమే వినయంగా ఉండగలదు.

– బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 30 మే 2024

వీర ఐపీఎల్ విజయగాథ!

దేశంలో లోక్‌సభ ఎన్నికలకు సమాంతరంగా రెండు నెలల పైగా సాగిన క్రికెట్ వేడి ఎట్టకేలకు ముగిసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ ఎడిషన్‌కు ఆదివారం నాటి ఫైనల్‌తో శుభం కార్డు పడింది. కలకత్తా నైట్ రైడర్స్ (కేకేఆర్), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)ల మధ్య చెన్నైలో జరిగిన తుది సమరం అనూహ్యంగా ఏకపక్షంగా సాగింది. తొమ్మిది ఓవర్లు మిగిలి ఉండగానే, 8 వికెట్ల తేడాతో కేకేఆర్ విజయం సాధించి, కప్ చేజిక్కించుకుంది. 2014 తర్వాత సరిగ్గా దశాబ్ద కాలపు నిరీక్షణకు తెర దించి, మూడోసారి విజేతగా నిలిచింది. ఫైనల్ చప్పగా ముగిసిందన్న మాటే కానీ, గత రెండునెలలుగా ఐపీఎల్ పట్ల జనంలో వ్యక్తమైన ఉత్సాహం, ఉద్వేగాలను తక్కువ చేయలేం. 2008లో ఆరంభమైన ఐపీఎల్ ఏయేటికాయేడు ప్రాచుర్యం పెంచుకుంటూ, ప్రస్తుతం ప్రపంచస్థాయి సంబరంగా మారింది. నరాలు తెగే ఉత్కంఠ, వినోదం అందించే ఈ పొట్టి ఫార్మట్ క్రికెట్ ఆట వీరాభిమానుల నుంచి అదాటుగా చూసేవారి దాకా అందరినీ ఆకర్షించగలుగుతోంది. అంతర్జాతీయ ఆటగాళ్ళతో కలసి ఆడడమే కాక, శిక్షణ, వ్యూహరచనల్లో భాగస్వాములు కావడంతో మన కొత్త తరం ఆటగాళ్ళు రాటుదేలడానికి కావాల్సినంత వీలు చిక్కుతోంది.

ఈసారి మొత్తం 74 మ్యాచ్‌ల ఐపీఎల్ అనేక ఆశ్చర్యాలను ఆవిష్కరించింది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సిక్సులు (1260), అత్యధిక సెంచరీలు, 9 అత్యధిక స్కోర్లలో 8 ఈ సీజన్‌లోనే వచ్చాయి. వాటిలోనూ 5 అత్యధిక స్కోర్లు ఫైనల్‌లో తలపడిన కేకేఆర్, ఎస్ఆర్‌హెచ్‌లు సాధించినవే! విరాట్ కోహ్లీ ఈ సీజన్‌లో 741 పరుగులు చేసి తన ఐపీఎల్ కెరీర్‌లోనే రెండో అత్యధిక పరుగుల వరద పారించాడు. అదీ కనివిని ఎరుగని 154.70 రేటుతో! ఏడు మ్యాచ్‌లలో వరుసగా 6 మ్యాచ్‌లు ఓడి, రెండే రెండు పాయింట్లు సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్టు ఆపైన వరుసగా 6 మ్యాచ్‌లు భారీ తేడాతో గెలిచి, ప్లేఆఫ్ దశకు చేరడం మరో అబ్బురం. ఆశలు వదులుకోకుండా నిలబడి, కలబడితే ఏదైనా సాధ్యమనే పాఠానికి నిదర్శనం. అలాగే, అంకితభావం ఉంటే వయసనేది అడ్డంకి కాదని, గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో 42 ఏళ్ళ ధోనీ గాలిలోకి 3 మీటర్లు గెంతి మరీ ఒంటిచేతితో పట్టిన విజయ్‌శంకర్ క్యాచ్ నిరూపించింది.

శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో కప్ గెలిచిన కేకేఆర్ ఈసారి సాధించిన విజయంలో గమనించాల్సిన ఒక ప్రత్యేకత ఉంది. కేకేఆర్‌లో భారత క్రికెట్ జట్టు మెగాస్టార్స్ ఎవరూ లేరు. అయినా సరే టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచింది. ఆ జట్టు పక్షాన అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్ సునీల్ నరైన్ నిజానికి మొత్తం పట్టికలో 9వ స్థానంలో ఉంటాడు. కానీ, టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి స్కోర్‌బోర్డ్‌ను పరుగులెత్తించిన తీరు, చూపిన ప్రభావం అసామాన్యం. కేకేఆర్ జట్టు కప్పు గెలిచిన గడచిన రెండుసార్లు (2012, 2014) కూడా ఆ యా సీజన్లలో అత్యధిక వికెట్లు (24, 21) తీసింది ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాట్స్‌మన్ కమ్ రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నరే! ఈ సీజన్‌లోనూ 15 వికెట్లు, 488 పరుగులు సాధించి, ముచ్చటగా మూడోసారి 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్' అవార్డు అందుకున్నాడు. సునీల్ కాక మరొక్క టాప్ 20 ఆటగాడు మాత్రమే కేకేఆర్ జట్టులో కనిపిస్తాడు. అయితేనేం, ఆ జట్టు మైదానంలో జోరు కొనసాగించి, విజయతీరాలు చేరింది.

పరుగుల వరద ఎప్పటి కన్నా మరో మెట్టు పైకెక్కి బ్యాట్స్‌మన్ల రాజ్యంగా సాగిన టోర్నీ ఇది. ఈ పరిస్థితుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టే బౌలర్ లేకున్నా టాప్5 బౌలర్లలో ముగ్గురున్న కేకేఆర్ గెలుపు నమోదు చేసింది. అలాగే, కొన్నేళ్ళుగా విజయాలు రాకున్నా... ఇష్టారీతిన జట్టును మార్చేయకుండా, ఆటగాళ్ళను నమ్మి వారిని కొనసాగిస్తే అద్భుతాలు సాధ్యమేనని నిరూపించింది. పస అయిపోయిందని పలువురు విమర్శించినా... సునీల్, వరుణ్ చక్రవర్తి, వెంకటేశ్ అయ్యర్‌లను దీర్ఘకాలంగా జట్టులోనే అట్టిపెట్టుకుంది. ఆసీస్ పేసర్ మిషెల్ స్టార్క్ తాజా టోర్నీలో మొదట రాణించకున్నా అతణ్ణి కొనసాగించింది. అవన్నీ కీలక సమయంలో ఫలించాయి. వెరసి, పేరున్న ఆటగాళ్ళపై అతిగా ఆధారపడ్డ ఇతర ఫ్రాంఛైజీలకు కేకేఆర్ కథలో ఓ పాఠముంది. భారతజట్టులో ఆడకపోతేనేం, ప్రతిభావంతులైన యువతరంతో అద్భుతాలు చేయవచ్చని కేకేఆర్ ప్రస్థానం చాటింది.

ఆదాయంలో, ఆకర్షణలో భారత జాతీయక్రీడ హాకీ సహా అన్నింటినీ క్రికెట్ ఎన్నడో మించిపోయింది. ఐపీఎల్ దెబ్బతో స్థానిక, రాష్ట్ర స్థాయుల్లోనూ టీ20 క్రికెట్ పోటీలొచ్చాయి. మన ఐపీఎల్ మూసలో ఆస్ట్రేలియాలో బిగ్‌బాష్, సౌతాఫ్రికాలో ఎస్ఏ 20 లీగ్, వెస్టిండీస్‌లో కరేబియన్ ప్రీమియర్ లీగ్, పాకిస్తాన్ – బంగ్లాదేశ్ – శ్రీలంకల్లోనూ ఆ యా దేశాల ప్రీమియర్ లీగ్‌లు వచ్చేశాయి. ప్రతిభావంతులైన యువ భారతీయ క్రికెటర్ల ప్రత్యామ్నాయ కెరీర్‌కు ఇది ద్వారాలు తెరిచింది. అదే సమయంలో ఈ వెర్రి పెచ్చుమీరిన బెట్టింగ్ బెడద తెచ్చింది. బ్యాట్‌కూ బంతికీ మధ్య పోటీలో సమతూకాన్ని చెడగొట్టింది. గత 16 విడతల ఐపీఎల్ టోర్నీల్లో మొత్తం 1032 మ్యాచ్‌లు ఆడితే, వాటిలో 250 పైచిలుకు స్కోర్లు వచ్చింది రెండు, మూడు మ్యాచ్‌లలోనే. కానీ, ఈ తడవ ఏకంగా 8సార్లు అది జరిగింది. బ్యాట్స్‌మన్లదే పైచేయిగా మారుతున్న ఈ లోపాన్ని సరిదిద్దేందుకు బీసీసీఐ కొత్త రూల్‌ను ఆలోచించకపోతే కష్టమే. ఏమైనా, ఈ ఏటి ఐపీఎల్ సీజన్ ముగిసింది. రెండేళ్ళకు ఒకసారి జరిగే ఐసీసీ టీ20 వరల్డ్ కప్ ఆదివారం మొదలవుతోంది. రోహిత్‌శర్మ జట్టులో సభ్యులైన కోహ్లీ, పంత్ తదితరులు గనక ప్రస్తుత ఐపీఎల్ ప్రతిభాప్రదర్శననే ఆ వరల్డ్ కప్‌లోనూ కొనసాగిస్తే అంతకన్నా కావాల్సింది ఏముంది! చాలాకాలంగా ఊరిస్తున్న కప్పు మళ్ళీ మన ఇంటికొస్తుంది!!

ఊపు తగ్గిన యూపీ ఎన్నికలు

2024 సార్వత్రిక ఎన్నికల్లో చివరిదైన ఏడవ దశ పోలింగ్ జూన్ 1న జరగనుంది. దేశంలో అత్యధిక ఎంపీ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో ఏడు దశల్లోనూ ఎన్నికలు జరుగుతున్నాయి. జరిగిన ఆరు దశల్లో నమోదైన అత్యల్ప ఓటింగ్ శాతం ఓటర్లలోని నిరుత్సాహాన్ని తెలియజేస్తోంది. ఎన్నికల సరళిని బట్టి బీజేపీ ఉద్దేశపూర్వకంగా తన ప్రాధాన్యాలను మార్చుకోవడం కూడా మిశ్రమ సందేశాన్ని అందిస్తోంది. అయోధ్య రామాలయ విగ్రహ ప్రతిష్ఠ సమయంలో 'మోదీ హవా' కనిపించింది. కానీ అసలైన ఎన్నికల సమయం వచ్చేసరికి దాన్ని ఉదాసీనత భర్తీ చేసింది. 'ఈసారి 400 సీట్లు దాటుదాం' అన్న నినాదం ఎత్తుకోవడంతో కూడా కాషాయపార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. అయితే రాష్ట్రంలో దాదాపు అన్ని చోట్లా ప్రతిపక్షాలను, ప్రధానంగా సమాజ్‌వాదీ పార్టీని అదుపులో ఉంచడంలో మాత్రం బీజేపీ విజయం సాధించింది.

చాలామంది రాజకీయ పండితులతోపాటు, మేము మాట్లాడిన అత్యధిక సాధారణ ఓటర్ల ప్రకారం... 2014, 2019 నాటి ఎన్నికలతో పోలిస్తే, ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు ఏమంత ఉత్సాహంగా లేవు. బీజేపీ సంపూర్ణ ఆధిపత్యం, ఎటువంటి బలమైన ప్రత్యామ్నాయం లేకపోవడం దీనికి కారణాలు. బీజేపీ ప్రధాన మద్దతుదారుల్లో ఉన్న అసంతృప్తి కూడా ఎన్నికల ఉత్సాహాన్ని తగ్గించింది. ఎన్నికల సరళిని బట్టి బీజేపీ ఉద్దేశపూర్వకంగా తన ప్రాధాన్యాలను మార్చుకోవడం కూడా మిశ్రమ సందేశాన్ని అందిస్తోంది.

ఎన్నికల తొలి దశల్లో ఓటింగ్ శాతం తగ్గుముఖం పట్టింది. అన్ని వైపులా పేలవమైన ప్రచారం, విజేత ముందుగానే తెలిసిపోవడం లాంటివి వీటికి కారణాలు. వీటన్నింటికీ మించి, ఉత్తరప్రదేశ్‌లో 2024 లోక్‌సభ ఎన్నికలలో మరో రెండు అంశాలు గమనించదగినవి: ఒకటి, బీజేపీ తన తిరుగులేని స్థితిని సాధించిన విధానం. దీనిని మనం గుజరాత్ నమూనా ఎన్నికల ఆధిపత్యం అని పిలవొచ్చు. రెండు, 'శాంతి భద్రతల' ప్రాముఖ్యత. అందువల్లే, యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌పై ప్రశంసలు గుప్పిస్తున్నారు.

ఎప్పటిలాగే, బీజేపీ ఎన్నికల ప్రచార ఒరవడిని జాగ్రత్తగా ప్లాన్ చేశారు. జనవరి 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ స్పష్టంగా ఈ ప్రణాళికలో భాగమే. ఇది నిజంగానే ఉత్కంఠకు దారితీసింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి మూడు నెలలు... బీజేపీ నాయకుడొకరు చెప్పినట్లుగా, 'ఇది గర్భధారణకు సంబంధించిన చివరి త్రైమాసికం. బూత్ స్థాయి కార్యకర్తలను ప్రసవానికి సిద్ధం చేయడంలో ఇది చాలా కీలకం'. ఈ మూడు నెలల్లో స్పష్టంగా 'మోదీ హవా' కనిపించింది. కానీ ఉత్సాహం ఒక్కసారి శిఖర స్థాయికి వెళ్లాక, అసలైన ఎన్నికల సమయం వచ్చేసరికి దాన్ని ఉదాసీనత భర్తీ చేసింది.

ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని నియోజకవర్గాల్లో ముస్లింల జనాభా గణనీయంగా 40–50 శాతం వరకు కూడా ఉంది. అందుకే పశ్చిమ యూపీలోని కీలకమైన యుద్ధభూమిలో ఓటింగ్ మొదటి కొన్ని దశల్లో బీజేపీ కీలక కర్తవ్యం, దాని ప్రధాన ఓటు పునాదిని ఏకీకృతం చేయడంగానే ఉండింది. 2013 అల్లర్ల నుండి స్థానికంగా ఉన్న హిందూ, ముస్లిం తగాదాల కారణంగా ఇది బీజేపీకి సులభమైన పనిగా కనిపించింది. అలాగే ముఖ్యమంత్రి కూడా బలమైన సానుకూల అంశంగా కొనసాగుతున్నారు. జాతీయ సమస్యల విషయంలో మోదీ రికార్డుపై ఓటర్లు ఆధారపడుతున్నప్పటికీ, రాష్ట్రంలో మాత్రం శాంతిభద్రతల నిర్వహణ విషయంలో యోగీ అందించిన తోడ్పాటునే ఎక్కువ పరిగణనలోకి తీసుకుంటున్నారు.

ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఓటర్ల ఉత్సాహం ఉధృతంగా ఉంది. అయినప్పటికీ స్పష్టమైన ప్రభంజనం మాత్రం లేదని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే అప్పటికి సిట్టింగ్ ఎంపీలపై ఆగ్రహం రూపంలో అనేక వ్యతిరేకతలు గూడుకట్టుకుని ఉన్నాయి. ద్రవ్యోల్బణం, సంచరించే పశువుల బెడద, తప్పుడు అభ్యర్థుల ఎంపిక కారణంగా బీజేపీ మీద విసుగు చెందిన అనేక మందిని మేము చూశాము. అయినప్పటికీ ఓటు విషయానికి వస్తే, ఎక్కువ మంది తాము బీజేపీకే ఓటు వేస్తామని అంగీకరించారు. ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతుందన్న ఊహాగానాలు ఎలా ఉన్నప్పటికీ, యూపీలో బీజేపీ గుజరాతీకరణకు ప్రయత్నిస్తోంది. అంటే కుల ఇంజినీరింగ్ ద్వారా తమ ఓటు పునాదిని నిర్మించడం, ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా చేయడం. బూత్, జిల్లా స్థాయుల్లో ఎంతోమంది విపక్ష నేతలు పార్టీలు మారి బీజేపీలో చేరారనేది ఆశ్చర్యం కలిగించే అంశం. రాష్ట్రంలో దాదాపు అన్ని చోట్లా ప్రతిపక్షాలను, ప్రధానంగా సమాజ్‌వాదీ పార్టీని తగ్గించడంలో బీజేపీ విజయం సాధించింది. ఇటావా, మైన్‌పురీ, కన్నౌజ్‌లలో తప్ప ఎక్కడా సమాజ్ వాదీ పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్నట్లు కనిపించదు. ఇది తాజాగా 2022 అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితి నుండి కూడా స్పష్టమైన మార్పును సూచిస్తోంది.



గత కొన్ని నెలల్లో ఒక్క గోరఖ్‌పూర్ ప్రాంతంలోనే ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన దాదాపు 11,000 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారని ఒక హిందీ వార్తాపత్రిక పేర్కొంది. చెప్పాలంటే, రెండు నెలల్లో యూపీలోని 10 మంది బీఎస్పీ ఎంపీల్లో ఐదుగురు బీజేపీలో చేరారు. బీజేపీ ముఖ్యంగా ప్రతిపక్షాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలను– టికెట్ రానివారు లేదా ఏ కారణం చేతనైనా ఆయా పార్టీలలో పక్కన పెట్టిన వారిని లక్ష్యంగా చేసుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కుశీనగర్‌లో బీజేపీకి గట్టి పోటీ ఇచ్చిన ఎస్పీ మాజీ ఎమ్మెల్యే నాథుని ప్రసాద్ కుశ్వాహా ఇటీవలే బీజేపీలో చేరారు. అదేవిధంగా, 20 19 గోరఖ్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ రోజునే బీజేపీలో చేరారు.

ఒక పార్టీగా, కొత్తగా ప్రతిపక్ష నాయకులను చేర్చుకోవడం, అదే సమయంలో సొంత కార్యకర్తలను సంతోషంగా ఉంచడం వంటి భారీ సవాళ్లను బీజేపీ ఎదుర్కొంటోంది. దీనివల్ల అనివార్యంగా బీజేపీ శ్రేణుల్లో కొంత అసంతృప్తి నెలకొంది. అలాంటి ఆగ్రహానికి గురైన ఒక కార్యకర్త 'భారతదేశంలో కాంగ్రెస్‌ను లేకుండా చేసే ప్రయత్నంలో, బీజేపీయే కాంగ్రెస్ అవుతోంది' అని వ్యాఖ్యానించారు. బలహీనమైన ప్రారంభం ఉన్నప్పటికీ, ఈ సంస్థాగతమైన తికమక బీజేపీ కంటే సమాజ్ వాదీ పార్టీనే ఎక్కువగా దెబ్బతీస్తోంది. ఎస్పీ బలహీనతను పసిగట్టిన బీజేపీ, మధ్యప్రదేశ్‌కు చెందిన యాదవ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను వ్యూహాత్మకంగా రంగంలోకి దింపింది. ఎస్పీ, ఆర్జేడీల యాదవుల ఓట్లను లాక్కోవాలని ప్రయత్నిస్తున్న బీజేపీకి యూపీ, బిహార్‌లలో మోహన్ యాదవ్ పోస్టర్ బాయ్‌గా మారారు.

యూపీలోని ప్రత్యర్థి పార్టీల ఓటర్లు, మద్దతుదారుల విషయానికి వస్తే, తమ అభ్యర్థుల గెలుపు సాధ్యం కాదని గ్రహించడంతో వారిలో ఉదాసీనత మొదలైంది. మేం సర్వే చేసిన ఒక వ్యక్తి ఇలా చెప్పారు: యోగీజీ వల్ల ముస్లింలు, యాదవుల పరిస్థితి 1990లలో బిహార్, యూపీల్లోని బ్రాహ్మణులు, క్షత్రియుల మాదిరిగా తయారైంది. బయటకు వెళ్లి ఓటు వేయడానికి వారికి ఎటువంటి ప్రేరేపకమూ లేదు. ఎందుకంటే ఇది వారికి ఎటువంటి లాభమూ చేకూర్చదు.

వాస్తవానికి యూపీలో బీజేపీని రెండు సవాళ్లు ఇబ్బంది పెడుతున్నాయి. మొదటిది, యూపీలో మొదటి రెండు దశల్లో ఓటింగ్ శాతం దాదాపు 5 శాతం తగ్గింది. డజను కంటే కొంచెం ఎక్కువ నియోజకవర్గాల్లో దాదాపు 8.9 లక్షల ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రతి బూత్‌లోని ఒక్కో ఓటునూ విలువైనదిగా భావించి పనిచేసే పార్టీకి ఇది ఆందోళనకరం. రెండవది, 'అబ్ కీ బార్, 400 పార్' (ఈసారి 400 సీట్లు దాటుదాం) అంటూ మోదీ ఇచ్చిన పిలుపునకు ఎదురుదెబ్బ తగిలింది. పార్టీని కొంతైనా అది వెనక్కి నెట్టింది. రిజర్వేషన్లను తగ్గించడానికి లేదా పూర్తిగా తొలగించడానికే బీజేపీ ఇంత భారీ మెజారిటీని కోరుతోందనే అత్యంత తీవ్రమైన అభియోగాన్ని ఆ పార్టీ ఎదుర్కొంటోంది (ఈ ప్రచారం 2015 బిహార్ రాష్ట్ర ఎన్నికలలో వారికి వ్యతిరేకంగా అత్యంత ప్రభావం చూపింది). ఆ సంక్షోభ తీవ్రతను తగ్గించడానికి చాలాకాలంగా ఉన్న హిందూ–ముస్లిం రగడతో సహా అందుబాటులో ఉన్న అన్ని ఆయుధాలనూ బీజేపీ సమీకరించింది.

వ్యాసకర్తలు శశాంక్ చతుర్వేది । నిర్మా విశ్వవిద్యాలయం, అహ్మదాబాద్; డేవిడ్ ఎన్ గెలినర్ । ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, ఇంగ్లండ్; సంజయ్ కుమార్ పాండే । జేఎన్‌యూ, ఢిల్లీ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చెత్త ప్రవాహం



ఒకప్పుడు కెనడాకు రావాలంటే, మీకు ఇంగ్లీషో, ఫ్రెంచో వచ్చివుండాలి. నాకు కెనడా నుంచి మూడు డిగ్రీలు ఉన్నప్పటికీ కెనడా పౌరురాలు కావడానికి నా ఇంగ్లిష్ ధారాళతను చూపవలసి వచ్చింది. కొన్నిరోజులుగా ఉబర్ డ్రైవర్లను చూస్తున్నాను. వాళ్లకు ఇంగ్లిష్, ఫ్రెంచ్ ముక్క రాదు. ఆడవాళ్లు పోతుంటే గుడ్లప్పగించి చూస్తుంటారు. ఏ చెత్తను తప్పించుకోవడానికి ఇక్కడికొచ్చామో అదే చెత్త మొదలైంది. కెనడాకు మంచి వలసదారులు రావడం లేదు.

– రూపా సుబ్రమణ్య, ఆర్థికవేత్త

మధ్యలో మతమెందుకు?



పాలస్తీనాలోని నరమేధాన్ని పాకిస్తాన్‌లోని దాదాపు ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారు. ఇందులో పెద్ద గొంతుకలు రైట్ వింగ్ మత నాయకులవి. ఈ చర్చను అలాంటివాళ్లు తమ చేతుల్లోకి తీసుకుని, దీన్నొక మత యుద్ధంలా మార్చడాన్ని మనం అనుమతించకూడదు. ఇది వలస వాద అణచివేత. మానవత్వానికి సంబంధించినది.

– నిదా కిర్మానీ, పాక్ సోషియాలజిస్ట్

పట్టించుకోవాలి...



ఢిల్లీలో ఇవ్వాళ (మే 29) మేము 51 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో మాడిపోయాం. ఇది దేశవ్యాప్తంగా వాతావరణ అత్యవసర పరిస్థితి. అయినా ఏ నాయకులూ, రాజకీయ పార్టీలూ పట్టించుకోవట్లేదు. మనం ఎలాంటి వాళ్లను విధాన నిర్ణేతలుగా ఎన్నుకుంటున్నాం?

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

ఆందోళనకర డేటా



దేశంలో యువత నిరుద్యోగ రేటు ఆందోళనకరంగా 45.4 శాతానికి చేరిందని సీఎంఐఈ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) తాజా డేటా వెల్లడిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఇది తీవ్రమైన నష్టం కలిగిస్తోంది. దేశం కోసం మనం నినాదాల వెనుక దాక్కోవద్దు. రాజకీయాలను పక్కన పెట్టి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ప్రపంచ నాయకుడు



'గాంధీ' సినిమా విడుదలకు ముందు ప్రపంచంలో ఎవరికీ మహాత్మా గాంధీ తెలియదని అంటున్నారు మోదీ. వాస్తవం ఏమిటంటే, ఆ సినిమా విడుదల కావడానికి ముందే 50 కంటే ఎక్కువ దేశాల్లో గాంధీ విగ్రహాలు ఉన్నాయి.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

విత్తన సమస్య తీర్చాలి

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలతో సాధారణ వర్షపాతం నమోదవుతుందన్న వాతావరణ నిపుణుల ప్రకటనతో, జూన్ ఒకటి లేదా రెండవ వారంలో రుతుపవనాలు విస్తరించి వర్షాలు కురుస్తాయని చెప్పడంతో ఇప్పటికే రాష్ట్ర రైతాంగం ఖరీఫ్ సాగు పనులు మొదలు పెట్టారు. రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సాగు సీజన్‌లో 1.60 కోట్ల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగవుతాయనీ, ఇందులో వరి 65 లక్షల ఎకరాలు, పత్తి తదితర పంటలు 60.53 లక్షల ఎకరాల్లో సాగవుతాయనీ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. వీటికి వరి విత్తనాలు 16.50 లక్షల క్వింటాళ్లు, పత్తి విత్తనాలు 54 వేల క్వింటాళ్లు, మొక్కజొన్నలు 48 వేల క్వింటాళ్లు అవసరం అవుతాయని అంచనా ఉంది. అవసరానికి తగ్గట్టుగా విత్తనాలు సరిగా లభించటం లేదని కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాల్లో రైతాంగం ఇప్పటికే రోడ్డెక్కారు. దీనిని బట్టి సమస్య వుందని చెప్పకనే చెప్పినట్లయ్యింది. కానీ, రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం అదేమీ లేదని చెబుతున్నారు. మే 23న రాష్ట్రంలో 56 లక్షల పత్తి విత్తన పాకెట్లు అందుబాటులో వుంచగా, 7.22 లక్షల పాకెట్లు అమ్ముడుపోయాయనీ, సన్న వరి విత్తనాలు 13.33 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో వున్నాయనీ, అలాగే రూ. 1,140.22 కోట్ల సబ్సిడీతో 20,518.40 క్వింటాళ్ల జనుము, జీలుగ విత్తనాలు రైతులు కొనుగోలు చేశారనీ మంత్రి చెప్పారు. కానీ, మంత్రి ప్రకటనలోనే రైతులకు అవసరమైన విత్తనాలకు, అందుబాటులో వుంచిన విత్తనాలకు అంతరం వుంది.

రేవంత్ ప్రభుత్వం కూడా ప్రధానమైన వరి, పత్తి, పప్పుధాన్యాల విత్తనాలకు సబ్సిడీ ఇవ్వడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వ వలెనే సబ్సిడీ ఎత్తివేయటం నేటి ప్రభుత్వానికి తగింది కాదు. కొనసాగించాలి. రైతును ఆదుకోవాలి. పచ్చిరొట్ట విత్తనాలకు సబ్సిడీ ఇవ్వటం మంచి విషయమేగానీ, వాటికి మాత్రమే ఇచ్చినందువల్ల పెద్ద ఉపయోగం వుండదు. అన్ని రకాల విత్తనాలకు సబ్సిడీ ఇవ్వాలి. అలాగే రుణాల, పురుగు మందుల సమస్య పరిష్కరించాలి.

సాగు పెట్టుబడులకు సంబంధించి బ్యాంకులు రుణం ఇవ్వడం లేదు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలకు విరుద్ధంగా అరకొరగా అందిస్తున్నాయి. దీంతో పంటలు దెబ్బతిన్న రైతులు అధిక వడ్డీలతో పెరిగిపోయిన ప్రైవేటు అప్పులను తీర్చలేక పోతున్నారు. రుణమాఫీ కాక పోవడంతో అన్నదాతలకు అప్పుల భారం పెరిగిపోతున్నది.

అలాగే, కనీస మద్దతు ధరల సమస్యపై రాష్ట్రం కేంద్రంతో మాట్లాడాలి. రాష్ట్ర ప్రభుత్వమైనా ఒక్క సన్న వడ్లకేగాక, అన్ని పంటలకూ సబ్సిడీ ఇవ్వాలి. ఆదుకోవాలి. లేకపోతే, రైతుల గురించి ఎంత మాట్లాడినా ఫలితం వుండదు. పంటల బీమా పథకం వెంటనే అమలు చేయాలి. పేద, మధ్యతరగతి వారి ప్రీమియం ప్రభుత్వం భరించాలి. రైతాంగం తమ సమస్యలపై సంఘటితంగా పోరాడాలి. సమస్యలు పరిష్కరించుకోవాలి.

– కెచ్చెల రంగారెడ్డి, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐకేఎస్), తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు

దేశపు జెండాకున్నంత పొగరున్న కవి!

సందర్భం



మాడభూషి శ్రీధర్

“నేనింతా ఒక పిడికెడు మట్టే కావచ్చు. కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది'' అనే ఈ వాక్యాలను కలిపి చదివితే కావ్యం, భారతం, మహాభారతం,'ఆధునిక భారతం!'

''నీవు కాలేజీకి పోతుంటే బాబూ! నిన్ను పొలాలు బిక్క మొహంతో చూస్తున్నాయి. ప్రతిరోజూ ఈ పుస్తకాల ఊరేగింపు ఎందుకు? ఈ దేశపు వీధుల్లో... మీరు పలకా పుస్తకాలు పట్టుకుని పోతుంటే బాబూ! మీరు శిలువలు మోసుకుపోతున్న బాల క్రైస్తవుల్లా కనిపిస్తారు నా కళ్లకు– లే బాబూ లే, నీ బాల్యంలోంచి లే! పుస్తకాలవతల పారెయ్! నాగలి భుజాన వేసుకో! ఈ కులాలు విడిచిపెట్టు ఆ పొలాల్లో కలువ్... పొలాలు మీకు స్వేచ్ఛాదానం చేస్తాయ్. హాయిగా పీల్చే ఊపిరి కానుకగా ఇస్తాయ్, పీఠభూమిలాంటి ఛాతీనిస్తాయ్, ఇనప ఊచల్లాంటి కాళ్లిస్తాయ్!''

ఇవి గుంటూరు శేషేంద్ర శర్మ రాసిన కవితా పంక్తులు. ఆయన ప్రతి కవితా ఒక మహాకావ్యం అనవచ్చు. ఆయన కావ్యాలకు వివరణ కూడా సాధ్యం కాదు. అయితే అందులో కొన్ని వాక్యాలనైనా చదవడం అవసరం.

''దేవుడ్ని గూర్చి దీర్ఘ చర్చలు చేసేంతటి మూర్ఖులమూ కాము, ధనికులమూ కాదు. మావి పనిచేసి బ్రతకవలసిన చేతులు. నేను సత్యాగ్రాహి! సత్యం నా గుండెల్లో బద్ధలవుతున్న అగ్ని పర్వతం. నా గొంతులో గర్జిస్తున్న జలపాతం! సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చుని మొరగదు. తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు. పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు'' అంటారు శేషేంద్ర ఈ పుస్తకంలో. ఆయన వాడిన మాటలు, వాక్యాలు వాడిపోని పుష్పాలు. ఆయన గురించి చెప్పేటప్పుడు వాటిని ఉటంకించడం వల్ల ఒక స్ఫూర్తి వస్తుంది. ఆయన మనసు తెలుస్తుంది. ఉదాహరణకు వీటిని చూడండి:

'ఇది నా కావ్య సంకలనం కాదు. ఇది నా కావ్యం. నా సంపూర్ణ కావ్యం. కవి అనేక కావ్యాలు రాయడు. కవి ఒకే మనిషి – ప్రవహిస్తున్న ఒకే జీవితం జీవిస్తాడు. అలాగే ఒకే కావ్యం రాస్తాడు... జీవితం ఒక యాత్ర. యాత్ర అనేక మజిలీల ప్రయాణం. దీని అర్థాంతరమే, కవి కావ్యయాత్ర అనేక కృతుల సాముదాయిక స్వరూపం. అంటే ఒక కవి తన జీవితంలో ఒకే కావ్యం రాస్తాడు. అయితే దాన్ని అప్పుడప్పుడూ క్రమక్రమంగా రాస్తూ ఉంటాడు. అలా రాయబడే ఒక్కో కృతి నిజంగా పూర్ణకృతి కోసం పుట్టే ఒక్కో పర్వం. కావ్యయాత్ర అంతిమ చరణంలో అన్ని పర్వాలూ కలిసి ఒక్క కావ్యం మాత్రమే అవుతుంది.

కనుక నేను నా జీవితంలో అనేక కావ్యాలు



వ్రాయలేదు. రాసింది ఒకే కావ్యం. దాని పేరు 'నా దేశం– నా ప్రజలు'. దాని వర్తమాన నామాంతరం 'ఆధునిక మహాభారతము. ఆ కావ్యం యొక్క భాగాలు నా జీవితంలో అప్పుడప్పుడూ రాస్తూవచ్చాను. భిన్న భిన్న నామకరణాలతో ఆ భాగాల్ని అప్పుడప్పుడూ ప్రకటిస్తూ వచ్చాను. ఆ భిన్న భిన్న నామకరణాలతో అప్పుడప్పుడూ వచ్చిన ఆ భాగాలే ఈనాడు నా ప్రజలకు సమర్పిస్తున్న సంపూర్ణ కావ్యంలో పర్వాలుగా ప్రత్యక్షమవుతున్నాయి. అవి పుట్టినప్పుడు నిజంగా చివరకు రూపొందే సమగ్రకావ్యం కోసం పుట్టిన తొలి అవయవాలే గనుక ప్రతి పర్వాంతంలో ఒక పగ ఉంది. పర్వాంత గద్య. ఈ ఆధునిక మహాభారతానికి 'జనవంశ'మనే అనుబంధ కావ్యం ఒకటి ఉంది. ఇంతటితో నా కావ్యయాత్ర ముగిసింది.''

ఇది మన భారతదేశానికి సంబంధించినదే కాని, పురాణం కాదు. అనేకానేక కవితల సమాహారం. 1970 – 1986 ల మధ్యకాలంలో శేషేంద్ర రాసిన వచన కవితల సమాహారం 'ఆధునిక మహాభారతం'. 'ఆంధ్రప్రభ' వారపత్రికలో పైన పేర్కొన్న ఉపోద్ఘాతంతో 'ఆధునిక మహాభారతం' సీరియల్ ప్రచురించారు. దీనికి వ్యాస మహాభారతానికి ఏ సంబంధమూ లేదు. ప్రేరణ కూడా కాదు. మొత్తం మీద ఇందులో పది పర్వాలు ఉంటాయి. ఈ కావ్యేతిహాసాన్ని కవి కుమారుడు సాత్యకి... మహా కవి శేషేంద్ర 9వ వర్ధంతి కానుకగా ఇటీవల తెలుగు సాహితీ ప్రజానీకానికి ఇచ్చారు. 'ఆలోచన, ఆవేశం,ఆధునికం' కలిసి శేషేంద్ర కవిత అవుతాయి.

'ఆధునిక భారతం' చదివితే ''గులాం మనస్తత్వం కారణంగా వంగిపోయిన మోకాళ్లలో బలం వచ్చి, మనిషి కాళ్లు నిటారుగా నిలుస్తాయి. దాని పైన వంగి వంగి సలాములు చేసి చేసి వంకరటింకర్లు అయిపోయిన వెన్నెముక ఇనుప చువ్వలా నిల్చుంటుంది. సిగ్గు విడిచి తల వంచివంచి మెలిగే అలవాటు చేత సదా వేలాడే తల ఒక్కసారి భుజాలమీద లేచి నిర్భయంగా నిలబడుతుంది. మనిషి మనిషిగా మారిపోతాడు. భూగోళానికి ఇరుసు అవుతాడు'' అని ఒక విమర్శకుడు అద్భుతంగా వివరించారు. ''నీకెందుకింత అశాంతి, నీ కెందుకింత ఆవేశం అంటే ఏం చెప్పను? సముద్రాన్ని అడుగు నీ కెందుకింత అశాంతి అని, ఝంఝూమారుతాన్ని అడుగు నీకెందుకింత ఆవేశం అని'' అంటారాయన.

బాబూ మనం తుపాకుల్ని ఎదుర్కోగలం గానీ నియంతలు ప్రశ్నల్ని ఎదుర్కోలేరు.

మరికొన్నింటికి తావిస్తాం. కానీ జీవిస్తాం.

ఒరే సిద్ధాంతీ, నీ పంచాంగం కట్టిపెట్టు.

ఒరే రాజకీయ ప్రభూ నీ లౌడ్ స్పీకరు పీకేసుకో –

పాత చెట్టు కూడా కొత్త పూలు పూస్తుంది.


పై నాలుగు వాక్యాలూ కలిస్తే శేషేంద్ర ఒక డైనమేట్ అని అర్థమవుతుంది.

(నేడు గుంటూరు శేషేంద్రశర్మ వర్ధంతి)

సమదృష్టి

క్షణంలో నీటి బుడగ ఏ విధంగా రూపులేకుండా పోతుందో అదే విధంగా భూమిపై మనిషి జీవితం కూడా సమసిపోతుంది. ఈ వాస్తవాన్ని మన హృదయంలో నాటుకొంటే మన జీవితం సఫలీకృతమవుతుంది. ఏ మనిషి కూడా గమ్యంలేని జీవితాన్ని గడపకూడదు. అన్ని రకాల భోగాలు అందుబాటులో ఉండటం నిజమైన ఐశ్వర్యం కాదు. ఆ విధమైన సంపదలన్నీ బంధాలే. వాని వల్ల నీకు తెలియకుండానే నిన్ను నీవు బంధించుకొంటావు. త్యాగబుద్ధిని పెంచుకోవడంలోనే నీ ఆత్మజ్ఞానం ఉంటుంది. సంపద సమకూర్చుకొని, దానితో వీడని బంధం ఏర్పరచుకోవడం కంటే... దానిని భగవంతుని ప్రసాదంగా వాడుకోవడానికి ప్రయత్నించాలి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

నీవు దేవుని ఆరాధిస్తే నీలో దైవత్వం ప్రతిబింబిస్తుంది. మహాత్ముల, సాధువుల సాంగత్యం నిన్ను భగవంతుని ద్వారం దగ్గరకు తీసుకువెళ్తుంది.

దీనికి భిన్నంగా నీవు ఈ ప్రపంచంలో ఉన్న వస్తు సముదాయాలతో సాన్నిహిత్యాన్ని పెంచుకుంటే, అది నిన్ను సంసారంతో బంధించివేస్తుంది. ఆధ్యాత్మికంగా వృద్ధి చెందటానికీ, మానసిక ప్రశాంతత పొందడానికి సమత్వభావన చాలా ముఖ్యం. ఇటువంటి సల్లక్షణం పెంపొందించుకోవాలంటే, ప్రతి ఒక్కరూ నిందాస్తుతుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. జీవితం ఒక నాణెం అనుకొంటే, దానికిగల ఇరువైపుల్లో... ఒకవైపు నిందలు, రెండవవైపు స్తుతులు ఉంటాయి. నిందలను భరించడం చాలా కష్టం. కాని, పొగడ్త ప్రతి ఒక్కరికీ ఇష్టమే. ఎవరైనా పొగడితే అది చాలా ప్రియంగా ఉంటుంది. మన తప్పులను ఎత్తిచూపే వారిపై మనం ఎప్పుడూ కోపగించుకోకూడదు. ఇందుకు భిన్నంగా, మనం చేసిన తప్పులను సంతోషంగా ఒప్పుకొని, వాటిని ఎత్తిచూపే వారి పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఈవిధంగా చేస్తే మనం మోస్తున్న 'అహంకారం' అనే భారం క్రమ క్రమంగా తగ్గిపోతుంది.

ప్రతి ఒక్కటీ భగవత్ప్రేరితమే అని అంగీకరించాలి. కష్ట సుఖాలు రెండూ భగవంతుడు కల్పించినవే అయినా మనిషి కేవలం సుఖాలు మాత్రమే కోరుకుంటాడు. ఈ విధమైన ఆలోచన వదలాలి. వీటిని సరైన దృక్కోణం నుండి చూడాలి. కష్టాన్నయినా, సుఖాన్నయినా నీ అంతట నీవుగా ఎన్నుకోకుండా తటస్థంగా ఉండడం శ్రేయస్కరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.11.07 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.7.20 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** ప.2.05 నుండి 3.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.48 నుండి 10.40 వరకు తదుపరి ప.3.00 నుండి 3.52 వరకు, **అమృతఘడియలు:** రా.11.04 నుండి 12.34 వరకు; **రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం :** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం :** 5.29, **సూర్యాస్తమయం :** 6.26.

ప్రజా భవన్‌ను పేల్చేస్తామన్న నిందితుడి అరెస్ట్

- మల్కాజిగిరికి చెందిన పి.శివకుమార్‌గా గుర్తింపు
- భార్యమీద కోపంతోనే దుశ్చర్య



నాంపల్లి (హైదరాబాద్): ప్రజాభవన్, నాంపల్లి క్రిమినల్ కోర్టును బాంబులతో పేల్చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడిన నిందితుడిని పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేశారు. పోలీసులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని మల్కాజిగిరి, భరత్‌నగర్ పోచమ్మ బస్తీకి చెందిన పి.శివకుమార్ అలియాస్ బొట్టు అశోక్‌కుమార్ అలియాస్ పి.గోపిగా గుర్తించారు. మంగళవారం మధ్యాహ్నం 12.10 గంటలకు ప్రజా భవన్, నాంపల్లి క్రిమినల్ కోర్టును బాంబులతో పేల్చేస్తామంటూ డయల్ 100కు ఫోన్ చేసిన విషయం తెలిసిందే. అప్రమత్తమైన పోలీసులు రెండు చోట్లా అణువణువు సోదాలు జరిపారు. సాయంత్రం 6 గంటల వరకు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. ఎక్కడా బాంబు లేదని, గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ కాల్ చేసి బెదిరించినట్లుగా నిర్ధారణకు వచ్చారు. అజ్ఞాతంలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు టాస్క్‌ఫోర్స్, నాంపల్లి పోలీసులు రంగంలోకి దిగారు. బెదిరింపులకు పాల్పడిన పి.శివకుమార్(40) వృత్తిరీత్యా లేబర్. మద్యానికి బానిసై భార్యతో గొడవ పడుతున్నట్లుగా విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. దీంతో భార్య గొడవపడి ఇంట్లో నుంచి కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య తిరిగి ఇంటికి రాలేదన్న కోపంతో శివకుమార్ ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు.

అన్ని జిల్లాల్లో అందుబాటులో పచ్చిరొట్ట, పత్తి, ఇతర విత్తనాలు

సాక్షి, హైదరాబాద్: వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పచ్చిరొట్ట విత్తనాలతో పాటు పత్తి, ఇతర విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయశాఖ సంచాలకుడు బి.గోపి తెలిపారు. ఏయే జిల్లాల్లో ఎన్ని టన్నుల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయో తెలియజేస్తూ ఆయన కలెక్టర్లకు లేఖ రాశారు. పచ్చిరొట్ట విత్తనాన్ని సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లాల వారీగా కేటాయింపులు జరిపి, కౌంటర్ల వారీగా విక్రయాలు జరుపుతున్నట్లు చెప్పారు.

చేప పిల్లలా? చేయూతా?

- చేప పిల్లల పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో తప్పుడు రికార్డులతో నాణ్యత లేకుండా సరఫరా
- ఈ నేపథ్యంలో సంఘాలకు నేరుగా డబ్బులివ్వాలని కోరుతున్న మత్స్యకారులు
- ఈసారి పథకానికి రూ.100 కోట్లు అవసరం
- ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ఏం చేస్తుందోనని చర్చ



సాక్షి, హైదరాబాద్: చేప పిల్లల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి. మే నెల చివరికి వస్తున్నా ఈ పథకంపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనితో ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీ ఉంటుందా? లేదా అన్న సందిగ్ధత ఏర్పడింది. మత్స్యకారులకు ప్రోత్సాహం కల్పించడానికి ఏ విధమైన పథకాన్ని తీసుకువస్తారన్న దానిపై స్పష్టత కొరవడింది. చేప పిల్లల పంపిణీపై గతంలో కాంగ్రెస్ పార్టీ అనేక ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ పథకం కొనసాగుతుందా లేదా అన్న ఆందోళన మత్స్యకారుల్లో వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తన వైఖరి వెల్లడించాలని మత్స్యకారులు కోరుతున్నారు. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 26,700 చెరువుల్లో 90 కోట్ల ఉచిత చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను వదిలారు. అందుకోసం ఏప్రిల్‌లోనే టెండర్లు పిలిచి.. జూన్‌లో టెండర్లు ఖరారు చేశారు. ఈ పథకం అమలు విషయంలో గతంలో అనేక విమర్శలు కూడా వచ్చాయి. దీంతో విమర్శలు, ఆరోపణలకు తావివ్వకుండా ప్రభుత్వం పథకాన్ని కొనసాగిస్తుందా? లేక మత్స్యకారులకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తుందా అన్న చర్చ మత్స్యకార సంఘాల్లో జరుగుతోంది.

సమయం సరిపోదన్న భావనలో...

గతంలోలాగా పథకాన్ని కొనసాగిస్తే ఈసారి రూ. 100 కోట్లు అవసరం అవుతాయని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. చేప పిల్లల సమీకరణకు కనీసం రెండు నెలల సమయం పడుతుందంటున్నారు. ఇప్పుడు టెండర్లు పిలిస్తే చేపపిల్లల సేకరణకు సమయం పట్టే అవకాశం ఉన్నందున, మత్స్యకారులకు చేయూతనిచ్చే అంశాన్ని పరిశీలిస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్న తరుణంలో ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వస్తుందా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

గత ప్రభుత్వంలో పలు ఆరోపణలు...

ఉచిత చేప పిల్లల పథకంపై గతంలో పలు ఆరోపణలు వచ్చాయి. చెరువుల్లో అధికశాతం నాసిరకం చేప పిల్లలను వదిలారన్న విమర్శలు ఉన్నాయి. నాణ్యతలేని చేపపిల్లలను వదిలి తప్పుడు రికార్డులు సృష్టించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో పలు గ్రామాల్లోని మత్స్యకారులు తమ చెరువుల్లో చేప పిల్లలు వదలొద్దని స్పష్టం చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ పథకం కింద సరఫరా చేసిన చేపలు సరిగా ఎదగలేదని అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సైతం తిరస్కరించడం గమనార్హం.

> ఉచిత చేప పిల్లల కంటే చేయూత ఇవ్వడం మంచిది. మత్స్యకార సంఘాలకు నేరుగా డబ్బులు డిపాజిట్ చేస్తే నచ్చిన చేప పిల్లలను కొనుగోలు చేసుకుంటాం. ఇలా చేయడం వలన నాణ్యతతో పాటు ఏ చెరువులో ఎన్ని చేప పిల్లలను వదులుకోవాలనే నిర్ణయం కూడా మాదే ఉంటుంది.
>
> – శంకర్, మత్స్యకారుడు

సర్వాంగ సుందరంగా ట్యాంక్‌బండ్

- జూన్ 2న సాయంత్రం ఘనంగా అవతరణ వేడుకలు
- పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం


(ఫైల్)

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ వేడుకలకు ట్యాంక్ బండ్‌ను ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. జూన్ 2న సాయంత్రం ట్యాంక్ బండ్‌పై పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ట్యాంక్ బండ్ పరిసరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. సామాన్య ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సందర్శకులను ఆకట్టుకునే ప్రదర్శనలు, ఆట వస్తువులు, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వివిధ జిల్లాల సాంస్కృతిక కళా బృందాలతో కార్నివాల్ ప్రదర్శనలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన వేదికపై శాస్త్రీయ, జానపద, దక్కనీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర అధికారిక గేయం 'జయ జయహే తెలంగాణ' పై పోలీసు సిబ్బందితో ప్రదర్శన నిర్వహించనున్నారు. బాణసంచా పేలుస్తూ ఉత్సవ అనుభూతి పొందేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ట్యాంక్ బండ్‌పై దాదాపు 80 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో రాష్ట్రంలోని హస్తకళలు, స్వయం సహాయక బృందాలు తయారు చేసే వస్తువులు, చేనేత ఉత్పత్తులు, నగరంలోని పలు ప్రముఖ హోటళ్ల ఫుడ్ కోర్టులు ఉండనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులు పరిశీలించారు. వేదిక అలంకరణ, వేడుకలకు హాజరయ్యే అతిథులకు, పాల్గొనే ప్రజలకు సీటింగ్, పార్కింగ్, తాగునీరు, విద్యుత్ సరఫరా, పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశారు. సభా ప్రాంగణంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు, మొబైల్ టాయిలెట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్క్రీన్లతో, లైవ్ ప్రసారానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇద్దరు మావోయిస్టుల మృతి

- కొరంబేడా – బండెపారా అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. జిల్లాలోని మద్దేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కొరంబేడా – బండెపారా అటవీ ప్రాంతాల్లో మద్దేడు ఏరియా కమిటీ సభ్యులు బుచ్చన్న, విశ్వనాథ్, బామన తదితర మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు జిల్లాకు చెందిన డీఆర్‌జీ పోలీసులు కూంబింగ్ ఆపరేషన్‌ను చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టు లు కాల్పులు జరపగా బలగాలు సైతం ఎదురుకా ల్పులు జరిపాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. వారిలో ఏరియా కమిటీ సభ్యురాలు మడకం మాలిని, మిలీషియా కమాండర్ కుడియం మంగ్లు ఉన్నారు. ఘటనా ప్రాంతం నుంచి రెండు తుపాకులు, మందు గుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు.

దంతెవాడ జిల్లాలో పది మంది లొంగుబాటు..

దంతెవాడ జిల్లాలో బుధవారం 10 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు. తాము చేపట్టిన లోన్‌వర్రాటు కార్యక్రమానికి ఆకర్షితులై వీరంతా స్వచ్ఛందంగా లొంగిపోయారని వెల్లడించారు.

కంటెయినర్‌లో కుక్కేయడంతో ఊపిరాడక 16 ఎద్దులు మృతి


కంటెయినర్‌లో మృతి చెందిన ఎద్దులు

మఠంపల్లి(హుజూర్‌నగర్): ఓ కంటెయినర్‌లో 26 ఎద్దులను కుక్కేసి ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా కదిరికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఊపిరాడక 16 ఎద్దులు మృతిచెందాయి. వాటి కళేబరాలను సూర్యాపేట జిల్లా మట్టపల్లి వద్ద కృష్ణానది ఒడ్డున పూడ్చిపెట్టారు. ఈ ఎడ్లను కబేళాకు తీసుకువెళుతున్నట్లు తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన నటరాజ్, స్వామి అనే ఇద్దరు వ్యక్తులు సూర్యాపేటలో 26 ఎడ్లను కొనుగోలు చేసి కంటెయినర్ వాహనంలో కదిరికి తరలిస్తున్నారు. మధ్యలో మట్టపల్లి సమీపంలోని ఏపీ–తెలంగాణ సరిహద్దులో గల చెక్‌పోస్టు వద్ద పోలీసులు మంగళవారం సాయంత్రం కంటెయినర్‌ను అడ్డుకుని విచారించారు. అనంతరం కంటెయినర్‌ను నల్లగొండలోని గోశాలకు తరలించారు. గోశాల నిర్వాహకులు కంటెయినర్‌ను తెరిచి పరిశీలించగా అప్పటికే 15 ఎద్దులు మృతిచెందాయి. మరో రెండింటికి కాళ్లు విరిగాయి. గోశాల సిబ్బంది బాగా ఉన్న 9 ఎద్దులను గోశాలలోనే ఉంచి, చనిపోయిన వాటితో పాటు గాయపడిన ఎద్దులను తిరిగి మట్టపల్లి చెక్‌పోస్టు వద్దకు అదే కంటెయినర్‌లో పంపించారు. అయితే, కాళ్లు విరిగిన రెండు ఎద్దులలో ఒకటి చనిపోయింది. దీంతో మృతిచెందిన వాటి సంఖ్య 16కు చేరింది. మిగిలిన ఒక ఎద్దుకు మట్టపల్లి క్షేత్రంలోని తమిళనాడుకు చెందిన గోశాలలో చేర్పించి చికిత్స నిర్వహిస్తున్నారు. చనిపోయిన 16 ఎద్దుల కళేబరాలను బుధవారం కృష్ణానది ఒడ్డున పూడ్చివేశారు. పోలీసులు కంటెయినర్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

మిస్ యూ అమ్మా


ఆత్మహత్యకు ముందు సెల్ఫీ తీసుకుంటున్న సాయికిరణ్

- రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య
- చివరగా తన తల్లికి మెసేజ్ చేసిన కొడుకు

మిర్యాలగూడఅర్బన్: వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం ప్రాంతానికి చెందిన తన్నీరు వెంకటమ్మ మూడవ కుమారుడు తన్నీరు సాయికిరణ్(22) పట్టణంలోని ఓ ప్రైవేట్ సంస్థలో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇదే కాలనీకి చెందిన ఓ బాలికను మూడేళ్లుగా ప్రేమిస్తున్నానని వెంటపడుతుండగా, బాలిక తరఫువారు గతంలో కేసులు పెట్టగా, పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగిందని సీఐ నాగార్జున తెలిపారు. ఈ నెల 28న రాత్రి సీతారాంపురంలోని ఆ బాలిక ఇంటికి వెళ్లడంతో గొడవ జరిగింది. దీంతో బాలిక కుటుంబసభ్యులు బుధవారం ఉదయం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ క్రమంలో మధ్యాహ్నం పట్టణంలోని రైల్వే ట్రాక్‌పైకి చేరుకున్న సాయికిరణ్.. తన చావుకు సోమగాని శ్రీనివాస్, మీసాల శ్రీనివాస్ కారణమని, వారిద్దరూ స్థానిక ఎమ్మెల్యే అండ చూసుకుని వేధింపులకు గురిచేయడంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నానని తన సెల్‌ఫోన్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు. అనంతరం రైలు పట్టాల వద్ద నిలబడి ఫొటో తీసుకొని మిస్ యూ అమ్మా అని స్టేటస్ పెట్టుకొని.. వేగంగా వస్తున్న జన్మభూమి రైలుకు ఎదురుగా పరుగెత్తడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైలు డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వేధింపులతోనే నా కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు.

తన కుమారుడు మృతికి సోమగాని శ్రీనివాస్, కజ్జం శ్రీనివాస్ అలియాస్ మీసాల శ్రీనివాస్ కారణమని, ఎమ్మెల్యే అండ చూసుకొని తన కుమారుడిపై వేధింపులకు పాల్పడ్డారని సాయికిరణ్ తల్లి వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

పత్తి విత్తనాల కొరత లేదు

- 51.40 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం
- రైతులు ఒకే కంపెనీ విత్తనాలు కాకుండా గతంలో దిగుబడి ఇచ్చిన విత్తనాలు కొనాలి
- రూ. 2.49 కోట్ల విలువైన నకిలీ విత్తనాలు స్వాధీనం..
- 33 మంది అరెస్టు
- 12.28 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి విత్తనాల కొరత ఎక్కడా లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. 2023–24 సంవత్సరంలో 44.92 లక్షల ఎకరాల పత్తి పంట సాగు కాగా, ఈ వానాకాలం సీజన్‌లో 55 లక్షల ఎకరాలలో పత్తి పంట సాగవుతుందని అంచనా వేసి 1.24 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతులకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించామని వెల్లడించారు. దీనికనుగుణంగా బుధవారం వరకు 51,40,405 పత్తి ప్యాకెట్లను వివిధ జిల్లాలలో రైతులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఇందులో వివిధ కంపెనీలకు చెందిన 10,39,040 పత్తి ప్యాకెట్లను ఇప్పటికే రైతులు కొనుగోలు చేశారని తెలిపారు. ఈ మేరకు మంత్రి తుమ్మల బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

క్యూల్లో ప్యాకెట్ల పంపిణీ ఎక్కడ.. ఎందుకంటే..

కొన్ని జిల్లాల్లోని రైతులు ఒకే కంపెనీకి చెందిన, ఒకే రకం పత్తి విత్తనాల కోసం డిమాండ్ చేస్తున్నారని మంత్రి తెలిపారు. అయితే ఆ రకం విత్తనాలు డిమాండ్ మేరకు లేకపోవడం వల్ల ఉన్న వాటిని రైతులందరికీ ఇవ్వాలనే ఉద్దేశంతో, ఒక్కొక్కరినీ వరుసలో నిల్చోబెట్టి ఆ రకానికి చెందిన పత్తి విత్తన ప్యాకెట్లు రెండేసి చొప్పున ఇచ్చామని ఆయన వివరించారు. అంతేతప్ప ఆ మార్కెట్లలోగానీ, ఆ జిల్లాల్లో గానీ పత్తి విత్తన ప్యాకెట్లలో ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు.

రైతులు ఒకటే కంపెనీ కోసం పోటీ పడొద్దు

రైతులు కేవలం ఒకటే కంపెనీ, ఒకటే రకానికి చెందిన విత్తనాల కోసమే పోటీ పడకుండా మార్కెట్లో అందుబాటులో ఉన్న, గతంలో మంచి దిగుబడులు ఇచ్చిన రకాలను కూడా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. విత్తన చట్టాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని, ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రూ.2.49 కోట్ల విలువైన 188.29 క్వింటాళ్ళ నకిలీ పత్తివిత్తనాలు స్వాధీనం చేసుకొని 33 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

1.95 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాన్ని పంపిణీ చేస్తాం

ఈ వానాకాలంలో 109.15 కోట్ల సబ్సిడీ విలువతో 1.95 లక్షల క్వింటాళ్ళ పచ్చి రొట్ట విత్తనాన్ని పంపిణీ చేయాలని ప్రతిపాదించి, ఇప్పటివరకు 79,261 క్వింటాళ్ళు పంపిణీ చేశామని, అందులో 54,162 క్వింటాళ్ళు రైతులు కొనుగోలు చేశారని మంత్రి తుమ్మల తెలిపారు. ఎరువులకు సంబంధించి కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుందని, యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంఓపీ, ఎస్‌ఎస్‌పీ ఎరువులను 12.28 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచినట్లు ఆయన వెల్లడించారు.

కలెక్టర్ చొరవ... టెంట్ల నీడలో రైతులకు ఊరట



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పత్తి విత్తన దుకాణం వద్ద మండుటెండను సైతం లెక్కచేయకుండా విత్తనాలను కొనుగోలు చేసేందుకు గంటల తరబడి బారులు తీరి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇదే సమయంలో బుధవారం విత్తన దుకాణాల తనిఖీకి వచ్చిన కలెక్టర్ రాజర్షి షా రైతుల ఇబ్బందులను చూసి.. టెంట్లు ఏర్పాటు చేయాలని షాపు యజమానిని ఆదేశించారు. దీంతో అప్పటికప్పుడు టెంట్లు ఏర్పాటు చేయడంతో రైతులు కాస్త సేద తీరారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

ఉద్యానశాఖ సంచాలకుడు అశోక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని అధికారులకు ఉద్యానశాఖ సంచాలకుడు అశోక్‌రెడ్డి సూచించారు. బుధవారం వ్యవసాయశాఖ అధి కారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ కొత్త పంట కావడంతో రైతులకు తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆయిల్ పామ్ నర్సరీల నిర్వహణపై శ్రద్ధ వహించాలని, నాణ్యత లేని మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. రైతులకు ఈ పథకం పట్ల నమ్మకం ఏర్పడటానికి, అన్ని కంపెనీలు వారి ఫ్యాక్టరీ జోన్‌లతో ఆయిల్ మిల్లులను ఏర్పాటు చేయడానికి స్థలాలను సేకరించాలని అశోక్‌రెడ్డి సూచించారు.

పత్తిసాగులో మెరుగైన యాజమాన్య పద్ధతే మేలు

అధిక దిగుబడులపై రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచనలు



సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి సకాలంలో ప్రవేశిస్తాయన్న వాతావరణశాఖ సూచనలతో రైతాంగం వ్యవసాయ పనుల్లో బిజీ అవుతోంది. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇతర ఇన్‌పుట్స్ కోసం రైతులు సన్నద్ధమవుతున్నారు. విత్తనాల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పత్తి రైతులకు పలు సూచనలు చేసింది. అందుబాటులో ఉన్న వివిధ పత్తి హైబ్రిడ్‌లలో వరి, మినుము, సోయాచిక్కుడు పంటలలో మాదిరిగా ఎక్కువగా వైవిధ్యం లేదని, మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.రఘురామిరెడ్డి చెబుతున్నారు.

- ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో రాష్ట్రంలో సుమారు 55 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశాలున్నాయి.
- గతేడాదితో పోలిస్తే పత్తిసాగు 10 లక్షల ఎకరాలు అదనం. డిమాండ్ దృష్ట్యా 1.20 కోట్ల విత్తన ప్యాకెట్లు వ్యవసాయశాఖ అందుబాటులో ఉంచింది.
- రైతులు కొన్నిచోట్ల ఒకటి, రెండు కంపెనీల విత్తనాల కోసం డిమాండ్ చేయడం, ఆ కంపెనీల విత్తనం మాత్రమే కావాలని అడుగుతున్నారు. కానీ యాజమాన్య పద్ధతులే దిగుబడికి కారణం అవుతాయని అధికారులు చెబుతున్నారు.
- గతంలో కూడా రైతులు ఇలాగే ఒకే రకమైన విత్తనాలు కావాలని కోరితే, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న హైబ్రిడ్‌లపై విశ్వవిద్యాలయం అధ్యయనం చేసింది. దిగుబడులపై అంచనా వేసింది. ఆ హైబ్రిడ్‌ల దిగుబడుల్లో పెద్దగా తేడా లేదని పరిశోధనలో తేలింది.
- రెండుమూడేళ్లుగా అధిక సాంద్రత పత్తి సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. పొలాల్లో కూడా ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేశారు. దీనివల్ల ఎకరాకు రెండున్నర నుంచి 3 క్వింటాళ్ల అధిక దిగుబడి వచ్చిందని పరిశోధనలో తేలింది. మొక్కల సంఖ్య పెంచడం, మొక్కకు సరాసరి 10–12 కాయలు ఉన్నప్పుడు ఆశించిన దిగుబడులు సాధిస్తున్నట్టు గుర్తించారు.
- సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్లనే ఇది సాధ్యమైందని, ఎరువుల యాజమాన్యం, పోషకాల యాజమాన్యంతో మంచి దిగుబడులను సాధిస్తున్నట్టు పరిశీలనలో వెలుగు చూసింది.
- సూక్ష్మ పోషకలోపాలను సరిదిద్ది, మేలైన చీడపీడల యాజమాన్యం పాటించడం వల్ల పత్తి పంటలో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.
- వర్షాధారంగా పత్తిని ఎవరైతే సాగు చేస్తున్నారో, ఆ రైతులు, పెద్ద కాయలు ఉన్న హైబ్రిడ్‌ల కన్నా, మధ్యస్థంగా కాయలు వచ్చే హైబ్రిడ్‌లను ఎంపిక చేసుకోవడం మంచిది.
- నీటి వసతులు ఉన్నచోట, నల్ల భూములు ఉన్నచోట పెద్ద కాయలు వచ్చే హైబ్రిడ్‌లను ఎంపిక చేసుకోవచ్చు.
- భూమి తడిసి, 50– 60 మిల్లీ మీటర్ల వర్షపాతం పడిన తర్వాతనే పత్తి గింజలు విత్తుకోవాలి.
- చెలక భూములు, తేలిక భూములు, వర్షాధార భూముల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల దిగుబడులు పెంచుకోవచ్చు.
- ఎకరాకు 48 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాషియం సరైన మోతాదులో ఎరువుల యాజమాన్యం చేపట్టడం వల్ల పత్తిలో మంచి దిగుబడులు సాధించవచ్చు.
- అవసరం మేరకు పోషకాల పిచికారీ (19:19:19 / 13:0:45/యూరియా) చేపట్టాలి.

రైతులకు కావాల్సిన విత్తనాలివ్వాలి

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా చేసే పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. ఏ జిల్లాలో ఎలాంటి పంటలు వేస్తారు? ఎలాంటి విత్తనాలు కావాలో ప్రభుత్వానికి అవగాహన లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వానికి వ్యవసాయ రంగానికి సంబంధించి ఎలాంటి ప్రణాళిక లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి 48 గంటల సమయం ఇస్తున్నామన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు అందించాలని లేదంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విత్తనాలు చల్లే టైమ్ వచ్చినా రైతులకు బ్యాంకులు లోన్ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని, పంట రుణాలు రాక పెట్టుబడులకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రుణమాఫీ హామీ ఇచ్చిన సీఎం.. బ్యాంకర్లతో మీటింగ్ పెట్టి రుణమాఫీ చేస్తామని, కొత్త లోన్లు ఇవ్వాలని ఎందుకు చెప్పడం లేదని శంకర్ ప్రశ్నించారు. ఆదిలాబాద్‌లో నకిలీ విత్తనాలు దొరికాయని, అయితే పట్టుబడినవారు గంటకే బెయిల్‌పై బయటికి వస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవడంలో విఫలమైందని అన్నారు. పత్తి విత్తనాల సమస్యపై సీఎస్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వగా తగిన చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారన్నారు.

ఒడిశాలో రసవత్తర పోటీ

బీజేడీ, బీజేపీ హోరాహోరీ

6 స్థానాలకు శనివారం పోలింగ్

బీజేపీ, అధికార బీజేడీ మధ్య నువ్వా నేనా అన్నట్టుగా హోరాహోరీ పోరు సాగుతున్న ఒడిశాలో ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుతోంది. 15 లోక్‌సభ, వాటి పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ఇప్పటికే ముగిసింది. చివరి దశలో భాగంగా మిగతా 6 లోక్‌సభ స్థానాలు, వాటి పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. వీటిలో 4 బీజేడీ, 2 బీజేపీ సిట్టింగ్ స్థానాలు. వాటిపై ఫోకస్...



జగత్‌సింగ్‌పూర్

ఇక్కడ రెండు దశాబ్దాలుగా బీజేడీ చక్రం తిప్పుతోంది. బీజేపీ ఖాతా తెరవలేదు. 2019లో భారీ మెజారిటీతో నెగ్గిన రాజశ్రీ మల్లిక్ బీజేడీ నుంచి, ఆయన చేతిలో ఓడిన బిబూ ప్రసాద్ తరాయ్ బీజేపీ నుంచి మళ్లీ బరిలో ఉన్నారు. తరాయ్ 2009లో సీపీఐ నుంచి, 2014లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు. ఆయన ఓటు బ్యాంకును చూసి బీజేపీ మరోసారి చాన్సిచ్చినట్టు చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి రవీంద్ర కుమార్ సేథీ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు బీజేడీలోకి చేరడం ఆ పార్టీకి అనుకూలించే అంశం.

జాజ్‌పూర్

బీజేడీ నుంచి సిట్టింగ్ ఎంపీ శర్మిష్ఠ సేథీ మళ్లీ బరిలో ఉన్నారు. రవీంద్ర నారాయణ బెహరాకు బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ ఆంచల్ దాస్ పోటీ చేస్తున్నారు. ఆయన 1996లో ఇక్కడ జనతాదళ్ నుంచి గెలిచారు. గత ఐదేళ్లలో బీజేపీ ఓటు బ్యాంక్ బాగా పెరిగిందన్న ధీమా ఆ పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది. అయితే పార్టీ అభ్యర్థి బెహరా స్థానికులకు పరిచయస్తుడే అయినా రాజకీయాలకు కొత్త.

బరిలో కోటీశ్వరులు

ఒడిశాలో తుది విడత బరిలో ఉన్న 66 మంది అభ్యర్థుల్లో 20 మంది కోటీశ్వరులే. కేంద్రపర బీజేపీ అభ్యర్థి బైజయంత్ పాండాకు అత్యధికంగా రూ.148 కోట్లున్నాయి. తర్వాత స్వతంత్ర అభ్యర్థి శ్రీరామ్ పాండే రూ.18.23 కోట్లు, భద్రక్ బీజేపీ ఎంపీ మంజులత మండల్‌కు రూ.14.86 కోట్ల ఆస్తులున్నాయి. 15 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వీరిలో 10 మంది తీవ్ర కేసుల్లో నిందితులని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) పేర్కొంది.

కేంద్రపర

ఇది బీజేడీ కంచుకోట. ఈసారి మాత్రం బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయి. 2009, 2014ల్లో బీజేడీ నుంచి గెలిచిన బైజయంత్ పాండా గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగి బీజేడీ నేత, సినీ నటుడు అనుభవ్ మహంతి చేతిలో ఓటమి చవిచూశారు. ఒకప్పుడు సీఎం నవీన్ పట్నాయక్‌కు అత్యంత సన్నిహితుడైన బైజయంత్ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుని హోదాలో మరోసారి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ అనుభవ్ మహంతి కూడా బీజేపీలో చేరడంతో బీజేడీ సంకట స్థితిలో పడింది. అన్షుమన్ మహంతిని పోటీకి దింపింది.

మయూర్‌భంజ్

సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్ తుడు స్థానంలో ఎమ్మెల్యే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సన్నిహితుడు నాబా చరణ్ మఝికి ఈసారి బీజేపీ టికెటిచ్చింది. ద్రౌపది ముర్ము 2009లో ఈ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఐదుసార్లు ఎమ్మెల్యే అయిన విద్యా శాఖ మంత్రి సుదమ్ మరాండీని బీజేడీ బరిలో దింపింది. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సోదరి అంజని సోరెన్ జేఎంఎం తరఫున పోటీలో ఉండటంతో త్రిముఖ పోటీ నెలకొంది.

భద్రక్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సమల్ భద్రక్ లోక్‌సభ స్థానం పరిధిలోని చాంద్‌బలి అసెంబ్లీ స్థానంలో పోటీ చేస్తున్నారు. దాంతో భద్రక్‌లో గెలుపు బీజేపీకి ప్రతిష్ఠాత్మకంగా మారింది. బీజేపీ నుంచి కేంద్ర మాజీ మంత్రి అరుణ్ చరణ్ సేథీ కుమారుడు అవిమన్యు సేథీ పోటీ చేస్తున్నారు. బీజేడీ నుంచి సిట్టింగ్ ఎంపీ మంజులతా మండల్, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ అనంత ప్రసాద్ సేథీ బరిలో ఉన్నారు.

బాలాసోర్

బీజేపీ సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి మళ్లీ బరిలో ఉన్నారు. బీజేడీ నుంచి మాజీ బీజేపీ నేత లేఖశ్రీ సమంత సింగార్ పోటీ చేస్తున్నారు. పార్టీని అస్తమానం విమర్శించే లేఖశ్రీకి టికెటివ్వడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. నిజానికి కంధమాల్ నుంచి బీజేపీ తరఫున పోటీకి లేఖశ్రీ ఆసక్తి చూపారు. నీలగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని అధిష్టానం సూచించడంతో బీజేడీలో చేరారు. కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి శ్రీకాంత్ కుమార్ జెనా పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి మూడుసార్లు గెలిచిన కరబేల స్వైన్ స్వతంత్ర అభ్యర్థిగా రెండు పార్టీలకూ సవాలు విసురుతున్నారు.

52.9 డిగ్రీలు.. నిజమేనా!?

- ఢిల్లీలో నమోదైందన్న ఐఎండీ
- నిర్ధారణ కాలేదన్న కేంద్ర మంత్రి రిజిజు
- సెన్సర్లను పరిశీలిస్తున్న నిపుణులు
- ఎండలకు అల్లాడుతున్న ఉత్తరాది
- రాజస్తాన్‌లో 50 డిగ్రీలపైనే
- ఉత్తరాది రాష్ట్రాలకు రెడ్ అలర్టులు





సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరాదిలో ఎండల తీవ్రత నానాటికీ పెరుగుతోంది. బుధవారం రాజస్తాన్‌లో పలుచోట్ల ఉష్ణోగ్రత 50 డిగ్రీలు దాటేసింది. పాకిస్తాన్ మీదుగా అక్కడి నుంచి వీస్తున్న తీవ్రమైన వేడి గాలులతో దేశ రాజధాని అల్లాడుతోంది. దాంతో వరుసగా రెండో రోజు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ క్రమంలో ఢిల్లీ సమీపంలోని ముంగేశ్‌పూర్‌లో దేశ చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదైందంటూ వచ్చిన వార్తలు కలకలం రేపాయి. మధ్యాహ్నం 2.30 సమయంలో అక్కడ 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు భారత వాతావరణ శాఖ ప్రాంతీయ డైరెక్టర్ కుల్‌దీప్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. మన దేశంలో రాజస్తాన్ సహా ఏ రాష్ట్రంలోనూ ఇప్పటిదాకా ఇంతటి ఉష్ణోగ్రతలు నమోదవలేదు. అయితే 52.9 డిగ్రీలన్నది అధికారికంగా నిర్ధారణ కాలేదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ''ఢిల్లీలో అంత ఉష్ణోగ్రత నమోదైందంటే నమ్మశక్యంగా లేదు. వాస్తవమేమిటో తెలుసుకోవాలని ఐఎండీ అధికారులకు సూచించాం. దీనిపై త్వరలో స్పష్టత వస్తుంది'' అంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. దాంతో నిజానిజాలను పరిశీలిస్తున్నట్టు ఐఎండీ డైరెక్టర్ జనరల్ ఎం.మహాపాత్ర తెలిపారు. ''డేటాలో తప్పులు దొర్లి ఉండొచ్చు. అంతటి ఉష్ణోగ్రత నిజమే అయితే స్థానిక పరిస్థితులేవైనా కారణమై ఉండొచ్చు. ముంగేశ్‌పూర్ వాతావరణ కేంద్ర సెన్సర్లను స్పెషలిస్టుల బృందం నిశితంగా అధ్యయనం చేస్తోంది'' అని వివరించారు. బుధవారం రాజస్తాన్‌లోని ఫలోదీలో 51 డిగ్రీలు, పరిసర ప్రాంతాల్లో 50.8 డిగ్రీలు, హరియాణాలోని సిర్సాలో 50.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఢిల్లీలోని నజఫ్‌గఢ్‌లో 49.1 డిగ్రీలు, పుసాలో 49, నరేలాలో 48.4 డిగ్రీలు నమోదైంది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్‌లో ప్రాంతంలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడ గత 79 ఏళ్లలో ఇదే అత్యధికం. హరియాణా, పంజాబ్, రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ కూడా ఎండ దెబ్బకు అల్లాడుతున్నాయి. హీట్ వేవ్ నేపథ్యంలో ఢిల్లీతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు రెడ్ అలెర్ట్ జారీ అయింది. ఎండలకు తోడు తీవ్రస్థాయిలో వడగాలులు వీస్తున్నాయి. దాంతో జనం బయటకు రావాలంటే వణికిపోతున్నారు. నిత్యం లక్షలాది వాహనాలతో రద్దీగా ఉండే ఢిల్లీ రోడ్లు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం దాకా నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

రికార్డు విద్యుత్ డిమాండ్

ఎండల ధాటికి ఢిల్లీలో విద్యుత్ డిమాండ్ చుక్కలనంటుతోంది. బుధవారం మధ్యాహ్నం 3.36 గంటలకు 8,302 మెగావాట్ల పవర్ డిమాండ్ నమోదైంది. ఇది ఢిల్లీ చరిత్రలోనే రికార్డని డిస్కం అధికారులు చెప్పారు.

సాయంత్రం భారీ వర్షం

ఢిల్లీలో బుధవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన రెండు గంటల తర్వాత వర్షం ప్రారంభమైంది. దీంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

రెండు, మూడు రోజుల్లో వర్షాలు

అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయుగుండం నేపథ్యంలో వాయువ్యం నుండి తూర్పు దిశగా వీచే గాలుల కారణంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని ఐఎండీ తెలిపింది. వచ్చే రెండు, మూడు రోజుల్లో ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, ఢిల్లీ, హరియాణా రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది.

రుద్ర క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: ఆకాశంలో నుంచి భూమి పైనున్న లక్ష్యాలపైకి ప్రయోగించే రుద్ర ఎం–2 మిస్సైల్‌ను భారత్ బుధవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరం నుంచి ఎస్‌యూ–30 ఫైటర్ జెట్ ద్వారా ప్రయోగించిన రుద్ర నిర్దేశించిన అన్ని లక్ష్యాలను అందుకుందని రక్షణమంత్రిత్వ శాఖ వెల్లడించింది. రుద్ర ఎం–2 మిస్సైల్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించారు. డీఆర్‌డీఓకు చెందిన పలు లాబొరేటరీలు రూపొందించిన సాంకేతికతలను ఇందులో వాడారు. నేలపై ఉన్న పలురకాల శత్రు లక్ష్యాలను ఛేదించేందుకు రుద్ర క్షిపణిని అభివృద్ధి చేశారు. రుద్ర ఎం–2ను విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌ను రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు. రుద్ర ఎం–2 క్షిపణి పరీక్ష విజయవంతం కావడం భారత సాయుధబలగాల బలాన్ని రెట్టింపు చేస్తుందని పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

సాక్షి, న్యూఢిల్లీ: మధ్యంతర బెయిలు పొడిగింపు విషయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మధ్యంతర బెయిలును ఏడురోజులు పొడిగించాలంటూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, రెగ్యులర్ బెయిలు కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లే స్వేచ్ఛను కేజ్రీవాల్‌కు ఇచ్చిన నేపథ్యంలో బెయిలు పొడిగింపు పిటిషన్ మెయింటైనబుల్ కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతోపాటు తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు కూడా రిజర్వ్‌లో ఉందని అందువల్ల తాజా పిటిషన్ ప్రధాన పిటిషన్‌కు సంబంధం ఉండదని తెలిపింది. ఈ మేరకు కేజ్రీవాల్ పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ ముందు జాబితా చేయడానికి సుప్రీంకోర్టు రిజిస్ట్రీ అనుమతించలేదు. మరోవైపు, సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిలు గడువు పూర్తి అయిన తర్వాత జూన్ 2న కేజ్రీవాల్ సరెండర్ కావాల్సి ఉంది.

ప్రజ్వల్‌కు ముందస్తు బెయిల్ తిరస్కరణ

బెంగళూరు: పలువురు మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపణలను ఎదుర్కొంటున్న, ఒక అత్యాచారం కేసులో నిందితుడైన హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు బుధవారం ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది. తన న్యాయవాది అరుణ్ ద్వారా ప్రజ్వల్ ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను తోసిపుచ్చింది. లైంగిక వేధింపుల వీడియోలు బయటికి రావడంతో హసన్‌లో ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు, ఏప్రిల్ 27న ప్రజ్వల్ జర్మనీకి వెళ్లిపోయారు. అప్పటినుంచి అజ్ఞాతంలో ఉన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విజ్ఞప్తి మేరకు ఈనెల 18న ప్రజాప్రతినిధుల కోర్టు ప్రజ్వల్ రేవణ్ణపై అరెస్టు వారెంటు జారీ చేసింది. ప్రజ్వల్ ఈనెల 30న జర్మనీలోని మ్యూనిచ్ నుంచి బెంగళూరుకు విమానం టికెట్‌ను బుక్ చేసుకున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. 31న వేకువజామున బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగగానే ప్రజ్వల్‌ను సిట్ అరెస్టు చేసే అవకాశాలున్నాయి.

పాకిస్తాన్‌లో ఘోర ప్రమాదం

- బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో లోయలో పడిన బస్సు
- 28 మంది దుర్మరణం.. 22 మందికి గాయాలు

కరాచీ: పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో బుధవారం ఘోరప్రమాదం సంభవించింది. పలువురు మహిళలు, చిన్నారులు సహా మొత్తం 28 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 22 మంది గాయపడ్డారు. మరికొందరు క్షేమంగా బయటపడ్డారు. తుర్బాత్ నుంచి క్వెట్టాకు 50 మందికిపైగా ప్రయాణికులతో బయలుదేరిన ఈ బస్సు వషూక్ పట్టణం సమీపంలో అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. బలూచిస్తాన్ రాజధాని క్వెట్టాకు 700 కిలోమీటర్ల ఈ దూరంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెప్పారు. ఆరుగురు ప్రయాణికులు ఘటనా స్థలంలోనే మృతి చెందారని, మరో 22 మంది ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మరణించారని వెల్లడించారు. రహదారిపై మూలమలుపు వద్ద బస్సు టైర్ పేలిపోయిందని, బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు.

బీజేపీకి 295 -305 సీట్లు

- కాంగ్రెస్‌కు 55–65 సీట్లు
- బెట్టింగ్ మార్కెట్ వర్గాల అంచనా

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల చివరి దశ పోలింగ్‌కు ప్రచారం నేటితో ముగుస్తుండటంతో ఇప్పటిదాకా జరిగిన ఆరు దశల పోలింగ్, ప్రచారసరళిని బట్టి తాజా లెక్కల ప్రకారం బీజేపీకి 295 -305 సీట్లు రావొచ్చని బెట్టింగ్ మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. కాంగ్రెస్ ఈసారి 55–65 సీట్లు సాధించవచ్చు అని ఆయా వర్గాలు విశ్లేషించాయి. బీజేపీ జనంలోకి బాగా ప్రాచుర్యం కల్పించేందుకు ప్రయత్నించిన 'ఈసారి 400 సీట్లు' నినాదం పనిచేయకపోవచ్చని బెట్టింగ్ మార్కెట్ ఊహిస్తోంది. బీజేపీకి ఈసారి 400 సీట్లు కష్టమని, అయినాసరే ఈసారి బీజేపీయే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని ఆయా వర్గాలు వెల్లడించాయి. '' తొలి దశ ఎన్నికల ముందు వరకు బీజేపీ ఎక్కువ చోట్ల గెలుస్తుందన్న అంచనాలుండేవి. బీజేపీ 315–325 వరకు, కాంగ్రెస్ 45–55 వరకు గెలవచ్చు అని తొలుత భావించాం. కానీ మూడు దశలు ముగిశాక చూస్తే బీజేపీ 270–280 వరకు, కాంగ్రెస్ 70–80 వరకు గెలవచ్చు అని అంచనాలొచ్చాయి. ప్రస్తుతం చూస్తే బీజేపీ 295–305 వరకు, కాంగ్రెస్ 55–65 వరకు సీట్లు గెలువొచ్చు'' అని ముంబైలో ఉండే ఒక కీలకమైన బుకీ బుధవారం చెప్పారు. '' బీజేపీ 400 కాదుకదా కనీసం 350 గెలుస్తుందని ఏనాడూ బెట్టింగ్‌లో గణాంకాలు రాలేదు. ఈ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రూ.8–9 లక్షల కోట్ల మేర బెట్టింగ్ జరుగుతోంది' మరో బుకీ వెల్లడించారు. ఎన్డీఏ కూటమి మహారాష్ట్రలో 28 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లో 64–66 స్థానాలు కైవసం చేసుకోవచ్చని తెలిపారు. గుజరాత్‌లో బీజేపీ క్లీన్ స్వీప్ చేస్తుందని అంచనా వేశారు.

వాళ్లను చంపేయండి!

- ఇజ్రాయెల్ క్షిపణిపై నిక్కీ హేలీ సందేశం
- వెల్లువెత్తిన విమర్శలు



క్షిపణిపై సంతకం చేస్తున్న నిక్కీ. ఇన్‌సెట్‌లో సందేశం

టెల్ అవీవ్: అమాయక పాలస్తీనియన్లపై విచక్షణారహితంగా విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్ సైన్యానికి అమెరికా నేతలు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపే ఫొటో ఒకటి బహిర్గతమైంది. శాంతికాముక ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా సేవలందించిన రిపబ్లికన్ పార్టీ నాయకురాలు నిక్కీ హేలీ హమాస్‌పై ఇజ్రాయెల్ దాడికి పూర్తి మద్దతు పలుకుతూ ఒక మిస్సైల్‌పై తన సందేశం రాశారు. ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీ లెబనాన్ సరిహద్దు వెంట ఇజ్రాయెల్ స్థావరాలకు వెళ్లారు. గాజా స్ట్రిప్‌పై గగనతల దాడికి సిద్ధంగా ఉంచిన ఒక క్షిపణిపై 'వాళ్లను చంపేయండి. అమెరికా ఎల్లప్పుడూ ఇజ్రాయెల్‌కు తోడుగా ఉంటుంది' అని రాసి సంతకం చేశారు. అయితే దేశాన్ని శాంతియుతంగా పాలిస్తానంటూ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిత్వం కోసం పోటీ పడిన నాయకురాలు ఇలా యుద్ధజ్వాలలు మరింత రగిలించడమేంటి? అంటూ నెటిజన్లు నిక్కీ హేలీపై విమర్శలు గుప్పించారు.

బ్రిజ్‌భూషణ్ తనయుడి కాన్వాయ్ బీభత్సం

- జనం మీదకు దూసుకెళ్లడంతో ఇద్దరు యువకుల దుర్మరణం
- కైసర్‌గంజ్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కరణ్ భూషణ్ సింగ్

గోండా(ఉత్తరప్రదేశ్): మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపుల ఆరోపణలపై దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచిన వివాదాస్పద బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ మరోసారి పతాక శీర్షికలకెక్కారు. ఆయన కుమారుడు, కైసర్‌గంజ్ బీజేపీ అభ్యర్థి కరణ్ భూషణ్ సింగ్‌కు చెందిన వాహనశ్రేణి ఢీకొనడంతో రెహాన్ ఖాన్(17), షెహ్‌జాద్ ఖాన్(20) అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 60 ఏళ్ల మహిళ గాయపడ్డారు. బుధవారం ఉత్తర ప్రదేశ్‌లోని గోండా జిల్లాలోని కల్నర్‌గంజ్–హుజూర్‌పూర్ రోడ్డులోని వైకుంఠ్ డిగ్రీ కాలేజీ సమీపంలో ఈ ఘటన జరిగింది. మెడిసిన్ తీసుకొద్దామని బయటికెళ్లిన రెహాన్, షెహ్‌జాద్‌లపై కారు దూసుకెళ్లిందని రెహాన్ తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఘటనాస్థలిలో కారు వదిలేసి అందులోని వారు పారిపోయారు. తర్వాత పోలీసులు కారు డ్రైవర్ లవ్‌కుశ్ శ్రీవాస్తవ్‌ను అరెస్ట్‌చేశారు. ''ఘటన జరిగినపుడు ఆ కాన్వాయ్‌లో నాలుగు వాహనాలు ఉన్నాయి. మొదటి కారులో కరన్ భూషణ్ ఉన్నారు. చివరి కారు అదుపుతప్పి రోడ్డు వెంట ఉన్న వారిని ఢీకొట్టింది' అని అదనపు ఎస్పీ రాధేశ్యామ్ రాయ్ చెప్పారు. ఇద్దరు స్థానికులు మరణించడంతో వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఆ రోడ్డులో వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. జనం మీదకు కారును పోనిచ్చిన ఉదంతంలో నిందితులకు శిక్షపడేలా చేయాలని డిమాండ్‌చేశారు. దీంతో శాంతిభద్రతల సమస్యను నివారించేందుకు పోలీసులు పెద్ద సంఖ్యలో రంగంలోకి దిగి అక్కడ మొహరించారు. స్థానికుల పైకి ఎస్‌యూవీ వాహనం పోనిచ్చిన ఘటనలో ఇద్దరి మృతదేహాలను పోస్ట్‌మార్టమ్ అనంతరం వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. గాయపడిన వృద్ధురాలికి ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు.

తండ్రిని తప్పించి తనయుడికి టికెట్

ఉమెన్ రెజ్లర్‌లపై లైంగిక వేధింపుల కేసులో ప్రమేయముందన్న ఆరోపణపై బీజేపీ ఈసారి బ్రిజ్‌భూషణ్‌కు ఎంపీ టికెట్ ఇవ్వలేదు. తన సమీప ప్రాంతాల జిల్లాల్లో బ్రిజ్‌భూషణ్‌కు మంచి ప్రాబల్యం ఉంది. అందుకే ఈసారి బ్రిజ్‌భూషణ్‌కు పక్కనపెట్టి ఆయన కుమారుడు కరణ్‌కు ఎంపీ టికెట్ ఇచ్చింది. ప్రమాదం జరిగిన తెల్ల ఎస్‌యూవీ కారు కరణ్ కుటుంబానికి చెందిన నందినినగర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ పేరిట రిజిస్టర్ అయి ఉంది.

కోడ్ ఉల్లంఘనే

మీడియాలో ప్రసారం కాకుండా చర్యలు తీసుకోండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన 48 గంటల ధ్యానంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఏడో విడత పోలింగ్ ముందు ప్రధానమంత్రి ధ్యానం చేయడం ముమ్మాటికీ ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ ధ్యాన మండపంలో గురువారం నుంచి రెండు రోజులపాటు మోదీ ధ్యానం చేయనున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని టీవీ మీడియాలో ప్రసారం చేయకుండా, ప్రింట్ మీడియాలో ప్రచురించకుండా చర్యలు తీసుకోవాలని బుధవారం ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతలు రణదీప్ సూర్జేవాలా, అభిషేక్ సింఘ్వీ, సయ్యద్ నజీర్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

ధ్యానం చేస్తూ ఎవరైనా కెమెరా తీసుకెళ్తారా?: మమత

బారూయ్‌పూర్(పశ్చిమబెంగాల్): వివేకానంద శిలాస్మారకం వద్ద ప్రధాని మోదీ చేయబోయే ధ్యానంపై టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ అనుమానం వ్యక్తంచేశారు. మంగళవారం పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పూర్ నియోజకవర్గంలో టీఎంసీ ఎన్నికల ప్రచార ర్యాలీలో మమత ప్రసంగించారు. '' మేం ఖచ్చితంగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేస్తాం. ఆయన ధ్యానం చేసుకోవాలనుకుంటే చేసుకోమనండి. కానీ ఆయన మెడిటేషన్ చేస్తున్నప్పుడు టెలివిజన్‌లో ప్రత్యక్ష ప్రసారాలు చేస్తే ఒప్పుకోం. ధ్యానం చేసేందుకు వెళ్తూ ఎవరైనా కెమెరా వెంట తీసుకెళ్తారా?'' అని అన్నారు.

బెంగాల్‌లోకి అక్రమ వలసలు

- సరిహద్దు ప్రాంతాల్లో జనాభా స్థితిగతుల్లో మార్పులు
- యువత అవకాశాలను కాజేస్తున్న చొరబాటుదార్లు
- తృణమూల్ సర్కారుపై మోదీ ధ్వజం

కాక్‌ద్వీప్/మయూర్‌భంజ్/బాలాసోర్: 'వికసిత్ భారత్' సాకారం కావాలంటే 'వికసిత్ బెంగాల్' కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోకి అక్రమ వలసలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్ సరిహద్దు ప్రాంతాల్లో జనాభా స్థితిగతుల్లో మార్పులు వస్తున్నాయని, స్థానిక యువతకు దక్కాల్సిన అవకాశాలను చొరబాటుదార్లు కాజేస్తున్నారని ఆరోపించారు. ప్రజల భూములను, ఆస్తులను లాక్కుంటున్నారని, ఇది తీవ్రమైన అంశమని పేర్కొన్నారు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసం పాకులాడుతోందని, అసలైన ఓబీసీల హక్కులను ముస్లింలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. ముస్లింలకు ఓబీసీల పేరిట తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేస్తోందని విమర్శించారు. బెంగాల్‌లోకి అక్రమ చొరబాట్లను ప్రోత్సహిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకులు పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం పశ్చిమ బెంగాల్‌లోని కాక్‌ద్వీప్, ఒడిశాలోని మయూర్‌భంజ్, బాలాసోర్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధానమంత్రి మాట్లాడారు. ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...



దేశ భద్రతను పణంగా పెడుతున్నారు

''ఇతర దేశాల్లో మత హింస కారణంగా వలస వచ్చిన హిందువులకు, మతువాలకు భారత పౌరసత్వం ఇవ్వడాన్ని తృణమూల్ కాంగ్రెస్ నిస్సిగ్గుగా వ్యతిరేకిస్తోంది. సమాజంలో ఓ వర్గాన్ని మచ్చిక చేసుకోవడానికి రాజ్యాంగంపై దాడి చేస్తోంది. ముస్లింలకు ఓబీసీ హోదా కల్పించడాన్ని కలకత్తా హైకోర్టు రద్దు చేసింది. కానీ, కోర్టు తీర్పును తృణమూల్ కాంగ్రెస్ అంగీకరించడం లేదు. ఈ తీర్పుపై తప్పుడు ప్రచారం చేస్తోంది. ముస్లింలను తప్పుదోవ పట్టిస్తోంది. దేశ భద్రతను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం పణంగా పెడుతోంది. అక్రమ చొరబాట్లపై చర్యలు తీసుకోవడం లేదు.

నవీన్ పట్నాయక్ అనారోగ్యం వెనుక కుట్ర!

ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆరోగ్యంగా హఠాత్తుగా క్షీణించిందని చెబుతున్నారు. గత ఏడాది కాలంగా ఆయన ఆరోగ్య పరిస్థితి దిగజారుతున్నట్లు వార్తలొస్తున్నాయి. దీనివెనుక ఏదైనా కుట్ర ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నవీన్ పట్నాయక్ తరఫున ప్రస్తుతం ఒడిశా ప్రభుత్వాన్ని నడిపిస్తున్న బలమైన లాబీ ఈ కుట్రకు తెరతీసిందా? అనే సందేహాలు లేకపోలేదు. నవీన్ బాబు ఆరోగ్యం క్షీణించడం వెనుక మిస్టరీ ఏమిటో బయటపడాలి. ఒడిశాలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నవీన్ పట్నాయక్ ఆరోగ్యం హఠాత్తుగా క్షీణించడంపై కారణాలు తెలుసుకోవడానికి ఒక కమిటీ ఏర్పాటు చేస్తాం''. అని మోదీ స్పష్టం చేశారు.

నా ఆరోగ్యం భేషుగ్గా ఉంది: నవీన్ పట్నాయక్

తన ఆరోగ్యం క్షీణించడం వెనుక కుట్ర ఉందంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఆరోపణలను ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఖండించారు. తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని, గత నెల రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నానని వెల్లడించారు. ఈ మేరకు ఆయన బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

మాదకద్రవ్యాల మహమ్మారి వీడట్లేదు

రాహుల్ గాంధీ వ్యాఖ్య

చండీగఢ్: ఇన్నేళ్లు గడుస్తున్నా పంజాబ్ రాష్ట్రంలో డ్రగ్స్ సమస్య అలాగే తిష్టవేసిందని, మహమ్మారిపై కఠిన చర్యల యుద్ధం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. బుధవారం లూథియానా కాంగ్రెస్ అభ్యర్థి అమరీందర్ సింగ్ రాజా వారింగ్ తరఫున దఖా ప్రాంతంలో, పటియాలా అభ్యర్థి ధరమ్‌వీర్ గాంధీ తరఫున పటియాలాలో రాహుల్ ప్రసంగించారు. పంజాబ్‌లో పొత్తులేకుండా ఆప్, కాంగ్రెస్ వేర్వేరుగా పోటీచేస్తున్న నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వ పనితీరును రాహుల్ విమర్శించారు. ''డ్రగ్స్ సమస్య రాష్ట్రంలో ఎప్పటి నుంచో ఉంది. అది ఈ మధ్య మరీ ఎక్కువైంది. డ్రగ్స్ సంస్కృతికి కఠిన చర్యలతో చరమగీతం పాడాల్సిందే'' అన్నారు.

మోదీని 11వ అవతారం అంటారేమో: ఖర్గే

బాలాసోర్/ భద్రక్: బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని భగవంతుడు విష్ణు పదకొండో అవతారంగా చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారని, దేశ ప్రజలు దీనిని ఆమోదించరని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ''రాముడు, కృష్ణుడు, వామనుడు.. ఇలా విష్ణువు దశావతారాలు దాల్చినట్టు విన్నాం. ఇప్పుడు మోదీని పదకొండో అవతారంగా చూపించే ప్రయత్నం జరుగుతోంది'' అని బుధవారం ఒడిశాలో ఎన్నికల సభల్లో ఖర్గే అన్నారు.

సాక్షి
హైదరాబాద్

గురువారం । 30 । మే । 2024

బిల్లులు చెల్లించరూ..

సాక్షి, సిటీబ్యూరో: బిల్లులు చెల్లించాలంటూ వివిధ మార్గాల్లో ఆందోళనలు నిర్వహించిన జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా తమ బాధను వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే బిల్లులు విడుదల చేయకుండా, తద్వారా తాము పనులు చేయకుండా ఉండేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు.



భూ ఆక్రమణలకు చెక్

అక్రమార్కుల భూ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. గండిపేట మండలం గంధంగూడలో రూ.250 కోట్ల విలువైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. -8లో

జూన్ 1, 2 తేదీల్లో చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: వారస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆలిండియా మెగా ఓపెన్, అండర్-15 చెస్ టోర్నమెంట్ జరగనుంది. సికింద్రాబాద్ బోయిగూడలోని గుజరాతీ సేవా మండల్‌లో జూన్ 1, 2 తేదీల్లో ఈ టోర్నీని నిర్వహిస్తున్నామని వారస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ వి.రాఘవ్ శ్రీవత్సవ్ తెలిపారు. టోర్నీని రూ. 2 లక్షల ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్నారు. ఈ టోర్నీలో పాల్గొనేవారు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి, ఇతర వివరాలకు 73968 47937.



పరేడ్ గ్రౌండ్‌లో పనులను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి తదితరులు





ట్యాంక్‌బండ్‌పై ఏర్పాట్ల గురించి ఆరా తీస్తున్న దానకిశోర్, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఆమ్రపాలి, రోనాల్డ్ రాస్





ట్యాంక్‌బండ్‌కు అవతరణ కళ!

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు భాగ్యనగరం సిద్ధమవుతోంది. జూన్ 2న జరగనున్న వేడుకలకు సంబంధించిన పనులు జోరందుకున్నాయి. పరేడ్ గ్రౌండ్, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాలు ఇందుకు వేదికలు కానున్నాయి. బుధవారం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాట్లను నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ ఆమ్రపాలి తదితరులు పరిశీలించారు.

కారుతో ఢీకొట్టి.. ఆపై ఈడ్చుకెళ్లి..

- యువకుడు, మహిళకు గాయాలు
- సైదాబాద్‌లో హిట్ అండ్ రన్ ఘటన



రోడ్డుపై పడిపోయిన ధర్మానాయక్



ప్రమాదానికి కారణమైన కారు

సైదాబాద్: అతివేగంతో నిర్లక్ష్యంగా కార్లను నడుపుతూ ఎదురుగా వచ్చేవారిని ఢీకొట్టి అక్కడి నుంచి పరారావుతున్న హిట్ అండ్ రన్ ఘటనలు నగరంలో వరుసగా జరుగుతున్నాయి. బుధవారం సైదాబాద్‌లోనూ ఇదే తరహా ప్రమాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్నట్లు తెలుస్తున్న యువకుడు కారుతో బీభత్సం సృష్టించాడు. నిమిషాల వ్యవధిలో కారుతో ఇద్దరిని ఢీ కొట్టాడు. మొదటి ఘటనలో యువకుడు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. రెండో ఘటనలో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. కొత్తపేటలో నివసించే బానోతు ధర్మా నాయక్ బుధవారం ఉదయం 6 గంటలకు తన ద్విచక్ర వాహనంపై తండ్రి కిషన్ నాయక్‌ను సైదాబాద్ కాలనీలో అతను పని చేసే కార్యాలయం వద్ద దింపి ఇంటికి తిరిగి వెళుతున్నాడు. సైదాబాద్ నుంచి సరూర్‌నగర్ మార్గంలో వెళుతున్న అతనిని బ్యాంక్ కాలనీ కమాన్ నుంచి వేగంగా దూసుకు వచ్చిన ఇన్నోవా క్రిస్టా బలంగా ఢీకొట్టి కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. ప్రమాదం జరిగిన తర్వాత కూడా కారు ఆపకుండా ఆగంతుకులు అక్కడి నుంచి ఉడాయించారు. వారు కారులో పరారయ్యే క్రమంలో అక్కడికి సమీపంలో శ్రీలక్ష్మి అనే మహిళను ఢీకొట్టగా ఆమెకు స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారంతో ధర్మా నాయక్‌ను తండ్రి కిషన్ నాయక్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కారు నడిపింది సైదాబాద్‌కు చెందిన ప్రణయ్‌కుమార్ రెడ్డిగా పోలీసులు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ముగ్గురు యువకులు ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమాల ‘ప్లానింగ్’

గ్రేటర్‌లో అడ్డగోలుగా భవన నిర్మాణాలు

- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- ఇష్టారీతిగా భవన నిర్మాణ అనుమతులు
- సెట్‌బ్యాక్ ఉల్లంఘన నుంచి ఓసీలు జారీ దాకా..
- ఎల్‌బీ నగర్ జోన్‌లో పెచ్చుమీరిన అవినీతి

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ కాలనీలో సర్వే నెంబర్ 59లో ఓ ప్లాట్ కొనుక్కున్న బి.ప్రభాకర్‌రెడ్డి తన ప్లాట్‌ను మరో వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో పాటు దాన్ని వేరే వాళ్లకు విక్రయించారని తెలిసి హతాశులయ్యారు. సదరు ప్లాట్ యాజమాన్య హక్కులపై సివిల్‌కోర్టులో కేసు కూడా నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్లాట్‌ను కొన్నవారు తప్పుడు పత్రాలతో భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగా.. పరిశీలించకుండానే అనుమతులు జారీ చేశారని తెలుసుకున్నారు. గ్రౌండ్ ప్లస్ మూడంతస్తులకు అనుమతులు కూడా జారీ కావడంతో నిర్మాణం కూడా చేపట్టారు. దీంతో విషయాన్ని వివరిస్తూ ప్రభాకర్‌రెడ్డి సదరు నిర్మాణ అనుమతులు రద్దు చేసి, తనకు న్యాయం చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను కోరగా పట్టించుకున్న పాపాన పోలేదు. తప్పుడు పత్రాలను సృష్టించిన వారికే కొమ్ముకాస్తున్న టౌన్‌ప్లానింగ్ టీపీఎస్, ఏసీపీ, డీసీలపై తగిన చర్యలు తీసుకోవాలని, నిర్మాణ పనులను నిలిపివేయాలని ఉన్నతాధికారులకు వినతి చేసుకున్నారు. అయినా ప్రయోజనం కనిపించలేదు. చివరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు, ఇతరత్రా ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించిన కమిషనర్ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత సర్కిల్ అధికారులను ఆదేశించారు. ఎన్ని రోజులైనా చర్యలు తీసుకోకపోవడంతో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న తనకు తెలిసిన వారిని సంప్రదించడంతో పరిస్థితిని గమనించి నిర్మాణం చేపట్టిన వారికి తాజాగా షోకాజ్ నోటీసు జారీ చేశారు. చర్యలు తీసుకుంటున్నామని చెప్పేందుకు కాబోలు ఈ నెల 20వ తేదీనే షోకాజ్ నోటీసు సిద్ధం చేసినప్పటికీ బుధవారం జారీ చేశారు.

ఎల్‌బీనగర్ జోన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న దందాలకు ఇది తాజా మచ్చుతునక. గ్రేటర్‌లోని అన్ని జోన్లలోనూ దాదాపుగా ఇవే పరిస్థితులున్నా, ఆ జోన్‌లో ఇంకాస్త ఎక్కువ. భవన నిర్మాణ అనుమతుల నుంచి మొదలుపెడితే, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనల నుంచి ఓసీలు జారీ అయ్యేంతదాకా అక్రమార్కులకు అధికారులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు ఎంతో కాలంగా ఉన్నా తగిన చర్యలు మాత్రం లేకుండాపోయాయి. ఇటీవల టౌన్‌ప్లానింగ్ విభాగంపై సమీక్ష జరిపిన జీహెచ్ఎంసీ కమిషనర్ అనుమతుల జారీలో జాప్యాన్ని ప్రశ్నించారే గానీ అక్రమాలపై అందుతున్న ఫిర్యాదులను పరిశీలించినట్లు లేదు. ఉల్లంఘనలకు సంబంధించి అందుతున్న ఫిర్యాదులెన్ని? ఎన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటున్నారన్నది ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో జోనల్‌స్థాయిలో ఆడింది ఆటగా సాగుతోంది. పైపెచ్చు అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఫిర్యాదు చేసిన వారి వివరాలు ఉల్లంఘనులకు అందజేస్తున్నారన్న ఆరోపణలు ఎంతోకాలంగా ఉన్నాయి. అయినా వేటిపైనా తగిన చర్యలు లేకపోవడంతో ఆ జోన్ అంతే అన్న పేరుపొందింది.

ఫిర్యాదు చేసినా స్పందన లేదు..

హయత్‌నగర్, ఎల్‌బీనగర్ సర్కిళ్లలో అవినీతి, అక్రమాలు భారీగా జరుగుతున్నాయి. తమ ఇంటిపక్కనే ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇల్లు కడుతున్నారని, సెట్‌బ్యాక్‌లు కూడా వదలలేదని స్థానికులు కొందరు సంబంధిత అధికారులకు నెలరోజుల క్రితం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా, మైజీహెచ్ఎంసీ యాప్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. పలుమార్లు ఫిర్యాదు చేయగా, మొక్కుబడి తంతుగా ఒక నోటీసు మాత్రం ఇచ్చి వెళ్లారని, అయినప్పటికీ అక్రమ నిర్మాణం ఆగకుండా రేయింబవళ్లు కొనసాగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా ముందు జాగ్రత్త చర్యగా నోటీసులు, షోకాజ్ నోటీసులు సిద్ధంగా ఉంచుకోవడం, లేదా తప్పనిసరి పరిస్థితుల్లో జారీ చేయడం అక్కడ ఓ తంతుగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లలోనూ అక్రమ నిర్మాణాలు ఎక్కువగానే సాగుతున్నాయి. ఏ జోనూ ఇందుకు మినహాయింపు కాదనేది బహిరంగ రహస్యం.

ఎన్నికల నేపథ్యంలో పెరిగిన అక్రమాలు

లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటి నుంచీ అక్రమ నిర్మాణాలు ఊపందుకున్నాయి. అధికారులంతా ఎన్నికల విధుల్లో ఉండటంతో పైవారు పట్టించుకోరనే తలంపుతో నిర్మాణాలు పెరిగాయి. ఎన్నికల పనుల్లో ఉన్నతాధికారులు తలమునకలవడాన్ని తెలిసిన టౌన్ ప్లానింగ్ సిబ్బందే అక్రమార్కులతో కుమ్మక్కై ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా.. అనుమతుల్లేకుండా జరిపే నిర్మాణాలను త్వరితంగా పూర్తి చేసుకోవాల్సిందిగా కూడా సలహాలిస్తున్నారని తెలుస్తోంది. ఎన్నికల కోడ్ ముగిసేంతదాకా కూల్చివేతలు చేయరని చెబుతూ తమవంతు సాయం చేస్తూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

టీఎస్ బీపాస్ వచ్చినా..

ఓవైపు అక్రమ నిర్మాణాలను అడ్డుకోలేకపోతున్న అధికారులు, మరోవైపు చేతులు తడపని వారి దరఖాస్తులకు అనుమతులివ్వడం లేదనే ఆరోపణలున్నాయి. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతుల జారీ సులభతరమైందనేది మాటలకే పరిమితమైంది. టౌన్ ప్లానింగ్ అధికారులనో, వారు సూచించే మధ్యవర్తులనో కలవనిదే పనులు పూర్తి కావడం లేదని జీహెచ్ఎంసీ కార్యాలయాలకు వస్తున్నవారు చెబుతున్నారు. దరఖాస్తుల ప్రాసెస్‌లో ‘షార్ట్ ఫాల్స్’ అంటూనో మరో పేరుతోనో కొర్రీలు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిపిన సమీక్ష సమావేశంలో కమిషనర్ సైతం ఈ అంశాన్ని గుర్తించి షార్ట్‌ఫాల్స్ పేరిట ప్రజలను వేధించొద్దని మందలించడం తెలిసిందే.



ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేసిన స్థలంలో జరుగుతున్న నిర్మాణం

అక్షరాలా నిర్లక్ష్యం!

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో అలసత్వం

- సగానికిపైగా పనులు ప్రారంభానికే నోచుకోని వైనం
- ఇదీ నగరంలో సర్కారు బడుల పరిస్థితి
- షోకాజ్ నోటీసులిచ్చినా మారరా?



సాక్షి, సిటీబ్యూరో: సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన అమ్మ ఆదర్శ పనులపై నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు పూర్తి చేయాల్సిన పనులు నత్తలకు నడక నేర్పిస్తున్నాయి. మొత్తం పనుల్లో 7 శాతం మాత్రమే పూర్తి కాగా.. మరో 43 శాతం పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 50 శాతం పనులు ప్రారంభానికి నోచుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన తాగునీటి సౌకర్యం, విద్యుత్, టాయిలెట్స్, బాలికల అదనపు టాయిలెట్లు, మరమ్మతులు, పెయింటింగ్, బెంచీలు, గ్రీన్‌చాక్ బోర్డు తదితర పనులపై పర్యవేక్షణ కొరవడింది. విద్యాశాఖ అధికారులకు బాధ్యతలు అప్పగించినప్పటికీ అడుగడుగునా నిర్లక్ష్యమే కనిపిస్తోంది. పనులపై సమీక్షలు, ఆదేశాలు, సమావేశాలకే పరిమితం కావడం విస్మయానికి గురి చేస్తోంది.

384 పాఠశాలల్లో పనులు..

హైదరాబాద్ జిల్లాలో మొత్తం 691 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2023-2024 సంవత్సరానికి గాను అమ్మ ఆదర్శ పనుల కింద 562 బడులను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.30.63 మంజూరు చేసింది. గత నెలలో 384 పాఠశాలల్లో పనులకు శ్రీకారం చుట్టారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుదల చేశారు. తాగునీటి సౌకర్యం కోసం రూ. లక్ష, మరమతు పనులకు రూ.2 లక్షలు, విద్యుత్ సౌకర్యం కోసం రూ. 25 వేలు, టాయిలెట్స్ కోసం రూ.35 వేలు బాలికల కోసం అదనపు టాయిలెట్లకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు చొప్పున కేటాయించారు. అమ్మ ఆదర్శ కమిటీలు వేసి బ్యాంక్ ఖాతాలో నిధులు కూడా జమ చేశారు. కాగా.. మొత్తం 384 పాఠశాలలకు 1,287 పనులు మంజూరు కాగా ఇప్పటి వరకు 91 పనులు పూర్తయ్యాయి. 555 పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 641 పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

జూన్ 10లోగా పనులు పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన జూన్ 10 లోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యేకాధికారులు ప్రతి రోజు 3, 4 పాఠశాలలను సందర్శించి నివేదికలను సమర్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, కదిరవన్ పాలాని, డీఈఓ ఆర్.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు ఇలా

మండలం	పాఠశాలలు	పనుల మంజూరు	పనుల పూర్తి	పురోగతి	ప్రారంభం కాని పనులు
అమీర్‌పేట	6	24	0	24	0
చార్మినార్	15	40	5	20	15
హిమాయత్‌నగర్	39	152	15	78	59
ముషీరాబాద్	22	83	9	41	33
సైదాబాద్	22	79	17	24	38
నాంపల్లి	33	93	3	41	49
ఖైరతాబాద్	47	183	7	75	101
గోల్కొండ	63	205	19	77	109
బండ్లగూడ	36	103	4	32	67
బహదూర్‌పురా	33	98	10	29	59
సికింద్రాబాద్	36	118	1	74	43
మారేడుపల్లి	32	109	1	40	58

షోకాజ్ నోటీసులు జారీ చేసినా..

పాఠశాలల పునః ప్రారంభం నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినా.. ఆచరణలో అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పదిరోజుల క్రితం అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి పర్యవేక్షణలో విధుల పట్ల నిర్లక్ష్యంపై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణితో పాటు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, బహదూర్‌పురా డిప్యూటీ డీఈవోకు షోకాజ్ నోటీసులు జారీ చేసినా ఫలితం లేకుండా పోయింది.

31న మెగా జాబ్ మేళా

అంబర్‌పేట: నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ నెల 31న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్‌ల్యాండ్స్) సంయుక్తాధ్వర్యంలో జాబ్ మేళాను చేపట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు హరిసందీప్, మువ్వ రాంరెడ్డి, లక్ష్మీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, బీటెక్, ఎంబీఏ అర్హతగల నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18- 30 సంవత్సరాల వయసువారు అర్హులన్నారు. ప్రత్యేకించి ఈ జాబ్‌మేళాలో ప్రైవేటు ఉపాధ్యాయుల ఎంపిక ఉంటుందని, అర్హతను బట్టి వేతనం రూ.17 వేల నుంచి రూ.60 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు రాణీగంజ్ గుజరాతీ హైస్కూల్‌లో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్‌సైట్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో సంప్రదించాలన్నారు. 95424 33427కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

రేపు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

బంజారాహిల్స్: వరల్డ్ నో టొబాకో డేను పురస్కరించుకుని ఈ నెల 31న ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు బంజారాహిల్స్ బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ యాజమాన్యం ప్రకటించింది. శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పొగాకు వినియోగించే వారి కోసం ప్రత్యేకంగా ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. నిపుణులైన వైద్యులు ఉచితంగా ప్రాథమిక పరీక్షలు నిర్వహించి కేన్సర్ లక్షణాలను నిర్ధారిస్తారని ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు తెలిపారు. అనుమానం ఉన్న వారికి 20 శాతం రాయితీతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. ఈ సదుపాయాన్ని పొగాకు వినియోగించే వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040-2355 1235, ఎక్స్‌టెన్షన్ 2335, 2354, 2216లలో సంప్రదించవచ్చు.

సమ్మర్ వెకేషన్.. న్యూ డెస్టినేషన్!

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సెలవులు వచ్చాయంటే చాలు ఒకప్పటిలా అమ్మమ్మ వాళ్లింటికో, బంధువుల ఇంటికో కాకుండా దేశంలోని పర్యాటక ప్రదేశాలతో పాటు విదేశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఎయిర్ బీఎన్‌బీ హాస్పిటాలిటీ సంస్థ వెల్లడించింది. ఇందులో భాగంగా గోవా, కేరళలోని బీచ్‌లతో పాటు వారణాసి, ఢిల్లీ వంటి చారిత్రాత్మక, సాంస్కృతికంగా ప్రాముఖ్యమున్న ప్రాంతాలను చుట్టేస్తున్నారని పేర్కొన్నారు. ఆహ్లాదం, ఆధ్యాత్మికం, అడ్వెంచర్లతో పాటు సైట్ విజిట్‌కు అధిక ప్రాధాన్యమిస్తున్నారు భారతీయులు. ఎయిర్ బీఎన్‌బీ సర్వేలో భాగంగా మిలాన్, టోక్యో, రోమ్, ఫ్రాంక్‌ఫర్ట్ వంటి అంతర్జాతీయం ప్రాంతాలను ఫేవరెట్ డెస్టినేషన్స్‌గా మార్చుకున్నారని వివరించారు. బాలీవుడ్ సినిమాలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావంతో ఈ ప్రాంతాలు ఎంచుకుంటున్నారు. సరికొత్త అనుభూతి, నూతన ప్రదేశాలను కనుగొనేందుకు ట్రెక్కింగ్ వంటి సాహసోపేతమైన ప్రయాణాలూ చేస్తున్నారని ఆగ్నేయాసియా దేశాల ఎయిర్ బీఎన్‌బీ జనరల్ మేనేజర్ అమన్‌ప్రీత్ సింగ్ బజాజ్ పేర్కొన్నారు.

ఏసీబీ కస్టడీకి ఏసీపీ ఉమామహేశ్వరరావు

చంచల్‌గూడ: ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్న కేసులో అరెస్టయిన ఏసీపీ ఉమామహేశ్వరావును చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. అతన్ని విచారించేందుకు ఏసీబీ కస్టడీ కోరింది. దీంతో ఏసీబీ కోర్టు 3 రోజుల పూర్తి స్థాయి కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో అతడిని బుధవారం ఏసీబీ అధికారులు చంచల్‌గూడ జైలు నుంచి తమ కస్టడీలోకి తీసుకున్నారు.

పెద్దలకూ టీకా అవసరమే



సాక్షి, సిటీబ్యూరో: వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు చిన్నారులతో పాటు పెద్ద వాళ్లు కూడా టీకాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచించారు. మాదాపూర్‌లో ఉన్న యశోద హాస్పిటల్స్ వయోజనుల వ్యాక్సిన్ల తయారీకి పేరొందిన ఫైజర్ ఇండియాతో కలిసి ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ని బుధవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హాస్పిటల్స్ డైరెక్టర్లు డాక్టర్ పవన్ గోరుకంటి, డాక్టర్ లింగయ్య మాట్లాడుతూ.. టీకాలు వేయించుకోవటం బాల్యంలో మాత్రమే కాదు, జీవితాంతం తప్పనిసరి అని స్పష్టం చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి టీకా ప్రయోజనకరమన్నారు. ఫైజర్ వ్యాక్సిన్స్ మెడికల్ అఫైర్స్ డైరెక్టర్ డాక్టర్ సంతోష్ టౌర్ మాట్లాడుతూ.. ఇన్ఫెక్షన్స్ నుంచి సమాజాన్ని కాపాడడానికి, పెద్దలలో వ్యాక్సినేషన్ ప్రక్రియను మరింత విస్తరించేందుకు తమ భాగస్వామ్యం ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బిల్డర్ల సమస్యల్ని పరిష్కరిస్తాం

మంత్రి దామోదర రాజ నర్సింహ

బంజారాహిల్స్: నగరంలో బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తామని రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ఎనిమిదో వార్షిక వేడుకలు జూబ్లీహిల్స్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ హాల్ లో బుధవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ఇది ప్రజల ప్రభుత్వమని.. ఒంటెత్తు నిర్ణయాలు తీసుకోకుండా.. ప్రజాపాలనను అందిస్తామన్నారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి నగరంలోని బిల్డర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బిల్డర్లు ఎదుర్కొంటున్న నాలాకు సంబంధించిన సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. నగరానికి వెస్ట్ జోన్ అనేది ఎంతో ముఖ్యమైనదని ఇక్కడ జరిగే అభివృద్ధితో వచ్చే ఆదాయంతో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా నిర్వహిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా బిల్డర్స్ సావనీర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, సినీ నటుడు మురళీమోహన్, వెస్ట్ జోన్ నారెడ్కో ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎం.ప్రేమ కుమార్, ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్ రావు, కోశాధికారి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దామోదర రాజ నర్సింహ తదితరులు

మృతుల కుటుంబాలకు రూ.8 లక్షల పరిహారం



రషీద్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

హఫీజ్‌పేట్ : రెండు రోజుల క్రితం కురిసిన గాలి బీభత్సానికి హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్, యూత్‌కాలనీకి చెందిన రషీద్, బాలుడు సమద్‌లు మృతి చెందారు. దీంతో రాష్ట్రం ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. బుధవారం శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ వెంకారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శంకర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారి ఆర్ల శ్రీను హఫీజ్‌పేట్‌లోని రషీద్ భార్య ఆసియా బేగం, సమద్ తండ్రి నసీముద్దీన్ ఇంటికి వెళ్ళి చెక్కులను అందజేశారు.

నేను ముంబైలో ఉన్నా..పెళ్లి చేసుకున్నా

తల్లికి ఇన్‌స్టాలో మెసేజ్ చేసి కూతురు అదృశ్యం

బంజారాహిల్స్: తాను స్నేహితురాలితో వెళ్తున్నానని, తన కోసం వెతకవద్దని ఇన్‌స్టాగ్రామ్‌లో తల్లికి పోస్ట్ పెట్టిన ఓ బాలిక సాయంత్రం తాను ముంబైలో ఉన్నానని, సైఫ్ అనే యువకుడిని పెళ్లి చేసుకున్నట్లు మరో పోస్ట్ చేసింది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–11లోని ఉదయ్‌నగర్‌లో నివసించే బాలిక (14) ఎనిమిదో తరగతి పూర్తి చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చురుగ్గా ఉంటుంది. సోషల్ మీడియాను బాగా ఫాలో అవుతుంది. ఇందులో భాగంగానే ఇన్‌స్టాలో జహ్రానగర్‌లో సైఫ్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ఈ నెల 17వ తేదీన తన తల్లికి ఆ బాలిక తన స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ఈ నెల 22న ఆ బాలిక ఇన్‌స్టాలోనే తాను సైఫ్‌ను పెళ్లి చేసుకున్నానని, ముంబయ్‌లో ఉన్నానని, ఇద్దరూ కలిసి దిగిన ఫొటోను షేర్ చేసింది. కొంతకాలంగా తన కూతురు జహ్రానగర్‌కు వెళ్తుండేదని, సైఫ్ అనే యువకుడు ఇన్‌స్టాలో పరిచయం అయ్యాడని, ఆయనతో వెళ్లిన విషయాన్ని ఇన్‌స్టాలో పోస్ట్ చేసి చెప్పిందని బాధిత తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిగ్నల్ జంప్ చేసి బైక్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు

రాయదుర్గం: మద్యం మత్తులో కారును వేగంగా నడుపుతూ సిగ్నల్ జంప్ చేసి ఓ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాయదుర్గం ఎస్‌ఐ విజయ్ తెలిపిన మేరకు.. ఖాజాగూడ నుంచి మణికొండకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుధీర్‌రెడ్డి తన ఇద్దరు స్నేహితులు రవితేజ, రోహిత్‌రెడ్డితో కలిసి కారులో వెళుతున్నాడు. రాయదుర్గంలోని మెహఫిల్ సర్కిల్‌లో సిగ్నల్ వద్ద ర్యాష్‌గా నడుపుతూ సిగ్నల్‌జంప్ చేసి వెళ్ళి బైక్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న కొడారి సత్యనారాయణ, కొడారి కాంతారావులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పోలీసులు వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారు నడుపుతున్న సుధీర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మిగతా ఇద్దరూ పరారయ్యారు.



తీవ్రంగా గాయపడ్డ సత్యనారాయణ, కాంతారావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రవి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రవి, మరో వ్యక్తి నరేష్ బుధవారం ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మల్కారం వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ వీరి వాహనాన్ని ఢీకొంది. రవి కింద పడిపోవడంతో అతని చెయ్యిపై టిప్పర్ వెళ్లడంతో చేయి నుజ్జునుజ్జు అయింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో యశోద ఆస్పత్రికి తరలించారు. నరేష్‌కు తల, నోటికి గాయాలయ్యాయి. మున్సిపల్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

> అక్రమార్కుల భూ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే గండిపేట మండలం పొకల్‌వాడ గ్రామ సర్వే నెంబర్ 4లోని రూ.500 కోట్ల విలువైన ఐదెకరాలకు జారీ చేసిన పాస్‌బుక్‌లను రద్దు చేసి భూములను స్వాధీనం చేసుకున్న యంత్రాంగం.. ఇదే మండలం గంధంగూడ సర్వే నంబర్ నెం.51లోని రూ.250 కోట్ల విలువ చేసే 9.36 ఎకరాలకు జారీ చేసిన పాస్ పుస్తకాలను కూడా రద్దు చేసి భూములను వెనక్కు తీసుకుంది. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

భూ ఆక్రమణలకు చెక్

రూ.250 కోట్ల విలువైన 9.36 ఎకరాల సర్కారు స్థలం స్వాధీనం

- గంధంగూడలో చెర వీడిన ప్రభుత్వ భూమి
- గండిపేట తహసీల్దార్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు
- పొక్కల్ వాడలో రూ.500 కోట్ల విలువైన భూములు స్వాధీనం

సాక్షి, రంగారెడ్డి జిల్లా/బండ్లగూడ: సందట్లో సడేమియా అనే చందంగా కొంతమంది అక్రమార్కుల అదును చూసుకుని ప్రభుత్వ భూములను కాజేశారు. అంతా అసెంబ్లీ ఎన్నికల హడావుడిలో ఉండగా.. వీరు మాత్రం భూములను చెరబట్టే పనిలో నిమగ్నమయ్యారు. గత ప్రభుత్వంలోని కొంత మంది పెద్దల ఆశీస్సులు, అధికారుల అండదండలు ఉండటంతో విలువైన ప్రభుత్వ భూములను.. ప్రైవేటు పట్టా భూములుగా మార్చేశారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 'ధరణి'లోని లొసుగులను అడ్డం పెట్టుకుని విలువైన భూములను కొల్లగొట్టారు. ఎన్నికల తర్వాత గుట్టుగా సాగిన ఈ వ్యవహారంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో అక్రమార్కుల భూ బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

- గంధంగూడ సర్వే నం.51లో 9.36 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.
- ఇక్కడ ఎకరం రూ.25 కోట్ల వరకు పలుకుతోంది. ఖాళీగా ఉన్న ఈ విలువైన భూములపై ఓ మాజీ ప్రజాప్రతినిధి కన్నుపడింది. ఎలాగైనా వీటిని కాజేయాలని పక్కా ప్రణాళికతో పావులు కదిపాడు.
- ఈ భూమిని చెరబట్టేందుకు 'మంత్రాంగం' నెరిపారు. అధికారుల సహకారం కూడా తోడుకావడంతో 2018 వరకు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమి 2023 మే 27న ప్రైవేటు వ్యక్తుల పరమైంది.
- అప్పటి కలెక్టర్ ఆగమేఘాల మీద పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేశారు.
- అనంతరం ప్రభుత్వం మారడం.. భూమి పరాధీనమైన విషయం బహిర్గతం కావడంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ఆరా తీయడంతో పాటు సమగ్ర నివేదిక కోరారు.
- ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంలో ఉన్నత స్థాయి అధికారుల వరకూ సహకరించినట్లు తేల్చారు.
- ఈ నేపథ్యంలో అప్పట్లో జారీ చేసిన పాస్ పుస్తకాలను రద్దు చేయడమేగాకుండా.. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో వెలిసిన ఆక్రమణలు తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు.
- భూమిని కాజేసేందుకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు తేలడంతో ఆక్రమణదారులపై నార్సింగి ఠాణాలో బుధవారం క్రిమినల్ కేసు నమోదు చేశారు.



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేస్తున్న దృశ్యం - గంధంగూడలో ఏర్పాటు చేసిన బోర్డు

పొక్కల్‌వాడలో ఐదెకరాలు

- గండిపేట మండలం పొక్కల్‌వాడ గ్రామం సర్వే నెంబర్ 4లో(1954- 55 ఖాస్రా పహాణీ ప్రకారం) 62.06 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.
- 1986 లోనే ప్రభుత్వం ఇందులోని 51.06 ఎకరాలు హుడాకు, మరో 6ఎకరాలు హౌసింగ్ బోర్డుకు కేటాయించింది.
- ఎకరా స్థలంలో బలహీన వర్గాలకు ఇళ్ల కట్టించగా మిగిలిన ఐదెకరాలు ఖాళీగా ఉంది.
- ఈ భూమి ఆక్రమణకు గురికాకుండా 2012లోనే ప్రహరీ కోసం ప్రతిపాదనలు పంపించి, రూ.36 లక్షలు ఖర్చు చేసి 2015లో కాంపౌండ్ వాల్ నిర్మించారు.
- ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలు, రియల్టర్లు కలిసి ఈ భూమిని చేజిక్కించుకునేందుకు పావులు కదిపారు. అంతా ఎన్నికల హడావుడిలో ఉండగా, ఇద్దరు వ్యక్తులు తమ పేరున (చెరో 2.20 ఎకరాల చొప్పున 5ఎకరాలకు) పాస్ బుక్‌లు పొందారు.
- ఈ భూముల విలువ రూ.500 కోట్ల పైమాటే. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయి, కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఈ అంశంపై స్థానికులు ఫిర్యాదు చేయగా కలెక్టర్ విచారణ చేపట్టారు.
- తెలంగాణ రైట్స్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్ యాక్ట్ 2020లోని సెక్షన్ 8 కింద పాస్‌బుక్‌లు రద్దు చేశారు.
- ఆయా భూములను 22ఏ జాబితాలో చేర్చి, స్వాధీనం చేసుకోవాలని జనవరి 21న ఆదేశాలు జారీ చేయడంతో గండిపేట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలోని రెవెన్యూ అధికారుల బృందం ఇటీవల ఆభూములను స్వాధీనం చేసుకున్నారు.
- అడ్డదారుల్లో పాస్‌బుక్‌లు పొంది, భూ ఆక్రమణకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై రాయదుర్గం పీఎస్‌లో కేసు నమోదు చేయించారు.

ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'పార్టిసిపేషన్ టు యాక్షన్' అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడంతోపాటు సమాజంలో ఆరోగ్యాన్ని పెంపొందించడం విద్యాసంస్థల కర్తవ్యమన్నారు. సోషల్ మీడియాను ప్రోత్సహించడంవల్ల సాధారణ ఇమ్యునైజేషన్ పద్ధతులకు సవాళ్ళు తలెత్తు తున్నాయని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు. ఎంసీజే విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ యూనిసెఫ్, ఉర్దూ యూనివర్శిటీ ఒక ప్రాజెక్ట్‌ను ప్రారంభించిందన్నారు.

మండిపోతున్న ఎండలు

సాక్షి, సిటీబ్యూరో: మే ఎండలు మండిపోతున్నాయి. సూర్యుడు మళ్లీ నిప్పులు కురిపిస్తున్నాడు. గత వారం రోజులుగా పగలు భానుడు భగ..భగ సాయంత్రం చల్లదనం, వర్షంతో ఉపశమనం పొందిన నగరవాసులు గత రెండు మూడు రోజులుగా ఉష్ణతాపానికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బుధవారం అత్యధికంగా టోలిచౌకిలో గరిష్ట ఉష్ణోగ్రత 43గా నమోదైంది. ముషీరాబాద్, ముసాపేటలో 42.9 డిగ్రీలు నమోదైంది. మిగతా ప్రాంతాలో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది.

చిన్నారికి అరుదైన చికిత్స

లక్డీకాపూల్ : 18 నెలల చిన్నారికి మెడికవర్ ఆస్పత్రి వైద్యులు అరుదైన వైద్యం చేశారు. ఓ బాలుడిని వెన్నెముక నుండి తలకు మధ్యలో కణితి ఇబ్బంది పెడుతోంది. దీంతో తల తిప్పకపోవడం, తీవ్రమైన కాలు నొప్పి, నడవలేని స్థితి ఏర్పడింది. శ్వాస సమస్య కూడా వచ్చింది. దీంతో మెడికవర్ ఆస్పత్రిని సంప్రదించగా సీనియర్ కన్సల్టెంట్ న్యూరోస్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి న్యూరోమానిటరింగ్ పద్ధతిలో కణితిని పూర్తిగా తొలగించారు. ఇప్పుడు శిశువు నడవగుతోందని డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

హోం గార్డుపై పోక్సో కేసు నమోదు

కాచిగూడ: మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ హోం గార్డుపై పోక్సో కేసు నమోదు చేసిన కాచిగూడ రైల్వే పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన మేరకు.. కుటుంబ సభ్యులతో కలిసి ఓ మైనర్ బాలిక(15) వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్‌లో తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వస్తోంది. ఆ సమయంలో ఓ హోం గార్డు ప్రతాప్ కోచ్‌లో నిద్రపోతున్న ఆ బాలిక వద్దకు వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించాడు.

అది గమనించిన బాలిక కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు సమాచారమందించారు. బుధవారం ఉదయం కాచిగూడ రైల్వే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కడప రైల్వే కోడూరు పీఎస్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడని, యూనిఫాంలో ఉన్న అతను టికెట్ లేకుండానే రైల్లో ప్రయాణిస్తున్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తాళం కనిపిస్తే ఇల్లు గుల్లే!

- కాలనీలనే టార్గెట్ చేసిన ఘరానా దొంగ శంకర్
- నాలుగుసార్లు పీడీ యాక్ట్ విధించినా అదే పంథా
- జైల్లో కలిసిన బైక్ దొంగ రాకేష్‌తో కలిసి చోరీలు



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని మూడు కమిషనరేట్లతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో 12 ఏళ్లుగా నేరాలు చేస్తున్న ఘరానా దొంగ రత్లావత్ శంకర్ నాయక్ మరోసారి చిక్కాడు. ఇతడితో పాటు సహచరుడు బండ్రవల్లి రాకేష్‌ను మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.6.7 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ సాధన రష్మి పెరుమాల్ బుధవారం వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన శంకర్‌కు రాజేష్ రెడ్డి, ఇల్యాస్ ఖాన్ అనే మారుపేర్లూ ఉన్నాయి. 2012లో ఓ హత్యాయత్నం కేసులో గద్వాల పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. ఆపై వ్యసనాలకు బానిసగా మారిన ఇతగాడు చోరీలు చేయడం ప్రారంభించారు. ద్విచక్ర వాహనంపై కాలనీల్లో తిరుగుతూ తాళం వేసున్న ఇళ్లను గుర్తిస్తాడు. వాటిలో అనువైనవి ఎంచుకునే శంకర్ టార్గెట్ చేస్తాడు. రాత్రి వేళ ప్రత్యేకమైన ఉపకరణాలతో వెళ్లే అతడు ఆ తాళాలు పగులకొట్టి లోపలకు ప్రవేశిస్తాడు. అక్కడ లభించిన నగదు, బంగారం, వెండి తస్కరించి బయటకు వస్తాడు. ఇలా పుష్కరకాలంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, మహబూబ్‌నగర్, విజయవాడ, గుంటూరు, ఒంగోలుల్లో 80కి పైగా నేరాలు చేసి జైలుకు వెళ్లాడు. హైదరాబాద్ పోలీసులు ఇతడిపై నాలుగుసార్లు పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపారు. అక్కడ ఇతడికి వనస్థలిపురానికి చెందిన రాకేష్‌తో పరిచయమైంది. ద్విచక్ర వాహనాలు చోరీ చేసే ఇతడిపై ఇప్పటి వరకు 26 కేసులు ఉన్నాయి. జైల్లో జట్టుకట్టిన ఈ ద్వయం బయటకు వచ్చాక నేరాలు ప్రారంభించింది. శంకర్ చోరీలు చేయగా... రాకేష్ ఆ సొత్తు విక్రయించడంలో సహకరించాడు. ఇలా వీళ్లిద్దరూ కలిసి ఈ ఏడాది ఎనిమిది నేరాలు చేశారు. ఈ ద్వయం కదలికలపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రామకృష్ణ, ఎస్సై డి.శ్రీకాంత్ గౌడ్‌లతో కూడిన బృందం వలపన్ని ఇరువురినీ పట్టుకుంది. వీరి నుంచి రూ.6.7 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించింది.

జగద్గిరిగుట్టలో విషాదం

- బాపట్ల కాలువలో నలుగురి గల్లంతు..
- ఇద్దరి మృతదేహాలు లభ్యం



ప్రమాదం జరిగిన స్థలం

జగద్గిరిగుట్ట: బాపట్లలోని కేవీ పాలెం రోడ్డులోని నల్లమాడ డ్రెయిన్ కాలువలో బుధవారం కొట్టుకుపోయిన ఘటనలో ఇద్దరు మృతి చెందడంతో జగద్గిరిగుట్టలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ నలుగురిలో ముగ్గురు జగద్గిరిగుట్టకు చెందినవారు. ఈ విషయం తెలిసిన బంధువులు, ఇరుగుపొరుగు వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఈనెల 26న 12 మంది ఓమ్నీ కారులో పొన్నూరు మండలంలోని వడ్డీముక్కల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బాపట్ల రూరల్ మండలంలోని కేవీ పాలెం రోడ్డలోని నల్లమాడ డ్రెయిన్ కాలువ దగ్గరకు రాగానే వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఆపారు. కాలువలో సరదాగా గడుపుతుండగా ఒక్కసారిగా ప్రవాహం ఎక్కువైంది. వీళ్ల తేరుకొనేలోపే నీటిలో సునీల్ కుమార్ (35), అనూప్ రాజ్ (13) , కిరణ్ కుమార్ (30), నందు (35) కాలువలో కొట్టుకుపోయారు. వీరిలో సునీల్, అనూప్‌ల మృతదేహం లభ్యం కాగా కిరణ్ , నందుల ఆచూకీ ఇంకా తెలియరాలేదు. సునీల్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తుండగా, కిరణ్ ఈసీఐఎల్‌లో, నందు జగద్గిరిగుట్టలో డ్రైవర్లుగా పనిచేసున్నారు. అనూప్‌రాజ్ జగద్గిరిగుట్ట బీరప్ప నగర్‌లోని స్వాతి విద్యానికేతన్‌లో 7వ తరగతి చదువుతున్నారు.

ప్రియుడి వేధింపులు తట్టుకోలేక యువతి ఆత్మహత్య



అఖిల (ఫైల్), నిందితుడు సాయిగౌడ్

జీడిమెట్ల: అమ్మా.. నాన్న.. మీరు చెప్పిన మాటలు నేను వినలేదు.. ప్రేమిస్తున్నాను అని వెంటపడిన అబ్బాయి ప్రేమను అంగీకరించాను.. అతను పెట్టే మానసిక ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నాను. ఐ లవ్ యూ అమ్మా నాన్న అంటూ ఓ యువతి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల, మృతురాలి తల్లిదండ్రులు తెలిపిన మేరకు.. షాపూర్‌నగర్ ఎన్ఎల్‌బీ నగర్‌కు చెందిన బాలబోయిన కుమార్ కుమార్తె అఖిల(22)ను అదే ప్రాంతానికే చెందిన ఓరుగంటి వెంకటేశ్ కుమారుడు అఖిల్ సాయిగౌడ్ గత 8సంవత్సరాల నుండి ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడుతున్నాడు. తనను ప్రేమించకపోతే చనిపోతానంటూ వేధించేవాడు. దీంతో అఖిల కూడా సాయిగౌడ్ ప్రేమను అంగీకరించి విషయాన్ని ఇంట్లో తల్లిదండ్రులకు తెలిపింది. ఈ విషయం ఇరుకుటుంబాలు కూర్చుని మాట్లాడుకుని వీరి ప్రేమను అంగీకరించాయి.

వేధించి రోడ్లపైనే కొట్టేవాడు..

కాగా అఖిలను సాయిగౌడ్ మానసికంగా వేధించేవాడు. కోపంతో రోడ్లపైనే కొట్టేవాడు. అయినప్పటికీ అఖిల భరిస్తూ వచ్చింది విషయాన్ని పలుమార్లు తల్లిదండ్రులకు కూడా చెప్పింది. అతని వేధింపులు భరించలేక అఖిల తనలో తానే కుమిలిపోయేది ఇటీవల కొంతకాలం నుండి సాయిగౌడ్ పెళ్లి విషయంలో ముఖం చాటేశాడు. దీంతో మరింత కుంగిపోయిన అఖిల మంగళవారం రాత్రి 10 పేజీల సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఉరి వేసుకుని మృతిచెందింది. దీంతో జీడిమెట్ల పోలీసులు అఖిల్ సాయిగౌడ్‌పై కేసు నమోదు చేశారు.

కరాటే విజేతకు సత్కారం



శశాంక్‌ను సన్మానిస్తున్న జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడిని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి సన్మానించారు. జలమండలి డివిజన్ 8 లో టీజీ–2 గా పనిచేస్తున్న పురాన్ సింగ్ కుమారుడు శశాంక్ సింగ్ మలేషియాలో జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ –2024 పోటీల్లో విజేతగా నిలిచాడు. బుధవారం ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో సన్మానించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో 27 దేశాల నుంచి చిన్నారులు పోటీ పడగా.. భారత దేశం తరపున శశాంక్ గోల్డ్ మెడల్ సాధించాడు.

ఎంఎంటీఎస్ అంటే ఇంత నిర్లక్ష్యమా?

సీపీఎం నేత శ్రీనివాస్ ఆగ్రహం

ముషీరాబాద్: అత్యంత చవకగా ప్రజలకు అందుబాటులో ఉండే ఎంఎంటీఎస్ రైళ్లను కేంద్ర ప్రభుత్వంతోపాటు రైల్వే శాఖ నిర్లక్ష్యం చేయడంతో ఎంఎంటీఎస్ సర్వీసులు నిర్వీర్యమైపోయిందని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ విమర్శించారు. ఎంఎంటీఎస్ ఫేజ్ – 2 కింద రూ. 800 కోట్లు ఖర్చు చేసినప్పటికి ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయిందన్నారు. రైళ్ల సమయ పాలన ఏమాత్రం ప్రజలకు ఉపయోగకరంగా లేవన్నారు. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైలు సమయపాలన వివరాలు సమాచార హక్కు చట్టం కింద సేకరించగా నెలలో ఒక రోజు కూడా సమయ పాలన పాటించలేదని ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికులు ఎవరైనా ఎంఎంటీఎస్‌లో ప్రయాణిస్తారా అని అని ప్రశ్నించారు. ఈ రైలులో రోజూ 10–20 మంది మాత్రమే ప్రయాణిస్తున్నారని ఫేజ్–2 కింద నడుపుతున్న ఇతర రైళ్ల పరిస్థితి ఇంతకంటే దారుణంగా ఉందన్నారు. ఇంతటి దారుణ స్థితికి రైల్వే శాఖ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మరమ్మత్తుల పేరుతో రైళ్లను రెగ్యూలర్‌గా రద్దు చేస్తుండడంతో ఇప్పటికే ప్రయాణికులు ప్రత్యామ్నాయ రవాణా చూసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయాన్ని సమీక్షించాలని కోరారు.

జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష రాసే బీసీలకు అన్యాయం: ఆర్.కృష్ణయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: జూనియర్ సివిల్ జడ్జి (జేసిజే) రాత పరీక్ష, వైవా–వాయిస్‌లో వెనుకబడిన తరగతుల బీసీ అభ్యర్థులకు కనీస కటాఫ్ మార్కుల రిలాక్సేషన్ లేకుండా నియామకాలు చేపట్టడం బీసీలకు అన్యాయం జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జేసీజే పరీక్ష రాసే బీసీ అభ్యర్థులకు కనీస కటాఫ్ మార్కుల సడలింపును అందించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ నియామకాలు, నోటిఫికేషన్‌లలో కనీస మార్కులలో సడలింపు ఇస్తారన్నారు. ఏపీ, కర్ణాటక వంటి రాష్ట్రాలు బీసీ అభ్యర్థులకు కనీస కటాఫ్ మార్కులు ఇస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని జేసీజే నోటిఫికేషన్‌లో ఆర్థికంగా వెనుకబడిన విభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ, సహా వివిధ వర్గాలకు చెందిన అభ్యర్థులకు కనీస కటాఫ్ మార్కుల రిలాక్సేషన్ ప్రమాణాలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, నందగోపాల్ తదితరులున్నారు.

మూడో అంతస్తు నుంచి పడి బాలుడి మృతి

సంతోష్‌నగర్: ఇంటి వరండాలో ఆడుకుంటున్న బాలుడు (8)ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బ్రహ్మచారి తెలిపిన మేరకు.. సంతోష్‌నగర్‌లో అర్బాత్ ఎస్టేట్ బిల్డింగ్‌లోని మూడో అంతస్తులో నివాసముంటున్న సయ్యద్ సోహెబ్ హుస్సేన్ కుమారుడు సయ్యద్ అహ్మద్ హుస్సేన్ బుధవారం మధ్యాహ్నం ఇంటి వరండాలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి కిందపడిపోయాడు. ఈ సంఘటనలో హుస్సేన్ ఇంటి ప్రధాన గేటు రాడ్‌పై పడటంతో తీవ్రరక్తస్రావం జరిగింది. కుటుంబ సభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

◆ గోల్డెన్ టెంపుల్, తన్వీర్ హాస్పిటల్స్ 11కేవీ ఫీడర్లు, కమాండ్ కంట్రోల్, శ్రీకృష్ణానగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీనివాస్ కన్‌స్ట్రక్షన్స్, అక్బర్ ఉడ్డింగ్, ఓవైసీ ఇల్లు, గ్రీన్ బవర్చి ఎదుటి ప్రాంతం, తేజ లాడ్జి, స్పైస్ హోటల్, పెద్దయ్య పిండి గిర్నీ, బర్రెల పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ ఎ.శ్రీనివాస్ తెలిపారు.

◆ రోడ్-12, నాగార్జుననగర్ 11కేవీ ఫీడర్లు, రోడ్-12, శ్రీనగర్‌కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు రోడ్-12, సితారా హోటల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లైన్, రేణుక చౌదరి ఇల్లు, పల్లవి అపార్ట్‌మెంట్స్, బ్రిడ్జ్ స్కూల్, నాగార్జుననగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

◆ శాలివాహననగర్, ఏసీబీ 11కేవీ ఫీడర్లు ఎల్లారెడ్డిగూడ, కమాండ్ కంట్రోల్ సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మసీదులైన్, తవక్కల్ నగర్, అంబేద్కర్ నగర్, నాగార్జుననగర్, బీఎస్ఎన్ఎల్, కీర్తి అపార్ట్‌మెంట్స్, గోల్డెన్ టెంపుల్ గేట్, ఎన్‌బీటీనగర్, పోచమ్మ దేవాలయం, రోషంబాగ్, ఆలియా మసీదులైన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

◆ మున్సిపల్ పార్క్, దుర్గానగర్ 11కేవీ ఫీడర్లు, ఈఎస్ఐ, ఎర్రమంజిల్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉదయ్‌నగర్, రవీంద్రనగర్, 60 అడుగుల రోడ్డు, శ్యామలకుంట పార్క్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గ్రీన్ లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.

◆ అల్లాడిన్‌కోటి, హైదరాబాద్ సెంట్రల్ 11కేవీ ఫీడర్లు.. లోధ, ఎర్రమంజిల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియా, ఆగ్రోమెక్, లిటిల్ స్కూల్, అల్లాడిన్‌కోటి, డి-మార్ట్ వెనుక, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, దుర్గానగర్ ప్రాంతాల్లో, ఫతేనగర్, ఆనంద్‌బాగ్ 11కేవీ ఫీడర్లు లోధ, మైత్రీవనం సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 డి-మార్ట్, శ్రీచైతన్య కాలేజి, సివిటాస్ అపార్ట్స్, ల్యాంకో, స్కోడా, బెంజ్ షోరూంల ఏరియా, గురుద్వార్, టింబర్ డిపో గల్లీ, సత్యం థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏడీఈ వివరించారు.

బడులు తెరిచేనాటికి యూనిఫాంలు

- మహిళా సంఘాలకే కుట్టే బాధ్యత
- సెట్విన్ కార్యాలయాల్లో సిద్ధమవుతున్న దుస్తులు
- ముమ్మరంగా జరుగుతున్న యూనిఫాంలు కుట్టే పని
- బడులు తెరిచేనాటికి విద్యార్థులకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో ముందుకువచ్చిన మహిళా సంఘాలు



విద్యార్థుల స్కూల్ యూనిఫాంలు కుడుతున్న మహిళా సంఘాల సభ్యులు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభించేలోగా పుస్తకాలు, యూనిఫాంల పంపిణీకి విద్యాశాఖ అధికారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ కిందికి వచ్చే షేక్‌పేట, ఖైరతాబాద్ మండలాల పరిధిలోని మహిళా సంఘాలకు వస్త్రం ఇచ్చి స్కూల్ యూనిఫాంలు కుట్టించే పనులు అప్పగించారు.

- జూన్ 5వ తేదీ నాటికి దుస్తులు కుట్టి ఆయా పాఠశాలలకు పంపించాలని, ఈ బాధ్యతలను జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులకు అప్పగించారు.
- జీహెచ్ఎంసీ సర్కిల్-18 యూసీడీ డీపీఓ ఆశావిరోనిక పర్యవేక్షణలో మహిళా సమాఖ్య సభ్యురాళ్లు గుర్తించిన సెట్విన్ కేంద్రాల్లో స్కూల్ యూనిఫాంలు కుడుతున్నారు. గడచిన ఐదు రోజులుగా దుస్తులు కుట్టే కార్యక్రమం ముమ్మరం కొనసాగుతున్నది.
- షేక్‌పేట మండల పరిధిలో నాలుగు చోట్ల మహిళా సంఘాల సభ్యులు వీటిని కుడుతుండగా కుట్టు మిషన్లు ఉన్నవారు వస్త్రాన్ని తమ ఇంట్లోకి తీసుకువెళ్లి కుడుతున్నారు. ప్రతి విద్యార్థికి రెండు జతల ఏకరూప దుస్తులు ఇవ్వాలని నిర్ణయించారు. మహిళలు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. గతంలో స్కూల్ యూనిఫాంలను కుట్టించి ఆయా పాఠశాలలకు చేరవేసే బాధ్యతలను ప్రత్యేకంగా హెచ్ఎంలకు అప్పగించేవారు.
- వారు తమ పరిధిలోని దర్జీలతో పాటు ఇతర ప్రాంతాల్లోని దర్జీలతో వీటిని కుట్టించేవారు. సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు పడుతూ మెల్లమెల్లగా అంతగా ఆసక్తి చూపకపోవడంతో ఈ సారి మహిళా సంఘాలతో కుట్టించాలని సూచించారు.
- ఒక జత యూనిఫాం కుడితే రూ. 75 చెల్లిస్తున్నారు.
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో 16,676 మంది విద్యార్థులకు వస్త్రం పంపిణీ చేశారు. యూసీడీ విభాగం అధికారుల ద్వారా మహిళా సంఘాలకు దీనిని అప్పటించారు. ఇప్పటికే చాలావరకు యూనిఫాంలు కుట్టడం పూర్తికావచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారు. జూన్ 5 నాటికి అందించాలని, ప్రతిరోజూ అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. నిత్యం సమీక్షిస్తూ తగిన సూచనలు కూడా జారీ చేస్తున్నారు.

దుస్తులు ఇలా...

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల (1-5 తరగతులు, 6, 7వ తరగతులు) బాలురకు రెండు చొక్కాలు, రెండు నిక్కర్లు, ఉన్నత పాఠశాల బాలురకు రెండు ప్యాంట్లు, రెండు చొక్కాలు కుట్టిస్తున్నారు.

- బాలికలకు ప్రత్యేక దుస్తులు ఉన్నాయి. పంజాబీ డ్రెస్ మాదిరిగా పైన కోటు వచ్చేలా కుట్టిస్తున్నారు. ముందస్తుగానే వాటి రూపాలు, నమూనాలను కుట్టే మహిళలకు అందించారు. వారి అంగీకారంతో వస్త్రం అప్పగించారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం



షేక్‌పేట మండల పరిధిలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 22 ఉన్నాయి. ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించడంతో సెట్విన్ బిల్డింగ్‌లలో అప్పటికే ఉన్న కుట్టుమిషన్ల ద్వారా మహిళలు వీటిని కుడుతున్నారు. కొంతమంది తమ ఇళ్లల్లో కూడా కుడుతున్నారు. నా సర్కిల్ పరిధిలో వంద మంది మహిళలు డ్రెస్సులు కుడుతున్నారు. ఒక్కో డ్రెస్‌కు రూ. 75 చెల్లిస్తున్నాం. తొలిసారిగా మహిళా సమాఖ్యలకు ఏకరూప దుస్తులు కుట్టే అవకాశం లభించింది. ఈ అవకాశాన్ని నా పరిధిలోని కుట్టుమిషన్లు ఉండి కుట్టడం వచ్చే మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ రకంగా సేవ చేసే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యూనిఫాంలు కుట్టడానికి చాలామంది మహిళలు ఉత్సాహంగా ముందుకురావడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. నేను చెప్పగానే మహిళా సంఘాల సభ్యులు దీనిని ఒక బాధ్యతగా తీసుకున్నారు. గడువులోగానే మొత్తం దుస్తులు కుట్టి ఆయా పాఠశాలలకు అందిస్తాం.

– ఆశా విరోనిక, యూసీడీ డీపీఓ, జీహెచ్ఎంసీ సర్కిల్-18

మంచి అవకాశం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు కుట్టి ఇచ్చే అవకాశం మహిళా సమాఖ్య సభ్యులకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ అవకాశాన్ని మేము సద్వినియోగం చేసుకుంటున్నాం. ప్రస్తుతం సెలవు దినాలు కావడంతో ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుంటున్నాం. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ సెట్విన్ కార్యాలయంలో 20 మంది వరకు మహిళా గ్రూపు సభ్యులు ఏకరూప దుస్తులు కుడుతున్నారు. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ సలహాలు, సూచనలు ఇస్తూ ఉత్సాహంగా దుస్తులు కుట్టడం జరుగుతుంది.

– రజిత, మహిళా గ్రూపు సభ్యురాలు

అంకితభావంతో...



మా పరిధిలోని విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు కుట్టించే బాధ్యతను మొట్టమొదటిసారిగా మహిళా గ్రూపులకు అప్పగించారు. దీని వల్ల స్టిచ్చింగ్ నాణ్యంగా ఉంటుంది. నామమాత్రంగా కాకుండా అంకితభావంతో మహిళలందరూ దుస్తులు కుడుతున్నారు. ఇలాంటి అవకాశం మహిళా గ్రూపులకు ఇవ్వడం మంచి పరిణామం. దీని వల్ల సెలవు రోజుల్లో గ్రూపు సభ్యులకు ఉపాధి లభించినట్లయ్యింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కో కేంద్రంలో 20 నుంచి 30 మంది మహిళలు చిత్తశుద్ధితో దుస్తులు కుడుతున్నారు. ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు దుస్తులు కుట్టే పనిని మహిళా గ్రూపులకు అప్పగించడం ద్వారా విద్యార్థులకు మంచి దుస్తులు, ఇటు మహిళలకు చేతినిండా పని లభిస్తుంది.

– కవిత, మహిళా గ్రూపు సభ్యురాలు

బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి



నియామక పత్రం ఇస్తున్న దృశ్యం

పంజగుట్ట: జనాభా ప్రాతిపదికన బీసీల రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ డిమాండ్ చేశారు. బీసీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యే అవకాశం చాలామటుకు కోల్పోతున్నారని, రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కనీసం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులుగా అయినా అవుతారని ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీల వెనకబాటు తనానికి గత పాలకుల విధానాలే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమన్నారు. జాతీయ బీసీ చైతన్య సమితి తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా భయ్యా వెంకటనర్సింహా రాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎలిగేటి కృష్ణవేణిలను ఎంపికచేసి నియామక పత్రం అందజేశారు. త్వరలో జిల్లా, గ్రామ స్థాయి కమిటీలు వేస్తామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినుగొండ సంధ్య, డాక్టర్ రమేష్ కల్లూరి, చలపతిరాజు, రామరాజు పాల్గొన్నారు.

'సేవా రత్న అవార్డు'కు ఎంపికైన అనూహ్యారెడ్డి



హిమాయత్‌నగర్: యూకే పార్లమెంట్ నేతృత్వంలో అందజేసే అరుదైన పురస్కారం 'సేవా రత్న అవార్డు-2024'కు కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు డాక్టర్ జి.అనూహ్యారెడ్డి ఎంపికయ్యారు. ఫౌండేషన్ ద్వారా పేదలకు నిజాయితీగా అందించిన సేవలను గుర్తించి నగరానికి చెందిన కళాబంధు అనూహ్యారెడ్డిని ఈ అరుదైన పురస్కారానికి ఎంపిక చేశారు. జూన్ 22వ తేదీన లండన్ పార్లమెంట్ వేదికగా హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ఈ పురస్కారాన్ని ఆమె అందుకోనున్నారు. 2014 నుంచి కోవిధ సహృదయ ఫౌండేషన్ ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నిస్వార్థంగా ఆమె పేదలకు అందించిన సేవలను సోషల్ మీడియా ద్వారా, వివిధ ఎన్జీవోల ద్వారా, టెలిఫోన్‌కి సర్వేల ఆధారంగా గుర్తించిన లండన్ పార్లమెంట్ వారు అనూహ్యారెడ్డిని ఈ అత్యున్నత పురస్కారంతో సత్కరించనున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు

హిమాయత్‌నగర్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, వారి బెదిరింపుల నుంచి తమను తాము రక్షించుకోవాలని నగర సైబర్ క్రైమ్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ట్రేడింగ్, ఫేక్ లోన్ యాప్‌లు, ఫెడెక్స్, పార్ట్ టైమ్ జాబ్, సోషల్ మీడియాలో వేధింపుల పట్ల ఎలాంటి జాగ్రత్తలు పాటించాలని వారికి వివరించినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

లిబర్టీ: మానవ మనుగడ సజావుగా సాగాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎస్.శర్మ, తెలంగాణ పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు బన్సీలాల్ అన్నారు. పర్యావరణానికి ఎదురవుతున్న ఇబ్బందుల వల్ల యావత్ మానవజాతి భవిష్యత్తులో ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ సమితి కార్యాలయంలో కేబీఎస్ శర్మ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భూగోళంపై మానవాళి జీవితం ప్రశాంతంగా సాగాలంటే పర్యావరణానికి ఆటంకం కలగకుండాచూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణం కలుషితమైతే భవిష్యత్తులో ముప్పుతప్పదని అన్నారు. సమాజంలోని ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన ఆలోచన పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.

'వరల్డ్ హంగర్ డే లంచ్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గుప్తా

హిమాయత్‌నగర్: ఆకలి రహిత ప్రపంచం సాధన దిశగా మలబార్ గ్రూప్ చేపట్టిన వరల్డ్ హంగర్ డే కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అభినందించారు. హిమాయత్‌నగర్‌లోని మలబార్ గోల్డ్ జువెలరీ నిర్వాహకులు బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వరల్డ్ హంగర్ డే లంచ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి రోజూ దేశ వ్యాప్తంగా 51,000 పోషకాహార ప్యాకెట్ల పంపిణీ చేయడానికి నిర్ణయించడం అభినందనీయమన్నారు. పేద వారి ఆకలి తీర్చడం నిజంగా గొప్ప విషయమని, ఇకముందు ఇలాంటి సేవ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు.

స్టాక్ మార్కెట్ ఐపీవోల పేరుతో రిటైర్డ్ ఉద్యోగికి భారీ టోకరా

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్ ఐపీవోలు సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాలని, అందులో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన 72 ఏళ్ల ఓ రిటైర్డ్ ఉద్యోగికి ట్రేడింగ్ సంబంధించిన పిమ్‌కో గ్రూప్‌లో సభ్యుడు ఉన్నారని మెసేజ్ చేశారు. లేదని సమాధానం ఇవ్వడంతో అందులో సభ్యుడిగా చేరాలని చెప్పారు. అనంతరం బాధితుడికి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. కేటుగాళ్లు ఓరియంట్ బెల్ లిమిటెడ్ ఐపీవో షేర్లను కొనుగోలు చేయాలని చెప్పారు. షేర్లు లిస్ట్ కాబోతున్నాయని అందులో అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. వారు చెప్పిన విధంగా వాట్సాప్ గ్రూప్ ద్వారా నకిలీ ట్రేడింగ్ అకౌంట్‌లో షేర్లు కొనుగోలు చేశాడు. అనంతరం మరుసటిరోజు బాధితుడికి బ్లాక్ ట్రేడింగ్ చేయాలని సూచించారు. ఈ విధంగా వివిధ స్టాక్‌లలో పెట్టుబడులు పెట్టాలని చెబుతూ బాధితుడి నుంచి విడతల వారిగా రూ.25 లక్షలు సైబర్ కేటుగాళ్లు కాజేశారు. బాధితుడు పెట్టుబడి పెట్టిన మొత్తాన్ని విత్ డ్రా చేసుకోవాలని ప్రయత్నించగా విత్ డ్రా కాలేదు. దీంతో మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు. ప్రజలు స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అధిక లాభాలకు ఆశపడి మోసపోవద్దని, సైబర్ మోసానికి గురైన బాధితులు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయడం, లేదా వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఏసీపీ సూచించారు.

తెలంగాణ సాహితీ వైతాళికుడు సురవరం

చిక్కడపల్లి: తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వానికి సురవరం ప్రతాపరెడ్డి విశేష సేవ చేశారని పలువురు ప్రముఖులు అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ది మహనీయులు యాదిలో భాగంగా తెలంగాణ సాహిటితీ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి పెద్దూరి వెంకటదాసు మాట్లాడుతూ న్యాయవాదిగా, సామాజిక వేత్తగా, సంపాదకునిగా, తెలంగాణ రైతాంగ సాయిధ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన ఉద్యమ కారునిగా ప్రతాపరెడ్డి చరిత్రను పాఠ్య పుస్తకంలో చేర్చాలని కోరారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి మాట్లాడుతూ గోల్కొండ పత్రిక సంపాదకుడిగా తెలంగాణ కవులు, సాహితీవేత్తలను వెలుగులోకి తెచ్చిన సురవరం ప్రతాపరెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కూడా గుర్తింపు పొందారని, ఆయన జీవితం నేటి రాజకీయ వేత్తలకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ మూర్తి, భవాని, శ్రీమణి పాల్గొన్నారు.

నేచర్ క్యూర్ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న మంత్రి

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం అమీర్‌పేటలోని నేచర్ క్యూర్ ఆసుపత్రిని సందర్శించారు. ఆయూష్ పరిధిలోకి వచ్చే యోగాధ్యాయన పరిషత్ వైద్య కళాశాల, ఆయుర్వేద, సిద్ధ విభాగాలలో పనిచేసే అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆసుపత్రి, యోగా కేంద్రం, కాటేజీలను పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. భవిష్యత్‌లో ప్రకృతి వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రత్యేకంగా వెబ్ సైట్‌ను రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆయన వెంట వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, ఆయుష్ కమిషనర్, యోగాధ్యాయన పరిషత్ కార్యదర్శి ఎం.ప్రశాంతి, ఆసుపత్రి అధికారులు సాయిరాం, భానుకిరణ్ ఉన్నారు.

కూరగాయల ధరలు



శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 37, దొండ 23, గుండుబీన్స్ 135, గింజ చిక్కుడు 75, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, రూట్ రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 31, చామగడ్డ 40, మొరంగడ్డ 25, కందగడ్డ 70, సొరకాయ 13, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి రూ. 4-5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

చరణ్‌సింగ్‌కు నివాళి

లిబర్టీ: దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి చౌదరి చరణ్‌సింగ్ జీవితాంతం పని చేశారని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వర అన్నారు. స్వాతంత్ర సమరయోధుడిగా.. ప్రధాన మంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ వర్ధంతి పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రధాన మంత్రిగా అనేక సంస్కరణలు తీసుకువచ్చి సామాన్య, పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు చేశారని ఆయన గుర్తు చేశారు. చంద్రసింగ్ ప్రధాన మంత్రిగా వ్యవసాయ రంగానికి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని రాజేశ్వర రావు అన్నారు. నీతి నిజాయితీ కలిగిన నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారని అన్నారు.

అక్రమంగా గ్యాస్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వెంగళరావునగర్: అనుమతి లేకుండా గ్యాస్ విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రాజీవ్‌నగర్‌లో నివాసం ఉండే ఎ.బాలాజీ కొంతకాలంగా ప్రభుత్వ అనుమతి లేకుండా యూసుఫ్‌గూడ యాదగిరినగర్‌లో గ్యాస్‌ను విక్రయిస్తున్నాడు. విషయాన్ని పలువురు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిఘా వేసి బుధవారం అతనిని పట్టుకున్నారు. అతని వద్ద హెచ్‌పీ గ్యాస్ చిన్న సిలిండర్లు రెండు, మరో రెండు పెద్ద సిలిండర్లు, 8 ఖాళీ సిలిండర్లు, గ్యాస్ రీఫిల్లింగ్ కిట్, వేయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ పార్కింగ్‌లతో పరేషాన్



జింఖానా క్లబ్ ముందు అక్రమ పార్కింగ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని జింఖానా క్లబ్ ముందు అక్రమ పార్కింగ్‌లు స్థానికంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. క్లబ్ ఎదుట ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కార్లు పార్కింగ్ చేయడమే కాకుండా రోడ్డు పైన కూడా అక్రమంగా పార్కింగ్ చేస్తుండడంతో జూబ్లీహిల్స్ వైపు నుంచి వస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇష్టానుసారంగా క్లబ్ ముందు అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు క్లబ్ ముందు అక్రమ పార్కింగ్‌ను నరకాన్ని చూపిస్తున్నాయి. వాహనదారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఈ క్లబ్‌కు వచ్చే వాహనదారులు పక్కనే ఉన్న గల్లీలు కూడా ఆక్రమించి తమ కార్లను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. క్లబ్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే అక్రమ పార్కింగ్‌లు జోరుగా సాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఇక్కడ అక్రమ పార్కింగ్‌లకు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కౌన్సెలింగ్ చేసిన గంటలోనే భార్యపై దాడి

ఫిలింనగర్: కలిసి ఉండాలని, గొడవలు పెట్టుకోవద్దని పోలీసులు కౌన్సెలింగ్ చేసి పంపించిన గంట సేపట్లోనే ఓ కిరాతక భర్త తన భార్య వెళ్తున్న ఆటోపై దాడి చేసి గాయపరిచిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... ఫిలింనగర్‌కు చెందిన యువతి(19) జాలోత్ ఆకాష్‌ను పెళ్లి చేసుకుంది. వీరికి ఒక కూతురు కూడా ఉంది. పెళ్లి జరిగిన కొద్ది రోజుల నుంచే ఆకాష్ భార్యను వేధిస్తూ వచ్చాడు. శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో రెండు రోజుల క్రితం తన భర్తపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమె భర్త ఆకాష్‌ను, అత్తమామలు హనుమంతు, విజయలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. దీంతో ఆమె తన పుట్టినిల్లైన ఇబ్రహీంపట్నంకు తల్లిదండ్రులతో కలిసి ఆటోలో వెళ్తుండగా భర్త ఆకాష్, ఆయన స్నేహితుడు మోహన్, సాయికిరణ్‌లు బైక్‌లపై ఆటోను వెంబడిస్తూ గుడిమల్కాపూర్ సమీపంలో రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆమె తండ్రికి రాయి తగిలి గాయాలయ్యాయి. ఆటో ధ్వంసమైంది. ఈ ఘటన వెనుక తన భర్త బంధువులు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త ఆకాష్‌తో పాటు అత్తమామలు, బంధువులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

1969 తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు

కాచిగూడ: 1969లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం చేసి జైలు జీవితం గడిపిన విద్యార్థి ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు అన్నారు. అప్పటి ఉద్యమకారులు వయస్సు పై బడి ఆర్థికంగా, ఆరోగ్య పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. బుధవారం కాచిగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సం సందర్భంగా ఉద్యమకారులను ప్రభుత్వం సత్కరించనున్నట్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. జైలు జీవితం అనుభవించిన ఉద్యమకారుల వివరాలతో కూడిన జాబితాను ఇప్పటికే ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలకు అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఇప్పటికైనా వారిని గుర్తించి ఉద్యమకారులకు ఇళ్ల స్థలం, పింఛన్, ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు. 1969 ఉద్యమనేతల్లో ఇప్పటికే ఎంతో మంది చనిపోయారని, మిగిలిన వారిలో 45 మందితో కూడిన ఉద్యమకారుల లిస్టును సీఎంకు అందజేయనున్నట్లు తెలిపారు. అప్పటి ఉద్యమకారుల పేరుతో కొన్ని నకిలీ సంఘాలు పుట్టుకు వస్తున్నాయని ఆలాంటి వారి పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం 72 ఏళ్ల లోపు ఉన్నవారు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, 72 ఏళ్ల పైబడి ఉన్నవారిని మాత్రమే ఉద్యమకారులుగా గుర్తించాలని కోరారు.

ముద్ర లోన్ పేరుతో రూ. 30 వేలు మోసం

పంజగుట్ట: కేంద్ర ప్రభుత్వ పథకమైన ముద్ర లోన్ ఇప్పిస్తానని నమ్మబలికి ఒక వ్యక్తి నుంచి రూ. 30 వేలు తీసుకుని పరారైన నిందితుడిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... సోమాజిగూడకు చెందిన కార్తీక్ మొబైల్‌కు ముద్ర లోన్ ఇప్పిస్తానని ఒక మెసేజ్ వచ్చింది. దాన్ని నమ్మి మెసేజ్‌కు స్పందించడంతో బాషా అనే వ్యక్తి ఫోన్ చేసి ప్రాసెసింగ్ ఫీజు అని మొదట రూ. 10 వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని తీసుకున్నాడు. తరువాత కార్తీక్‌ను కలిసి మరికొన్ని డాక్యుమెంట్లు సబ్మిట్ చేయాలంటూ మరో రూ. 20 వేలు తీసుకున్నాడు. మొత్తం రూ. 30 వేలు తీసుకున్న తర్వాత ఫోన్ చేస్తే స్పందనలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన కార్తీక్ పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్ ఇంజినీర్ అదృశ్యం

వెంగళరావునగర్: మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ సివిల్ ఇంజినీర్ అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... ఆర్.మాధవి అనే మహిళ వెంగళరావునగర్‌లో సివిల్ ఇంజినీర్‌గా పనిచేసే తన సోదరుడు (కజిన్) ఐ.సత్యతో కలిసి ఉంటోంది. సత్య పదేళ్లుగా ఆమె వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 11న ఓటు వేసేందుకని కృష్ణా జిల్లాకు వెళ్లి ఈ నెల 24వ తేదీ సాయంత్రం తిరిగి వచ్చారు. అదేరోజు ఉదయం తన సోదరుడు ఇంటికి తాళం వేసి పక్క గదిలో నివసించే వారికి తాళాలు ఇచ్చి వెళ్లాడు. సత్య కోసం మాధవి ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్విచ్ ఆఫ్ వస్తుంది. పలు ప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేకనందున మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 30.8 శాతం మంది కోటీశ్వరులే. అలాగే 20 శాతం (1,643) మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. వారిలో 1,190 మందిపై అత్యాచారం, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాల వంటి తీవ్రమైన కేసులున్నాయి. మొత్తం 8,360 మంది అభ్యర్థుల్లో 8,337 మంది అఫిడవిట్లను విశ్లేషించిన మీదట అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు బుధవారం నివేదిక విడుదల చేశాయి. మొత్తం అభ్యర్థుల్లో 1,333 మంది జాతీయ పార్టీల తరఫున, 532 మంది రాష్ట్ర పార్టీల నుంచి, 2,580 మంది రిజిస్టర్డ్ పార్టీల నుంచి బరిలో ఉన్నారు. 3,915 మంది స్వతంత్ర అభ్యర్థులు. మొత్తం 751 పార్టీలు పోటీలో ఉన్నాయి. 2019లో 677 పార్టీలు, 2014లో 464, 2009 ఎన్నికల్లో 368 పార్టీలు పోటీ చేశాయి. 2009 నుంచి 2024 వరకు ఎన్నికల బరిలో నిలిచిన రాజకీయ పార్టీల సంఖ్య 104% పెరిగింది. కాగా మరోసారి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన 324 మంది సిట్టింగ్ ఎంపీల సంపద గత ఐదేళ్లలో సగటున 43% పెరిగింది.

- సాక్షి, న్యూఢిల్లీ



లోక్‌సభ అభ్యర్థుల్లో 31% సంపన్నులు 20% నేరచరితులు


1,190 మందిపై తీవ్రమైన కేసులు ● అభ్యర్థుల్లో 10% మహిళలు


పెరుగుతున్న మహిళా అభ్యర్థులు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మహిళల సంఖ్య ఈసారీ స్వల్పంగానే ఉంది. కేవలం 797 మంది మాత్రమే బరిలో ఉన్నారు. అయితే గత మూడు లోక్‌సభ ఎన్నికల నుంచి వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2009లో 7 శాతం, 2014లో 8 శాతం, 2019లో 9 శాతం మహిళలు లోక్‌సభ బరిలో నిలవగా ఈసారి 10 శాతానికి చేరారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 69 మంది మహిళలకు, కాంగ్రెస్ 41 మందికి టికెట్లిచ్చాయి.

సగానికి పైగా రెడ్ అలర్ట్ స్థానాలే..

క్రిమినల్ కేసులున్న అభ్యర్థుల సంఖ్య 2019 లోక్‌సభ ఎన్నికల్లో 1,500 కాగా ఈసారి 1,643కు పెరిగింది. మొత్తం 440 మంది అభ్యర్థులలో 191 మంది నేర చరితులతో ఈ జాబితాలో బీజేపీ టాప్‌లో ఉంది. తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్ (327 మందిలో 143), బీఎస్పీ (487 మందిలో 63), సీపీఎం (52 మందిలో 33) ఉన్నాయి. 3903 మంది స్వతంత్ర అభ్యర్థులలో 550 (14%) మంది నేర చరితులు. ఈ జాబితాలో టాప్ 5లో కేరళ నుంచి ముగ్గురు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ నుంచి ఒక్కొక్కరున్నారు. ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది నేర చరితులున్న (రెడ్ అలర్ట్) స్థానాలు 2019లో 36 శాతం కాగా ఈసారి ఏకంగా 53 శాతానికి పెరిగాయి. ఈ జాబితాలో 288 నియోజకవర్గాలు చేరాయి. అంటే దేశవ్యాప్తంగా ప్రతి రెండు లోక్‌సభ సీట్లలో ఒకటి రెడ్ అలర్ట్ స్థానమే!





సంపన్నుల్లో తెలుగు అభ్యర్థులే టాప్-2

అభ్యర్థుల్లో కోటీశ్వరులు 2019లో 16 శాతం కాగా ఈసారి 27 శాతానికి పెరిగారు. మొత్తం అభ్యర్థులలో 2,572 మంది కోటీశ్వరులే! ఈ జాబితాలో కూడా బీజేపీయే టాప్‌లో నిలిచింది. 440 మంది బీజేపీ అభ్యర్థుల్లో 403 కోటీశ్వరులే. అంటే 91.6 శాతం! 2019లో ఇది 41.8 శాతమే. 327 మంది కాంగ్రెస్ అభ్యర్థులలో 292 మంది (89%), 487 మంది బీఎస్పీ అభ్యర్థులలో 163 మంది (33%), 52 మంది సీపీఎం అభ్యర్థులలో 27 మంది (52%)), 3,903 మంది ఇండిపెండెంట్లలో 673 మంది (17%) మంది కోటీశ్వరులు. ఈ జాబితాలో తొలి, రెండో స్థానంలో తెలుగు అభ్యర్థులే ఉండటం విశేషం. ఏపీలోని గుంటూరు టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఏకంగా రూ.5,705 కోట్లతో దేశంలోనే అగ్ర స్థానంలో నిలిచారు. తెలంగాణలోని చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి రూ.4568.22 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు.

మహిళలకు బీజేడీ సముచిత స్థానం!

33 శాతం టికెట్లు వారికే

లోక్‌సభ ఎన్నికల్లో ఒడిశాకు చెందిన బిజూ జనతాదళ్ (బీజేడీ) ఆదర్శంగా నిలిచింది. టికెట్ల కేటాయింపులో మహిళలకు సముచిత స్థానమిచ్చి గౌరవించింది. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలుంటే ఏడు చోట్ల మహిళలకు అవకాశం ఇచ్చింది. అంటే వారికి 33 శాతం సీట్లు కేటాయించింది. లేఖశ్రీ సమంత్ సింగార్ (బాలాసోర్), శర్మిష్ఠ సేథీ (జజ్‌పూర్), మంజులా మండల్ (భద్రక్), రాజశ్రీ మల్లిక్ (జగత్ సింగ్‌పూర్), పరిణీతి మిశ్రా (బార్‌గఢ్), కౌసల్యా హికాక (కోరాపుట్), రంజితా సాహూ (ఆస్క)కు టికెట్లిచ్చింది. అదే సమయంలో టికెట్ల కేటాయింపులో ఫిరాయింపుదారులకు కూడా పెద్ద పీట వేసి విమర్శకుల నోళ్లకు పని చెప్పింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఏడుగురు మహిళలకు బీజేడీ చీఫ్, సీఎం నవీన్ పట్నాయక్ టికెట్లివ్వడం గమనార్హం. ఈసారి బీజేడీ నుంచి బరిలోకి దిగిన ఏడుగురు మహిళా అభ్యర్థుల్లో బీజేపీ నుంచి వచ్చిన లేఖశ్రీ సమంత్ సింగార్ కూడా ఉన్నారు. ఆమె బాలాసోర్ నుంచి పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో కూడా ఏడుగురు బీజేడీ మహిళా అభ్యర్థుల్లో ఇద్దరు పార్టీ ఫిరాయింపుదారులున్నారు! ఈ విడత ఇద్దరు సిట్టింగ్ మహిళా ఎంపీలు చంద్రాణి ముర్ము (కియోంజర్), ప్రమీలా బిసోయ్ (ఆస్క)లకు నవీన్ టికెట్లివ్వలేదు.

ఫిరాయింపుదారులకూ 33 శాతం

ఒకరిద్దరు కాదు.. బీజేడీ ఈ విడత ఏకంగా 38 శాతం మంది ఫిరాయింపుదారులను లోక్‌సభ బరిలో దింపడం ఆశ్చర్యకరం. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరు ఇతర పార్టీల నుంచి వచ్చిచేరిన వారే! లేఖశ్రీ సమంత్ సింగార్ (బాలాసోర్), భృగు బాక్సిపాత్ర (బెర్హంపూర్), ప్రదీప్ మాంఝి (నబరంగ్‌పూర్), సురేంద్ర సింగ్ భోయ్ (బోలంగిర్), పరిణీత మిశ్రా (బార్‌గఢ్), ధనర్జయ్ సిధు (కియోంఝర్), అన్షుమన్ మహంతి (కేంద్రపర), మన్మోత్ రూట్రే (భువనేశ్వర్) ఇతర పార్టీల నుంచి వచ్చి బీజేడీ టికెట్ సంపాదించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

● పాటలీపుత్ర

లాలుకు లిట్మస్ టెస్టు

● బరిలో కూతురు మీసా భారతి
● ఆమె విజయం కోసం చెమటోడుస్తున్న వైనం

పాటలీపుత్ర లోక్‌సభ స్థానం బీజేపీ, ఆర్జేడీ మధ్య హోరాహోరీ పోరుకు వేదికైంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ రామ్ కృపాల్ యాదవ్ హ్యాట్రిక్‌పై గురిపెట్టారు. ఆయన చేతిలో రెండుసార్లు ఓడిన ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతి ముచ్చటగా మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కూతురిని ఎలాగైనా గెలిపించుకోవాలని లాలు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

బిహార్‌లోని పాటలీపుత్ర లోక్‌సభ స్థానం 2008లో డీలిమిటేషన్ తర్వాత ఏర్పాటైంది. 2009లో లాలు కూడా ఇక్కడ ఓటమి చవిచూడటం విశేషం. అది కూడా ఒకప్పటి తన శిష్యుడు జేడీ(యూ) నేత రంజన్ ప్రసాద్ యాదవ్ చేతిలో! తర్వాత మీసా భారతిని బరిలో దింపారు. తనను కాదని కూతురికి టికెటివ్వడంతో లాలుతో విభేదించిన రామ్‌కృపాల్ 2014లో ఆర్జేడీని వీడి బీజేపీలో చేరారు. 2014, 2019ల్లో రెండుసార్లు మీసా భారతిని ఓడించారు. విద్యార్థి సంఘాల నుంచి ఎదిగిన రామ్ కృపాల్ 1993లో ఆర్జేడీ టికెట్‌పై తొలిసారి ఎంపీగా గెలిచారు. తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. 1996లో, 2004లో కూడా లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఐదుసార్లు ఎంపీగా చేసిన ఆయనకు బిహార్‌లో గట్టి రాజకీయ బలం ఉంది. పాటలీపుత్ర నియోజకవర్గ ప్రజలతో మంచి అనుబంధముంది. పిలిస్తే పలికే నాయకునిగా పేరు తెచ్చుకున్నారు. నియోజకవర్గమంతా కలియదిరుగుతూ ఓటర్లను ప్రత్యక్షంగా కలుస్తున్నారు. రామమందిర నిర్మాణ ప్రభావం కూడా ఇక్కడి ఓటర్లపై బాగా ఉండటం ఆయనకు మరింత కలిసి రానుంది.



మీసా... మూడోసారి

పాటలీపుత్రలో ఆర్జేడీ ఓటమి పరంపరకు ఈసారి ఎలాగైనా బ్రేక్ వేయడానికి మీసా ప్రయత్నిస్తున్నారు. లాలు, భార్య రబ్రీ, కుమారుడు తేజస్వీ యాదవ్‌తో సహా కుటుంబమంతా ఆమె గెలుపు కోసం పని చేస్తోంది. 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత నియోజకవర్గం వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం 2019లో మీసాకు బాగా మైనస్‌గా మారింది. ప్రజలకు అందుబాటులో ఉండరన్న అపప్రథను కూడగట్టుకున్నారు. ఈసారి కూడా ఎన్నికలవగానే మాయమవుతారా, గెలుపోటములతో నిమిత్తం లేకుండా నియోజకవర్గంలో ఉండి పని చేస్తారా అంటూ ప్రచారం పొడవునా ప్రజలు ఆమెను నిలదీస్తున్న పరిస్థితి! అయితే ఇక్కడ మోదీ ఫ్యాక్టర్ 2019లో ఉన్నంత బలంగా లేకపోవడం మీసాకు కాస్త ఊరట. పైగా పాటలీపుత్ర లోక్‌సభ స్థానం పరిధిలోని 6 అసెంబ్లీ స్థానాలూ ఆర్జేడీ, దాని మిత్రపక్షాల చేతిలోనే ఉన్నాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తదితరాలను ప్రచారాస్త్రాలుగా సంధిస్తున్నారామె.

కుల సమీకరణాలు...

బీజేపీకి మద్దతిచ్చే బ్రాహ్మణులతో సహా అగ్రవర్ణాల ఓట్లు పాటలీపుత్రలో లక్షకు పైగా ఉన్నాయి. దాదాపు 4 లక్షల ఓట్లున్న భూమిహార్ ఓటర్లలోనూ ఆ పార్టీకి బలముంది. 5 లక్షల యాదవ, 1.7 లక్షల కుర్మీ, 3 లక్షల దళిత ఓట్లు రామ్ కృపాల్, మీసా మధ్య చీలనున్నాయి. యాదవులతో పాటు 1.5 లక్షల ముస్లిం ఓట్లను మీసా నమ్ముకున్నారు. కాకపోతే మజ్లిస్ బరిలో ఉండటంతో ముస్లిం ఓట్లు చీలి ఆర్జేడీకి గట్టి నష్టమే చేసేలా కన్పిస్తోంది. హోరాహోరీ పోరులో ఈసారి పాటలీపుత్రలో లాంతరు వెలుగుతుందో, ముచ్చటగా మూడోసారీ కమలమే వికసిస్తుందో చూడాలి.

ఆంధ్రప్రదేశ్

‘సడలింపు’ని సరిదిద్దండి

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

పోస్టల్ బ్యాలెట్ నిబంధనల మినహాయింపులపై ఆక్షేపణ

- ఈసీఐ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సడలింపులు
- అటెస్టింగ్ అధికారుల స్పెసిమెన్ సంతకాల సేకరణ ఈసీఐ నిబంధనలకు విరుద్ధం
- ఇది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తిరస్కరించేందుకు దారితీస్తుందంటూ ఆందోళన
- సడలింపు ఉత్తర్వులను తక్షణమే సమీక్షించి, తగు నిర్ణయం తీసుకోవాలని వినతి



సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) నిబంధనలను ఏపీలో సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఈనెల 25న జారీచేసిన ఉత్తర్వులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఆక్షేపించింది. అటెస్టింగ్ అధికారుల స్పెసిమెన్ సంతకాల సేకరణ గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలకు విరుద్ధమని గుర్తుచేసింది. ఇది పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఓట్ల తిరస్కరణకు కారణమవుతుందని.. పైగా తీవ్ర వివాదాలకు సైతం దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు ఎస్. నిరంజన్‌రెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా నిబంధనలను సడలిస్తూ జారీచేసిన ఉత్తర్వులను తక్షణం సమీక్షించి.. సముచిత నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దేశవ్యాప్తంగా ఒకలా.. రాష్ట్రంలో మరోలా..

నిజానికి.. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం చేసి, స్టాంప్ లేకపోయినా.. తన పేరు, డిజిగ్నేషన్ పూర్తి వివరాలను చేతితో రాస్తే ఆమోదించాలని గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవే మార్గదర్శకాలు అమలవుతున్నాయి. కానీ.. రాష్ట్రంలో టీడీపీ నేతల విజ్ఞప్తి మేరకు ఈ మార్గదర్శకాలను సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా ఈనెల 25న ఉత్తర్వులు జారీచేశారు. నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి (ఆర్వో) నిర్దేశించిన అటెస్టింగ్ ఆఫీసర్ సంతకాలు (స్పెసిమెన్) సేకరించి.. అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఆర్వోలకు పంపాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం ఉంటే చాలు.. డిజిగ్నేషన్ పూర్తి వివరాలను చేతితో రాయకపోయినా సరే.. ఆ సంతకంపై ఏమైనా అనుమానం వస్తే రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో), జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉన్న సంబంధిత అటెస్టింగ్ అధికారి సంతకం (స్పెసిమెన్)తో సరిపోల్చుకుని పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకునేలా సడలింపు ఇచ్చారు.

గోప్యతకు.. శాంతిభద్రతలకు విఘాతం..

ఇక పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమయంలో స్పెసిమెన్ సంతకంపై రాజకీయ పక్షాల ఏజెంట్ల మధ్య భేదాభిప్రాయాలు వ్యక్తమవుతాయి. ఇది చినికిచినికి పెను వివాదంగా మారి శాంతిభద్రతల సమస్యగా పరిణమించే ప్రమాదం ఉంది. ఈ నిబంధనలవల్ల ఓటు గోప్యత ఉండదని రాజకీయ పక్షాలు, ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని రీతిలో టీడీపీ నేతలు విజ్ఞప్తి చేయగానే.. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై నిబంధనలను సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనా ఉత్తర్వులు జారీచేయడంపై నివ్వెరపోతున్నారు.

నిబంధనల సడలింపుపై న్యాయపోరాటం..

ఇదిలా ఉంటే.. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా జారీచేసిన ఉత్తర్వులపై దుమారం రేగుతోంది. వాటిని సమీక్షించి.. సముచిత నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం సముచిత నిర్ణయం తీసుకోని పక్షంలో.. మీనా సడలింపు ఉత్తర్వులపై న్యాయపోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది.

మధ్యాహ్నం 2 గంటలకే 111 నియోజకవర్గాల ఫలితాలు

సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్ వ్యాస్‌కు సీఈవో మీనా వెల్లడి

సాక్షి, అమరావతి: వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా కేంద్ర ఎన్నికల సంఘానికి తెలిపారు. సత్వరమే ఫలితాల ప్రకటనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని మొత్తం 175 శాసన సభ నియోజకవర్గాల్లో 111 నియోజకవర్గాల్లో 20 రౌండ్ల లోపు లెక్కింపు జరుగుతుందని, వీటి ఫలితాలు మధ్యాహ్నం 2 గంటల్లోపే ఇచ్చేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. 61 నియోజకవర్గాల్లో 21 నుండి 24 రౌండ్లు లెక్కింపు జరుగుతుందని, వీటి ఫలితాలు సాయంత్రం 4 గంటల్లోపు వస్తాయన్నారు. మిగిలిన 3 నియోజకవర్గాల్లో 25 రౌండ్లకు పైబడి ఓట్ల లెక్కింపు జరుగుతుందని, సాయంత్రం 6.00 గంటల్లోపు వీటి ఫలితాలు రావొచ్చని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు టేబుళ్లను పెంచి సకాలంలో పూర్తి చేస్తామన్నారు. రాత్రి 8 – 9 గంటల మధ్య అన్ని నియోజకవర్గాల తుది ఫలితాలు ప్రకటించేలా ప్రణాళికాబద్దంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. న్యూఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ బుధవారం రాష్ట్ర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సమీక్షించారు. లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో కౌంటింగ్‌కు చేపట్టిన ఏర్పాట్లను సీఈవో మీనా వివరించారు. ఎన్నికల అనంతరం హింసాత్మక ఘటనలు జరిగిన జిల్లాల్లో ఓట్ల లెక్కింపు రోజు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 144 సెక్షన్ అమలుతో పాటు ఆ జిల్లాల్లో సీనియర్ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. డీజీపీతో పాటు తాను కూడా పల్నాడు జిల్లాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించామని, అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు.

ఓట్ల లెక్కింపులో లోపాలు జరగకూడదు

ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనలో ఎటువంటి లోపాలు, జాప్యం జరగడానికి వీల్లేదని, అందు కోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, త్వరితగతిన కచ్చితమైన ఫలితాలను ప్రకటించాలని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ రాష్ట్ర అధికారులకు చెప్పారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపును విజయవంతంగా పూర్తి చేయాలని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, సీపీలకు సూచించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫారం–21 సీ, 21ఈలను అదే రోజు ఫ్లైట్‌లో ఈసీకి పంపాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు సమయంలో అభ్యర్థులు, ఏజెంట్లు ఎటువంటి అవాంతరాలు కలిగించకుండా లెక్కింపు ప్రక్రియపై వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల్లో కూలీల విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులను ఎవ్వరినీ అందుకు వినియోగించొద్దని చెప్పారు. గుర్తింపు కార్డులు ఉన్నవారినే లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ఎన్నికల అనంతరం పల్నాడు జిల్లాలో హింసాత్మక ఘటనలు జరిగినందున, ఈ జిల్లా అధికారులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఓట్ల లెక్కింపు రోజు ఎటువంటి ఘటనలకు తావు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నేడు తిరుమలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాక



సాక్షి, అమరావతి/ తిరుమల: శ్రీవారి దర్శనార్థం కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం తిరుమలకు రానున్నారు. తమిళనాడులోని తిరుచిరాపల్లి నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి గురువారం సాయంత్రం ఆయన చేరుకుంటారు. రాత్రికి తిరుమలకు చేరుకుని వకుళా మాత అతిథిగృహంలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని స్వామిని దర్శించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు తిరుమల నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తిరుగు ప్రయాణం అవుతారు. అమిత్ షా రాక నేపథ్యంలో వకుళామాత అతిథిగృహం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి
- ప్రత్యర్థి పార్టీల ఏజెంట్ల పట్ల అత్యంత అప్రమత్తతతో ఉండాలి
- వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తుంది
- జూన్ 9న సీఎంగా జగన్ మరోసారి ప్రమాణ స్వీకారం చేస్తారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తతతో వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీల ఏజెంట్ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్ల వర్క్‌షాప్, జూమ్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల సందేహాల నివృత్తికి కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ఎటువంటి సమస్య ఉన్నా కేంద్ర కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ల విషయంలో కూడా చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో గుంటూరులో వేల ఓట్లు మన పార్టీ నష్టపోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ప్రతి ఓటూ విలువైనదేనని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, దానికి సంబంధించి ఆదేశాలు రాగానే తెలియజేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వారికి అనుకూలంగా నిర్ణయాలు వచ్చేలా చేస్తున్నారని అన్నారు. ఇటీవలి కాలంలో ఈసీ తీరు అనుమానాలకు తావిచ్చేలా ఉన్నందున, అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నియమ నిబంధనల పట్ల పూర్తి అవగాహనతో ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వస్తుందని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అవుతారని, ఇందులో ఎటువంటి అనుమానమూ లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విస్పష్టంగా చెప్పారు. వచ్చే నెల 9వ తేదీన వైఎస్ జగన్ మరోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. సమావేశానికి హాజరైన వారికి విశ్రాంత ఆర్డీవో ముదిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పలు సూచనలు చేశారు. ఏజెంట్ల సందేహాలు నివృత్తి చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఇన్‌చార్జి, శాసన మండలి విప్ లేళ్ళ అప్పిరెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఈసీ సడలింపుపై హైకోర్టుకు వెళ్తాం

● రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం సడలింపుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున హైకోర్టుకు వెళ్తామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. దేశమంతా ఒక రూల్.. ఏపీలో కూటమి కోసం ప్రత్యేక రూలా? అని ఆయన ప్రశ్నించారు. ఈ కొత్త నిబంధనలు ఏపీలోనే అమలుచేయడానికి ఎన్నికల కమిషన్ ఎందుకు తాపత్రయపడుతుందో అర్థంకావడం లేదన్నారు. ఈసీ వ్యవహారశైలిపై కోర్టులోనే తేల్చుకుంటామన్నారు. విశాఖలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అంటేనే తప్పుడు వ్యక్తి అని.. దానికి తోడు తప్పుడు పనుల కోసమే బీజేపీతో టీడీపీ జతకట్టిందని మండిపడ్డారు. పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ సంతకం సడలింపుపై ఈసీ నిర్ణయం మార్చుకోకపోతే హైకోర్టులో ఫిర్యాదు చేస్తామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని వైవీ అన్నారు. ఎన్నికల నియమావళిలో ఎలాంటి నియమ నిబంధనలు ఉన్నాయో వాటి ప్రకారమే ఈసీ వ్యవహరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ అధికారి సంతకం లేకుంటే దానిని తిరస్కరించడం ఎన్నికల నిబంధన అని.. దానికి తూట్లు పొడిస్తే సహించేదిలేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలా సడలింపులు ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలను జారీచేసిందని.. ఇందుకు విరుద్ధంగా ఒక రాజకీయ పార్టీ వినతికి తలొగ్గి నిబంధనలు ఎలా మారుస్తారో.. ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని వైవీ డిమాండ్ చేశారు.

భారత ఆర్మీకి చెందిన మేజర్ రాధికా సేన్‌కు ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరానికి గాను 'మిలటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్' అవార్డును ప్రకటించింది. ప్రతిష్ఠాత్మక ఈ అవార్డు కాంగోలో స్త్రీలు, బాలికల పట్ల హింస చోటు చేసుకోకుండా రాధికా సేన్ చూపిన శాంతి ప్రబోధానికి, ప్రచారానికి నిదర్శనం. రాధికాసేన్ పరిచయం.

కాంగోలో శాంతిదూత



మేజర్ రాధికా సేన్

తుపాకీ పట్టుకొని శాంతి కోసం ప్రయత్నించడం జటిలమైన పని. అంతర్యుద్ధం జరిగే దేశాల్లో బయటి దేశాల నుంచి వెళ్లి ఈ పని చేయాలంటే ప్రాణాలతో చెలగాటం. కాని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని పీస్ కీపింగ్ ఫోర్స్ ఆయా దేశాలలో శాంతి కోసం పోరాటం చేస్తూనే ఉంటుంది. ప్రాణాలకు తెగిస్తూనే ఉంటుంది. అందుకే ఈ శాంతి దళాలలో గొప్పగా పని చేసిన వారికి ఐక్యరాజ్యసమితి వివిధ విభాగాలలో అవార్డులు ఇస్తుంటుంది. లింగ వివక్ష, మహిళలపై హింసను సమర్థంగా నియంత్రించడానికి పని చేసే వారికి 'మిలటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్' ఇస్తోంది. 2023 సంవత్సరానికి ఆ అవార్డు మన ఆర్మీ మేజర్ రాధికా సేన్‌కు దక్కింది.

ఈ కాంగోలో ఘోరాలు

మధ్య ఆఫ్రికాలో రెండు కాంగోలు ఉన్నాయి. ఒకటి 'రిపబ్లిక్ ఆఫ్ కాంగో' (ఆర్‌ఓసి), రెండు 'డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో' (డిఆర్‌సి). ఆఫ్రికాలో రెండవ అతి పెద్ద దేశం డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో. ఒకప్పుడు బెల్జియం వలసగా ఉన్న ఈ దేశం స్వతంత్రం పొంది 'మొబుతు' అనే నియంత పాలనలో మగ్గింది. అతణ్ణి ప్రజలు కిందకు దించాక 1998 నుంచి అక్కడ అస్థిర పాలన కొనసాగుతూ ఉంది. తరచూ అంతర్యుద్ధాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఆ దేశ తూర్పు ప్రాంతాలైన ఇటురి, నార్త్ కీవోలలో రెండు సాయుధ దళాల వల్ల దాడులు జరుగుతున్నాయి. 'ఎయిడెడ్ డెమొక్రటిక్ ఫోర్సెస్' అనే గ్రూప్, 'హుతూస్' అనే మరో గ్రూప్ తమ తమ కారణాల రీత్యా తీవ్ర హింసకు పాల్పడుతుంటాయి. ఈ రెండు గ్రూపుల మధ్య సామాన్య జనం నలుగుతున్నారు. వీరిని అదుపు చేయడానికి వచ్చే సైన్యం వీరి కంటే ఎక్కువ హింసకు పాల్పడుతోంది. వీటన్నింటి మధ్య కనీస ఓదార్పుగా ఐక్యరాజ్య సమితి శాంతి దళాలు పని చేస్తున్నాయి.

అత్యాచార పర్వం

రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని దాదాపు 30 లక్షల మంది స్త్రీలు, బాలికలు ఏదో ఒక మేర హింసకు, లైంగిక హింసకు లోనయ్యారు. అర్ధరాత్రి అపరాత్రి ప్రత్యర్థి గ్రూపులు దాడి చేసి స్త్రీలు, బాలికల మీద అత్యాచారాలు చేసి మగవారిని చంపేసి పోతారు. ఇవి అక్కడ స్త్రీల మీద తీవ్రమైన మానసిక ప్రభావాన్ని ఏర్పరుస్తున్నాయి. అత్యాచారాల వల్ల



వారిలో చాలామంది హెచ్.ఐ.వి/ఎయిడ్స్ బారిన పడుతున్నారు. అక్కడి చిన్నపిల్లలైతే దారుణమైన ఆకలిని ఎదుర్కొంటున్నారు. పౌష్టికాహారం ఊసే లేదు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని బాధిత స్త్రీలలో విశ్వాసం నింపుతూ వారి కోసం సమర్థంగా పని చేయడం వల్ల రాధికా సేన్‌ను అవార్డు వరించింది.

బాధితుల కోసం దూతగా వచ్చి...

ఐక్యరాజ్య సమితి శాంతి దళాలలో భాగంగా ఆర్మీ మేజర్ రాధికా సేన్ 2023 ఏప్రిల్‌లో డి.ఆర్.కాంగోకు వెళ్లింది రాధికా సేన్. 'ఇండియన్ రాపిడ్ డిప్లాయ్‌మెంట్ బెటాలియన్'కు ఆమె అక్కడ కమాండర్‌గా పని చేసింది. అక్కడ మొదటగా ఆమె చేసిన పని తన బెటాలియన్‌కు కాంగో సంస్కృతిని పరిచయం చేయడం. స్త్రీల పట్ల సుహృద్భావనతో ఎలా మెలగాలో తెలియచేయడం. వారిలో ఆత్మవిశ్వాసం ఎలా కలిగించాలో చెప్పడం. రాధికా సేన్ నార్త్ కీవోలో పని చేసింది. అక్కడ స్త్రీల కోసం హెల్త్ ఎడ్యుకేషన్, ఉపాధి, లింగ సమానత్వం, కుటుంబ నిర్ణయాల్లో స్త్రీ ప్రాధాన్యం వంటి అంశాలలో రాధికా సేన్ వర్క్‌షాప్‌లు నిర్వహించింది. భర్తలను, పిల్లలను కోల్పోయిన స్త్రీలలో ఆత్మవిశ్వాసం నింపేలా వారితో తరచూ ఆమె సంభాషణలు నిర్వహించేది. వారు మళ్లీ పనిలో పడేలా చూసింది. హింసను సమష్టిగా ఎలా ఎదుర్కొనాలో అవగాహన కల్పించింది. కాంగో మహిళలు రాధికా సేన్‌ను తమలోని మనిషిగా చూశారు. ఆమె ద్వారా వారి ముఖాల్లో చిరునవ్వులు వచ్చాయి. అందుకే ఐక్యరాజ్యసమితి సెక్రెటరి జనరల్ ఆంటోనియో గుటెరస్ రాధికా సేన్‌కు అవార్డు ప్రకటిస్తూ 'రాధికా సేన్ కాంగో మహిళలను గొంతెత్తేలా చేయగలిగింది. శాంతి కోసం వారు ముందుకొచ్చేలా ఉద్యుక్తుల్ని చేసింది' అని మెచ్చుకున్నారు. మే 30 (నేడు) రాధికా సేన్‌కు అవార్డు బహూకరించనున్నారు.

జీరో టు మ..మ.. మాస్క్

'రెస్టారెంట్ మేనేజ్‌మెంట్' అంటే రెస్టారెంట్‌కు వెళ్లి ఇష్టమైన ఫుడ్ తిన్నంత ఈజీ కాదు. ఎన్నో సవాళ్లు వేడి వేడిగా ఎదురవుతుంటాయి. చల్లని ప్రశాంత చిత్తంతో వాటిని అధిగమిస్తేనే విజయం చేతికి అందుతుంది.

'యాక్సిడెంటల్ ఎంటర్‌ప్రెన్యూర్'గా తనను తాను పరిచయం చేసుకునే అదితి దుగర్‌కు వ్యాపారంలో ఎలాంటి అనుభవం లేకపోయినా రెస్టారెంట్ బిజినెస్‌లోకి వచ్చింది. అయితే ఆమె 'జీరో' దగ్గరే ఉండిపోలేదు. కాలంతోపాటు ఎన్నో పాఠాలు నేర్చుకొని ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయ ఢంకా మోగించింది. ముంబైలో అదితి నిర్వహిస్తున్న 'మాస్క్' వరల్డ్స్ 50 బెస్ట్ రెస్టారెంట్స్ జాబితాలో చోటు సాధించింది.

మనదేశంలో నంబర్‌వన్ రెస్టారెంట్‌గా గుర్తింపు పొందింది.

కొన్ని సంవత్సరాల క్రితం...

ముంబైలోని మహాలక్ష్మి ప్రాంతంలో 'మాస్క్' పేరుతో అదితి దుగర్ ఫైన్-డైనింగ్ రెస్టారెంట్ ప్రారంభించింది. అయితే ఈ రెస్టారెంట్ వ్యవహారం ఆమె మామగారికి బొత్తిగా నచ్చలేదు. సంప్రదాయ నిబద్ధుడైన ఆయన రెస్టారెంట్‌లోకి అడుగు కూడా పెట్టలేదు.

అలాంటి మామగారు కాస్తా 'మాస్క్' రెస్టారెంట్ తక్కువ సమయంలోనే బాగా పాపులర్ కావడం గురించి విని సంతోషించడమే కాదు రెస్టారెంట్‌కి వచ్చి భోజనం చేశాడు. తన స్నేహితులను కూడా రెస్టారెంట్‌కు తీసుకు వస్తుంటాడు.

తన కోడలు గురించి ఆయన ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటాడు.

ఎప్పటికప్పుడు కొత్త కొత్త వంటకాలను పరిచయం చేయడంతో 'మాస్క్' దూసుకుపోయింది. మోస్ట్ ఫార్వర్డ్ - థింకింగ్ ఫైన్-డైనింగ్ రెస్టారెంట్‌గా పేరు తెచ్చుకుంది.

ఉమ్మడి కుటుంబ వాతావరణంలో పెరిగిన అదితి ఎన్నో వంటకాల రుచుల గురించి పెద్దల మాటల్లో విన్నది. అలా వంటలపై తనకు తెలియకుండానే ఇష్టం ఏర్పడింది.

ఇద్దరు పిల్లల తల్లిగా నాలుగు సంవత్సరాలు ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. ఆ తరువాత కేటరింగ్‌పై దృష్టి పెట్టింది.

ఇంటి నుంచే మొదలుపెట్టిన కేటరింగ్ వెంచర్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా తొలి అడుగు వేసింది అదితి. ఆహా ఏమి రుచి అనిపించేలా వంటకాల్లో దిట్ట అయిన తల్లి ఎన్నో సలహాలు ఇచ్చేది. ఒకవైపు తల్లి నుంచి సలహాలు తీసుకుంటూనే మరోవైపు ప్యాకేజింగ్ నుంచి మార్కెటింగ్ వరకు ఎన్నో విషయాల్లో తీరిక లేకుండా గడిపేది అదితి.

క్యాటరింగ్ అసైన్‌మెంట్స్‌లో భాగంగా అదితి ఒక బ్రిటిష్ హోం చెఫ్‌తో కలిసి పనిచేయాల్సి వచ్చింది. అయితే ఇది తన తల్లిదండ్రులు, అత్తమామలకు ఎంతమాత్రం నచ్చలేదు. దీనికి కారణం అతడు నాన్-వెజ్ చెఫ్ కావడమే.

అయితే ఆ సమయంలో భర్త ఆదిత్య అదితికి అండగా నిలబడ్డాడు. అత్తమామలు, తల్లిదండ్రులకు నచ్చచెప్పాడు.

ఒకవేళ ఆదిత్య కూడా అసంతృప్తి బృందంలో ఉండి ఉంటే అదితి ప్రయాణం ముందుకు వెళ్లేది కాదు. అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేది కాదు.

'ఆ సమయంలో ఆదిత్య నాకు అండగా నిలబడకుంటే ఇంత దూరం వచ్చేదాన్ని కాదు' అంటుంది అదితి.

'అదితి విషయంలో నేను ఎప్పుడూ నో చెప్పలేదు. ఎందుకంటే ఆమె తప్పు చేయదు అనే బలమైన నమ్మకం ఉంది. ఏది చేసినా ఒకటికి రెండు సార్లు ఆలోచించి చేస్తుంది. ఆమె ఆలోచనల్లో పరిణతి ఉంది' అంటాడు మెచ్చుకోలుగా ఆదిత్య.

'కొత్తగా ఆలోచించేవాళ్లకు తగిన స్వేచ్ఛ ఇచ్చి అడిగినవి సమకూర్చితే అద్భుతమైన ఫలితాలు చూపించగలరు' అనే ఆదిత్య మాటను అక్షరాలా నిజం చేసింది అదితి.

ఫ్యామిలీ హాలిడే ట్రిప్‌లో స్పెయిన్‌లో ఉన్న అదితికి 'మాస్క్' ఐడియా తట్టింది. అక్కడి నుంచి తిరిగి వచ్చిన తరువాత తన కలకు శ్రీకారం చుట్టింది. 'ఫలానా దేశంలో ఫలానా వంటకం అద్భుతంగా ఉంటుంది. ఆ వంటకం మీ రెస్టారెంట్‌లో అందుబాటులో ఉండే బాగుంటుంది'... ఇలాంటి సలహాలు ఎన్నో కేటరింగ్ క్లయింట్స్ నుంచి వచ్చేవి.

ఎంతోమంది సలహాలు, సూచనలతో 'మాస్క్' మొదలై విజయం సాధించింది. అయితే 'మాస్క్' వేగానికి కోవిడ్ సంక్షోభం అడ్డుపడింది.

'కోవిడ్ సంక్షోభం వల్ల ఆర్థికంగా నష్టం వచ్చినప్పటికీ విలువైన పాఠాలు ఎన్నో నేర్చుకున్నాను. ఒక్క ముక్కలో చెప్పాలంటే కోవిడ్ అనేది మా వ్యాపారానికి సంబంధించి స్పష్టతను ఇచ్చింది' అంటుంది అదితి.

ఒక్కసారి వెనక్కి వెళితే...

'మాస్క్ పేరుతో డబ్బులు వృథా చేసుకోకండి. మీకు రెస్టారెంట్ బిజినెస్‌లో జీరో అనుభవం ఉంది. వ్యాపారంలో మీకు నష్టం తప్ప ఏమీ మిగలదు' అన్నారు చాలామంది.

'దశాబ్దాల అనుభవం ఉన్న వ్యాపారులైనా జీరో నుంచే మొదలవుతారు' అనే విషయం అదితికి తెలియనిది కాదు. 'జీరో' నుంచి మొదలైన ఆమె ప్రయాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే స్థాయికి చేరింది. అదితి దుగర్ విజయం ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తోంది.



'దశాబ్దాల అనుభవం ఉన్న వ్యాపారులైనా జీరో నుంచే మొదలవుతారు' అనే విషయం అదితికి తెలియనిది కాదు. 'జీరో' నుంచి మొదలైన ఆమె ప్రయాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే స్థాయికి చేరింది.

సురక్ష

కడుపులోని బిడ్డ జాగ్రత్త

కర్నాటక ప్రభుత్వం అల్ట్రాస్కానింగ్ గదిలోకి గర్భిణులతో పాటు వచ్చే అటెండర్స్‌ను నిషేధిస్తూ సర్క్యులర్ తెచ్చింది. ప్రతి తల్లి తన కడుపులో ఉన్న బిడ్డ ఆడపిల్లైనా మగపిల్లాడైనా కనడానికి సిద్ధంగా ఉంటుంది. కాని అటెండర్స్ రూపంలో వచ్చే అయినవాళ్లు అల్ట్రాస్కానింగ్‌ని వీడియో తీసి లింగ నిర్ధారణ చేయిస్తున్నారు. తర్వాత అబార్షన్ చేయిస్తున్నారు. ఇలా ఎన్ని రాష్ట్రాల్లో జరుగుతున్నదో. కర్నాటక మేలుకొంది. ఆ రాష్ట్రం తీసుకున్న మరిన్ని జాగ్రత్తలు...

హర్యాణలోని జాట్ కుటుంబంలో యోగ్యుడైన వరునికి తగిన వధువు కోసం 3000 కిలోమీటర్ల దూరంలో కూడా వెతుకుతున్నారనే వార్తలు వస్తున్నా కానీ ఆడశిశువుల భ్రూణ హత్యల విషయంలో మనలో మార్పు రావడం లేదు. 2000 సంవత్సరం నుంచి 2019లోపు మన దేశంలో 90 లక్షల మంది ఆడపిల్లలు భ్రూణ హత్యల ద్వారా పుట్టకుండానే మరణించారని ఒక అధ్యయనం చెబుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం కశ్మీర్, హర్యాణ, మహారాష్ట్ర రాష్ట్రాలలో 120 మంది అబ్బాయిలకు 100 మంది అమ్మాయిలే ఉన్నారు. లెక్కలు ఇంత భయపెడుతున్నా నేటికీ



ఒడిశా, కర్నాటక రాష్ట్రాలలో లింగ నిర్ధారణ జరిపించి మరీ ఆడపిల్లలను ఛిద్రం చేస్తూనే ఉన్నారు. తాజాగా కర్నాటకలోని మాండ్య జిల్లాలో ఈ రాకెట్ ఒకటి బట్టబయలు కావడంతో ప్రభుత్వం మేల్కొని కొత్త నియమ నిబంధనలు తెచ్చింది.

చట్టం ఉన్నా...

ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయగ్నొస్టిక్ టెక్నిక్స్ (పిసిపిఎన్‌డిటి) యాక్ట్ 1994 (లింగ నిర్ధారణ నిషేధ చట్టం) కింద లింగ నిర్ధారణ చేయించేవారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా ఉన్నా కొందరు ఎప్పటికప్పుడు దొంగదారులు కనిపెడుతూనే ఉన్నారు. ఇటీవల కర్నాటకలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలులో భాగంగా రేడియాలజిస్ట్‌లు, గైనకాలజిస్ట్‌లతో ఒక వర్క్‌షాప్ జరిగినప్పుడు వారు కొన్ని విషయాలు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

- పేషెంట్లతో పాటు అటెండర్ల పేరుతో బంధువులు లోపలికి వస్తున్నారు.
- అల్ట్రాసౌండ్ స్కానింగ్‌ను తమ మొబైల్ కెమెరాలలో బంధిస్తున్నారు.
- సింగపూర్, థాయ్‌లాండ్, దుబాయ్ దేశాలలో లింగ నిర్ధారణ నేరం కాదు.
- కొందరు ఒక రాకెట్‌లాగా ఏర్పడి ఆ వీడియోలను ఈ దేశాలలోని వైద్యులకు పంపి లింగ నిర్ధారణ చేయిస్తున్నారు. ఆ తర్వాత అబార్షన్లు చేయిస్తున్నారు.

తాజాగా మాండ్యాలో ఇలాంటి రాకెట్‌ను పోలీసులు ఛేదించి పట్టుకున్నారు. ఇంకా విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కర్నాటక ప్రభుత్వం వెంటనే కొత్త సర్క్యులర్ జారీ చేసింది.

ఇతరులు రాకూడదు

- అల్ట్రాసౌండ్ గదిలోకి గర్భిణితో పాటు ఇకపై అటెండర్లు రాకూడదు. వారికి ప్రవేశం లేదు.
- గర్భిణి తన అల్ట్రాసౌండ్ పరీక్షను గమనించేలాగా గతంలో అడిషనల్ స్క్రీన్ గదిలో ఉంచేవారు. ఇకపై ఆ స్క్రీన్ ఉండదు. అంటే గర్భిణి తన అల్ట్రాసౌండ్ పరీక్షను చూడటానికి అనుమతి లేదు. ఎందుకంటే కొందరు రేడియాలజిస్ట్‌లు డబ్బుకు కక్కుర్తి పడి ఒక మాట గాని, చర్యగాని లేకుండా గర్భిణులకు అర్థమయ్యేలా పాయింటర్‌తో చూపుతున్నారు.

ఆడపిల్లలు చదువులో అద్భుతంగా రాణిస్తున్నా, ఉపాధి అవకాశాలు పొందుతున్నా, క్రీడల్లో పతకాలతో మెరుస్తున్నా, రాజకీయ పదవులు పొందుతున్నా, ఉన్నతోద్యోగాలు చేస్తున్నా ఇంకా 'కొడుకు' కావాలనే కోరిక చాలామంది తల్లిదండ్రులను పీడిస్తోంది. ఆ భావజాలం నుంచి కొద్దిగా బయటడినా చాలా మంది ఆడపిల్లలు బతికిపోతారు. బంగారు దేశాన్ని నిర్మిస్తారు.

బ్యూటిప్స్

తేనీటి సౌందర్యం



టీ డికాషన్‌ని ఉపయోగించడం వల్ల వేసవి తాపం నుంచి చర్మాన్ని, శిరోజాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అయితే, ఇందుకు తేయాకులను మాత్రమే ఉపయోగిస్తే సరైన ఫలితం లభిస్తుంది.

- చల్లారిన అరకప్పు టీ డికాషన్‌లో రెండు టీ స్పూన్ల బియ్యప్పిండి, అర టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, 20 నిమిషాలు ఆరనివ్వాలి. శుభ్రపరుచుకోవడానికి ముందు కొన్ని నీళ్లు ముఖం మీద చల్లి, వేళ్లతో వలయాకారంగా రుద్దాలి.
- టీ డికాషన్‌లో ఐస్ క్యూబ్ వేసి, ఆ నీటిని ముఖానికి స్ప్రే చేసుకొని, కాసేపు సేదతీరాలి. ఎండ బారిన పడి ఇంటికి వచ్చినప్పుడు ఇలా చేయడం వల్ల కమిలిన చర్మం తిరిగి పూర్వపు స్థితికి చేరుకుంటుంది.
- టబ్ బాత్ చేసేటప్పుడు కొన్ని తేయాకులు నీటిలో వేసి, అరగంట తర్వాత స్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల ఎండవల్ల కలిగిన అలసట నుంచి చర్మం విశ్రాంతి పొందుతుంది.
- జుట్టు పొడిబారి నిర్జీవంగా మారితే తలస్నానం చేసిన తర్వాత టీ డికాషన్‌తో కడగాలి. కండిషనర్‌లా ఉపయోగపడుతుంది.

బాడీ షేమింగ్‌కి ఫిట్‌నెస్ మంత్ర

'కొన్నిసార్లు మీరు భయపడకుండా వేసే ఒక్క అడుగు జీవన గమనాన్ని మెరుగ్గా మార్చేస్తుంది' అంటుంది 24 ఏళ్ల అశ్వతి ప్రహ్లాదన్. బాడీ షేమింగ్‌ను ఎదుర్కొన్న అశ్వతి ఇప్పుడు మిస్ కేరళ ఫిజిక్‌గా టైటిల్ గెలుచుకుంది.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి ఫిట్‌నెస్ కోచ్‌గా మారింది. సోషల్ మీడియాలో లక్షమంది ఫాలోవర్లతో బిజీగా ఉంది. ఎగతాళి మాటల నుంచి పట్టిన పట్టుదల ఎందరిలోనో స్ఫూర్తిని కలిగిస్తుంది.

''ఒక దశలో నేను బాగా బరువు తగ్గిపోయాను. కారణం కొన్నిరోజుల పాటు వేధించిన జ్వరం. ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గిపోయింది. సరైన ఆహారం తీసుకోలేక బాగా సన్నబడిపోయాను. కొన్నాళ్ల పాటు ఆ సమస్యను జనాల నుంచి సూటిపోటి మాటల ద్వారా ఎదుర్కొన్నాను. 'ఎందుకు ఇంత సన్నగా ఉన్నావు? ఇంట్లో వాళ్లు ఫుడ్ పెట్టడం లేదా? గాలికి ఎగిరిపోయేలా ఉన్నావ్?'.. లాంటి మాటలను ఎదురుగానే అనేవాళ్లు. చుట్టుపక్కల, బంధువులు రకరకాల సలహాలు ఇచ్చేవారు. దాంతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినా ఉద్యోగానికి వెళ్లాలంటే భయంగా ఉండేది. అమ్మాయిలు లావుగా ఉన్నా, మరీ సన్నగా ఉన్నా ఈ సమాజంలో జనం ఏదో ఒకటి అంటూ బాధించాలనే చూస్తారు. ఇదో పెద్ద మానసిక ఒత్తిడిగా అనిపించేది. ఈ ట్రామా నుంచి ఎలాగైనా బయట పడాలనుకున్నాను. అప్పుడే ఫిట్‌నెస్‌లోకి రావాలనుకున్నాను.

నన్ను నేను ప్రేమించుకుంటూ..

జనాలు ఎగతాళిగా అనే బాడీ షేమింగ్ వ్యాఖ్యలను అసలు పట్టించుకోవడం మానేశాను. నన్ను నేను ప్రేమించుకోవడం ప్రారంభించాను. నాలా బాధపడేవారికి ఓ రోల్ మోడల్‌గా ఉండాలని జిమ్‌లో చేరాను. నా జీవనశైలిలో మార్పులు చేసుకున్నాను. సమతుల ఆహారంపై అవగాహన పెంచుకుని, దానిని తీసుకోవడంపై శ్రద్ధ పెట్టాను. ఫలితంగా ఆరోగ్యంలో మార్పు వచ్చింది. మానసిక ఆరోగ్యమూ మెరుగుపడింది. దీంతో ఫిట్‌నెస్‌లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నాను. ఎంతగా సాధన చేస్తూ వచ్చానంటే బాడీ షేమింగ్ బాధితులకు కేరళ ఫిజిక్ టైటిల్‌ను అంకితం చేసేవరకు నన్ను నేను మలుచుకోవడంలో ఒక తపస్సే చేశాను.

విమర్శలను పట్టించుకోను..

'ఏమీ చేయని వ్యక్తులే జీవితంలో ఏదైనా సాధించాలని ప్రయత్నించేవారిని నిందిస్తుంటారు. మొదట్లో వారి మాటలకు నేను కూడా ఎదురు సమాధానం చెప్పేదాన్ని. ఇప్పటికి కూడా సోషల్‌మీడియాలో ఫేక్ అకౌంట్లతో నన్ను నిందించే ప్రయత్నం చేసేవాళ్లున్నారు.

టైటిల్ సాధనతో ఇప్పుడు చెడు వ్యాఖ్యలు చేసేవారి సంఖ్య తగ్గి, పాజిటివ్ కామెంట్స్ హైలైట్ అవుతున్నాయి.

అపోహలు వద్దు

మగవారిలాగా తమ శరీరం కూడా కండలు తిరిగిపోతుందేమోనన్న భయంతో వర్కవుట్ చేయని మహిళలు ఉన్నారు. మరోవైపు వర్కవుట్ చేస్తూ బరువు తగ్గుతూ ఉంటే, ఏదైనా కారణాలతో మధ్యలో జిమ్ ఆపేస్తే మళ్లీ బరువు పెరుగుతామేమోనని అంటూ ఆందోళనపడేవారూ ఉన్నారు. ఇలాంటి అపోహలు మన సమాజంలో చాలా ఉన్నాయి. అలాంటి వారికి చెప్పేది ఏమిటంటే 'జిమ్‌లోనూ, ఇంట్లోనూ మంచి జీవనశైలిని పాటించకుండా ఈ దురభిప్రాయాలకు రావద్దు. ముప్పై ఏళ్లు దాటిన తర్వాత మహిళల్లో ఎముకల సాంద్రత తగ్గి, కండరాలు ద్రవ్యరాశిని కోల్పోయే అవకాశం ఉంది. కండర నిర్మాణానికి వ్యాయామం ఆరోగ్యకరం. కండరాలను నిర్మించడం అంటే శరీరం అంతా కండరాలుగా మారడం కాదు. ఫిట్‌నెస్‌ను ప్రాక్టీస్ చేస్తే మానసిక, శారీరక ఆరోగ్యంతో సహా అన్ని విషయాలు మెరుగుపడతాయి. అందుకని, అపోహలతో ఫిట్‌నెస్‌లోకి రావద్దు. మన వెనక జనాలు ఏదో మాట్లాడుతున్నారని వెనకడుగు వేయద్దు. నా విషయంలో అయితే ఈ రంగంలోకి రావడమే మంచి నిర్ణయం అయింది. అందరూ ఈ విషయాన్ని అంగీకరించారు కూడా. మన శరీరానికి సరైన రీతిలో శిక్షణ ఇస్తే మరిన్ని అద్భుతాలను మనమే చేయచ్చు.

నా జీతం మొత్తం...

ఏడాదిన్నర క్రితం ఇన్ఫోపార్క్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడే ఫిట్‌నెస్‌ను కూడా నా జీవితంలో భాగం చేసుకున్నాను. కానీ, పనిలో చాలా ఒత్తిడి ఉండేది. ఒక్కోసారి తొమ్మిది నుంచి పదకొండు గంటలు పని చేయాల్సి వచ్చేది. ఆ పనుల మధ్య జిమ్‌కి వెళ్లేందుకు సమయం దొరకడం కష్టమైంది. కుటుంబం నుంచి మద్దతు లభించింది. నా ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంది మా అమ్మ. కానీ... వృత్తిని, అభిరుచిని కలపడం చాలా కష్టం అని గ్రహించాను. ఫిట్‌నెస్‌లో పోషకాహారం ఖరీదైనది. నాకు ఉద్యోగం ఉంది కాబట్టి నా అభిరుచిని కొనసాగించగలిగాను. జీతం నా పోషణకు సరిపోయేది. కొన్ని సప్లిమెంట్ల కోసం స్పాన్సర్లను వెతికాను. కానీ, లభించలేదు. దీంతో నా జీతం మొత్తం నా పౌష్టికాహారం కోసమే కేటాయించే దాన్ని. మరి ప్రయోజనాలు ఏంటి అని ఎవరైనా అడగచ్చు. ఈ రంగంలోకి వచ్చినతర్వాత నేనెవరో నాకు అర్థమైంది. పాటలు పాడతాను, డ్యాన్స్ చేస్తాను. ఫిట్‌నెస్ నన్ను ఎప్పుడూ ఉల్లాసంగా ఉంచుతుంది. ఇది విజయంగా భావిస్తున్నాను. అంతేకాదు, నా ఫిట్‌నెస్ ఇప్పుడు నా ఆదాయ వనరు కూడా. అందుకే, ఉద్యోగాన్ని మానేసి బిజీ ట్రైనర్‌గా మారిపోయాను' అంటూ తన ఫిట్‌నెస్ రహస్యాలను చెబుతుంది అశ్వతి.




అశ్వతి ప్రహ్లాదన్







గుకేశ్-డింగ్ లిరెన్ ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌కు భారత్ బిడ్

ఈ ఏడాది నవంబర్-డిసెంబర్‌లలో జరిగే పురుషుల ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్ ఆతిథ్య హక్కుల కోసం అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) బిడ్ దాఖలు చేసింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ధ్రువీకరించింది. ఇప్పటికైతే కేవలం భారత్ నుంచి మాత్రమే బిడ్‌ను అందుకున్నామని, మరో రెండు రోజుల్లో బిడ్‌ను స్వీకరించే తుది గడువు ముగియనుందని ఫిడే సీఈఓ ఎమిల్ సుతోవ్‌స్కీ తెలిపారు. ఏప్రిల్‌లో టొరంటోలో జరిగిన క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం ప్రస్తుత విశ్వ విజేత డింగ్ లిరెన్ (చైనా)తో తలపడతాడు. ఒకవేళ భారత్‌కు ఆతిథ్య హక్కులు లభిస్తే 14 రౌండ్‌లపాటు జరిగే ఈ మెగా మ్యాచ్‌కు నవంబర్ 20 నుంచి డిసెంబర్ 15 వరకు గుకేశ్ సొంత నగరం చెన్నై వేదికగా నిలుస్తుంది. ఈ మెగా మ్యాచ్‌ను నిర్వహించేందుకు సింగపూర్ కూడా సుముఖంగా ఉందని, అయితే అధికారికంగా ఇంకా బిడ్ దాఖలు చేయలేదని తెలిసింది.





టైటిల్ వేట మొదలైంది...

జొకోవిచ్ శుభారంభం ● రెండో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంపియన్

పారిస్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గాలనే లక్ష్యంతో ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) తొలి రౌండ్‌ను దాటాడు. ప్రపంచ 142వ ర్యాంకర్ హెర్బర్ట్ (ఫ్రాన్స్)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 2 గంటల 31 నిమిషాల్లో 6-4, 7-6 (7/3), 6-4తో గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసిన జొకోవిచ్ నెట్ వద్ద 19 పాయింట్లు గెలిచాడు. మరోవైపు మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఆరో సీడ్ రుబ్లెవ్ (రష్యా), తొమ్మిదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో అల్‌కరాజ్, సిట్సిపాస్‌లకు తమ ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదురు కాగా... రుబ్లెవ్ వరుస సెట్‌లలో విజయాన్ని అందుకున్నాడు. అల్‌కరాజ్ 3 గంటల 9 నిమిషాల్లో 6-3, 6-4, 2-6, 6-2తో జెస్పర్ డి జాంగ్ (నెదర్లాండ్స్)పై, సిట్సిపాస్ 2 గంటల 43 నిమిషాల్లో 6-3, 6-2, 6-7 (2/7), 6-4తో అల్టమెయిర్ (జర్మనీ)పై, రుబ్లెవ్ 2 గంటల 1 నిమిషంలో 6-3, 6-4, 6-3తో పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్)పై గెలుపొందారు. జాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో అల్‌కరాజ్ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేశాడు. 35 విన్నర్స్ కొట్టిన ఈ స్పెయిన్ స్టార్ ఏకంగా 47 అనవసర తప్పిదాలు చేయడం గమనార్హం. మహిళల సింగిల్స్‌లో 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ సోఫియా కెనిన్ (అమెరికా), ఎనిమిదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సోఫియా 6-3, 6-3తో 21వ సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్)పై, ఎనిమిదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6-3, 1-6, 6-3తో కామిలా ఒసోరియో (కొలంబియా)పై గెలుపొందారు. భారీ వర్షాల కారణంగా బుధవారం ఏకంగా 23 సింగిల్స్ మ్యాచ్‌లను వాయిదా వేశారు.



పారిస్ ఒలింపిక్స్‌కు విజయం దూరంలో...

క్వార్టర్ ఫైనల్లో అంకుశిత, నిశాంత్





బ్యాంకాక్: పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లను ఖరారు చేసుకోవడానికి భారత బాక్సర్లు అంకుశిత బోరో (60 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) విజయం దూరంలో నిలిచారు. వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో వీరిద్దరూ తమ విభాగాల్లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ యూత్ మాజీ చాంపియన్ అంకుశిత 4-1తో ఆసియా చాంపియన్ రిమా వాలోసెంకో (కజకిస్తాన్)పై నెగ్గగా... నిశాంత్ 5-0తో పీరాపట్ యెసుంగ్‌నోయెన్ (థాయ్‌లాండ్)ను చిత్తు చేశాడు. మహిళల 66 కేజీల విభాగంలో అరుంధతి 5-0తో స్టెఫానీ పీనీరో (ప్యూర్టోరికో)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. అయితే పురుషుల ప్లస్ 92 కేజీల విభాగం తొలి రౌండ్ బౌట్‌లో నరేందర్ 2-3తో గిల్మర్ కాంగో (ఈక్వెడోర్) చేతిలో ఓడిపోయాడు. నేడు జరిగే పురుషుల 57 కేజీల ప్రిక్వార్టర్ ఫైనల్లో బతుహాన్ సిఫ్టిసి (టర్కీ)తో సచిన్ సివాచ్... 51 కేజీల రెండో రౌండ్‌లో రూయిజ్ (మెక్సికో)తో అమిత్.. 92 కేజీల రెండో రౌండ్‌లో లూయిస్ (వెనిజులా)తో సంజీత్... మహిళల 57 కేజీల రెండో రౌండ్‌లో మసాతి (అజర్‌బైజాన్)తో జైస్మిన్ తలపడతారు.

సింధు, ప్రణయ్ ముందుకు...

సింగపూర్: భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21-12, 22-20తో ప్రపంచ 21వ ర్యాంకర్ లినె హొమార్క్ జార్స్‌ఫెల్ట్ (డెన్మార్క్)పై... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రణయ్ 21-9, 18-21, 21-9తో జూలియన్ కరాగి (బెల్జియం)పై గెలుపొందారు. భారత్‌కే చెందిన అగ్రశ్రేణి ఆటగాళ్లు లక్ష్య సేన్, కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. లక్ష్య సేన్ 13-21, 21-16, 13-21తో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడిపోగా... కొడాయ్ నరోకా (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ తొలి గేమ్‌ను 14-21తో కోల్పోయి రెండో గేమ్‌లో 3-11తో వెనుకబడ్డాడు. ఈ దశలో మోకాలి గాయంతో శ్రీకాంత్ వైదొలిగాడు. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో కరోలినా మారిన్ (స్పెయిన్)తో సింధు; కెంటా నిషిమోటో (జపాన్)తో ప్రణయ్ తలపడతారు. ముఖాముఖి రికార్డులో సింధు 5-11తో, ప్రణయ్ 2-3తో వెనుకబడి ఉన్నారు.



అశ్విని-తనీషా జోడీ ఓటమి

పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ ఈ టోర్నీలో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. పొలీనా బురోవా-యెవెనియా (ఉక్రెయిన్) జంటతో జరిగిన మ్యాచ్‌లో అశ్విని-తనీషా ద్వయం 21-18, 19-21, 19-21తో ఓడిపోయింది. పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జంట 21-7, 21-14తో చెంగ్ యు పె-సన్ యు సింగ్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో బేక్ హా నా-లీ సో హీ (దక్షిణ కొరియా)లతో గాయత్రి-ట్రెసా పోటీపడతారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సుమీత్ రెడ్డి-సిక్కి రెడ్డి (భారత్) జోడీ 18-21, 19-21తో గో సూన్ హువాట్-లాయ్ షెవోన్ జేమీ (మలేసియా) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది.

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, లక్ష్య సేన్

● ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి-ట్రెసా జోడీ



వైశాలి చేతిలో హంపి ఓటమి

స్టావెంజర్: నార్వే చెస్ మహిళల టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్, భారత స్టార్ కోనేరు హంపి తొలి ఓటమిని చవిచూసింది. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలితో జరిగిన రెండో రౌండ్ క్లాసికల్ గేమ్‌లో హంపి 44 ఎత్తుల్లో ఓడిపోయింది. క్లాసికల్ గేమ్‌లో నెగ్గినందుకు వైశాలికి మూడు పాయింట్లు లభించాయి. ఆరుగురు మేటి గ్రాండ్‌మాస్టర్లు పోటీ పడుతున్న ఈ టోర్నీలో రెండో రౌండ్ తర్వాత వైశాలి నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఇదే టోర్నీ పురుషుల విభాగంలో వైశాలి తమ్ముడు ప్రజ్ఞానందకు రెండో రౌండ్ అర్మగెడాన్ గేమ్‌లో ఓటమి ఎదురైంది. ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్‌తో జరిగిన రెండో రౌండ్ క్లాసికల్ గేమ్‌ను ప్రజ్ఞానంద 31 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఇద్దరి మధ్య విజేతను నిర్ణయించడానికి అర్మగెడాన్ గేమ్ నిర్వహించగా తెల్ల పావులతో ఆడిన డింగ్ లిరెన్ 51 ఎత్తుల్లో ప్రజ్ఞానందను ఓడించాడు.



కసరత్తులు షురూ!

మైదానంలో శ్రమించిన భారత క్రికెటర్లు ● తొలి రోజు ఫిట్‌నెస్‌పై దృష్టి

న్యూయార్క్: టి20 ప్రపంచకప్ వేటలో అమెరికా గడ్డపై అడుగు పెట్టిన భారత క్రికెట్ బృందం మొదటి రోజు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి మినహా మిగతా ఆటగాళ్లంతా ఇందులో పాల్గొన్నారు. కోహ్లి ఇంకా న్యూయార్క్ చేరుకోలేదు. టీమిండియా స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్ ఈ ట్రయినింగ్ సెషన్‌ను పర్యవేక్షించారు. ముఖ్యంగా భారత్‌తో పోలిస్తే పూర్తిగా భిన్నమైన యూఎస్ వాతావరణానికి అలవాటు పడటంపై ఆటగాళ్లు దృష్టి సారించారు. ఐపీఎల్ కారణంగా మన క్రికెటర్లంతా 90 శాతంకి పైగా డే అండ్ నైట్ మ్యాచ్‌లే ఆడారు. కానీ వరల్డ్ కప్ లీగ్ దశలో అమెరికా వేదికపై జట్టు 25-27 డిగ్రీల వాతావరణంలో అన్నీ డే మ్యాచ్‌లే (ఉదయం గం. 10:30 నుంచి) ఆడబోతోంది. ట్రయినింగ్ సెషన్‌లో క్రికెటర్లు స్వల్ప జాగింగ్, రన్నింగ్‌తో పాటు కొద్దిసేపు ఫుట్‌బాల్ ఆడారు. 'టైమ్ జోన్‌కు అలవాటు పడటం అన్నింటికంటే ముఖ్యం. జట్టు సభ్యులంతా కూడా దాదాపు రెండున్నర నెలల తర్వాత మళ్లీ ఒక్క చోటికి చేరారు. వారి ఫిట్‌నెస్ స్థితి ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దానిని బట్టి ముమ్ముందు రోజుల కోసం ప్రణాళికలు రూపొందిస్తాను' అని దేశాయ్ చెప్పారు. వాతావరణం చాలా బాగుందని హార్దిక్ పాండ్యా అభిప్రాయపడగా... న్యూయార్క్‌లో తొలిసారి ఆడనుండటం పట్ల రవీంద్ర జడేజా ఉత్సాహంగా ఉన్నాడు. నగర శివార్లలోని నాసా కౌంటీ స్టేడియంలో జూన్ 1న బంగ్లాదేశ్‌తో భారత్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుంది. ఈ మ్యాచ్ వరకైనా కోహ్లి జట్టుతో చేరతాడా లేదా అనే విషయంలో బీసీసీఐ స్పష్టతనివ్వలేదు. జూన్ 5న అసలు పోరులో ఐర్లాండ్‌తో భారత్ ఆడుతుంది.



న్యూయార్క్‌లో '2023 ఐసీసీ టి20 ప్లేయర్ ఆఫ్ ఇయర్' అవార్డుతో సూర్యకుమార్

'నంబర్‌వన్' ర్యాంక్‌తో ప్రపంచకప్‌లోకి...

టి20 ప్రపంచకప్ టోర్నీలో టీమిండియా నంబర్‌వన్ ర్యాంకర్‌గా బరిలోకి దిగనుంది. బుధవారం విడుదల చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టి20 ర్యాంకింగ్స్‌లో భారత్ 264 రేటింగ్ పాయింట్లతో తమ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. రెండుసార్లు టి20 వరల్డ్ చాంపియన్ వెస్టిండీస్ రెండు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌కు చేరుకుంది. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను వెస్టిండీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చేయడంతో ఆ జట్టు ర్యాంక్ మెరుగైంది. దక్షిణాఫ్రికా నాలుగు స్థానాలు పడిపోయి ఏడో ర్యాంక్‌లో నిలిచింది.

సినిమా



ఈ కథలో ఆ పదాలు ఆకట్టుకున్నాయి

- ఆనంద్ దేవరకొండ

"మనుషుల్లో భయం, అత్యాశ, కుట్ర అనే లక్షణాలుంటాయి. అవి కొందరి జీవితాలను ఎలా ప్రభావితం చేశాయి? అనేది 'గం.. గం..గణేశా'లో చూపిస్తున్నాం. వినాయకుడి విగ్రహం చుట్టూ జరిగే కథ ఇది. ఆ విగ్రహం దక్కించుకోడానికి కొందరు ప్రయత్నాలు చేస్తుంటారు. ఆ విగ్రహంలో అంత విలువైనది ఏముంది? అనేది చిత్ర కథాంశం'' అన్నారు హీరో ఆనంద్ దేవరకొండ. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన చిత్రం 'గం..గం..గణేశా'. వంశీ కారుమంచి, కేదార్ సెలగంశెట్టి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతున్న సందర్భంగా ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''ఉదయ్ 'గం..గం..గణేశా' స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఆ కథలోని అత్యాశ, భయం, కుట్ర అనే మూడు పదాలు నన్ను అట్రాక్ట్ చేశాయి. 'స్వామి రారా' వంటి క్రైమ్ కామెడీ మూవీ చూసినప్పుడు తెలుగులో ఇలాంటి చిత్రాలు మరికొన్ని చేయొచ్చు కదా? అనిపించేది. 'గం..గం..గణేశా' అలాగే ఉంటుంది. ఇందులో నేను ఫుల్ ఎనర్జిటిక్‌గా ఉంటాను. ఇటీవల ఫ్యామిలీ, యూత్ ఆడియన్స్ కోసం 'గం..గం..గణేశా' షోస్ వేశాం. వాళ్ల స్పందన చూసి మాకు సినిమా విజయంపై మరింత నమ్మకం వచ్చింది. ఈ కథలో పదిహేను కీలక పాత్రలు ఉంటాయి. ఇంతమందితో నటన రాబట్టుకోవడంలో ఒక కొత్త డైరెక్టర్‌గా ఉదయ్ సక్సెస్ అయ్యాడు. నా ఫ్రెండ్స్ కేదార్, వంశీ ఈ సినిమా కోసం చాలా సపోర్ట్ చేశారు. రష్మికా మందన్న మా ఫ్యామిలీ ఫ్రెండ్.. అందుకే నా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి వచ్చారు. నాకు రా యాక్షన్ మూవీస్ చేయడం ఇష్టం. వినోద్ అనంతోజు దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో చేస్తున్న మూవీ అలానే ఉంటుంది. ప్రస్తుతం 'డ్యూయెట్' సినిమాలో నటిస్తున్నాను'' అన్నారు.



● అల్లు అర్జున్, రష్మికా మందన్న

సంటోడే నా సామీ...

పుష్పరాజ్, శ్రీ వల్లి కలిసి చిందేస్తే థియేటర్ విజిల్స్‌తో మోత మోగిపోద్ది. 'పుష్ప' సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో ఇదే కనిపించింది. మళ్లీ అదే జోష్‌తో వస్తున్నారు ఈ ఇద్దరూ. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీ వల్లి పాత్రలో రష్మికా మందన్న నటిస్తున్న చిత్రం 'పుష్ప: ది రూల్'. 'పుష్ప' ఫ్రాంచైజీ మలి భాగం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. ఈ సినిమా నుంచి 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాడే నా సామీ..' అనే పాట లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో ఈ పాటను విడుదల చేశారు. 'వీడు మొరటోడు అని వాళ్లు వీళ్లు.. ఎన్నెన్ని అన్న పసిపిల్లవాడు నా వాడు..' అంటూ మొదలయ్యే ఈ పాట 'మెత్తానీ పత్తి పువ్వులా మరి సంటోడే నా సామీ...' అంటూ సాగుతుంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా శ్రేయా ఘోషల్ పాడారు. ఫాహద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్.



ట్రైలర్‌లో ఉన్నవి సినిమాలో వినిపించవు

- డైరెక్టర్ కృష్ణ చైతన్య

"'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' నాకు చాలా ఇష్టమైన కథ. ఆ ఇష్టంతోనే ఈ సినిమా చేశాను. నేను అనుకున్న భావోద్వేగాలు తెరమీద చక్కగా పలికాయి. ముఖ్యంగా పతాక సన్నివేశాలు ప్రేక్షకుల మనసుల్ని హత్తుకుంటాయి'' అని డైరెక్టర్ కృష్ణ చైతన్య అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. కృష్ణ చైతన్య దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ– ''ఛల్ మోహన్‌రంగ' తర్వాత దర్శకుడిగా నా ప్లానింగ్‌లో ఉన్న చిత్రాలు ఆలస్యం అవటంతో మరీ గ్యాప్ ఎక్కువైపోతోందనే భయం నాలో మొదలైంది. ఆ విషయాన్ని మా గురువు త్రివిక్రమ్‌గారితో పంచుకున్నాను. ఆయన సూచనతో విశ్వక్ సేన్‌కి 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' కథ చెప్పాను. తనకి నచ్చడంతో ఈ సినిమా ప్రయాణం మొదలైంది. గోదావరి అనగానే కొబ్బరి చెట్లు చూపించి అంతా ప్రశాంతంగా ఉంది అన్నట్టుగా సినిమాల్లో చూపిస్తారు. కానీ మా ప్రాంతంలో కూడా మనుషులను బట్టి నేరాలు జరుగుతాయి. ఆ ఆలోచన నుంచి పుట్టిన కల్పిత కథ ఇది. అయితే పూర్తిగా గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు. విశ్వక్ సేన్ కోసం కథలో ఎటువంటి మార్పులు చేయలేదు. ట్రైలర్‌లో కొన్ని సంభాషణలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అయితే సినిమాలో మాత్రం ఆ పదాలు వినిపించవు. కుటుంబమంతా కలిసి చూడొచ్చు. చినబాబు, నాగవంశీ, సాయి సౌజన్యగార్లు ప్రేక్షకులకు మంచి సినిమాని అందించాలని భావించే నిర్మాతలు. నేహా శెట్టి, అంజలి పాత్రలు ఆకట్టుకుంటాయి'' అన్నారు.

ప్రేక్షకులు అప్పుడే హీరోలా చూస్తారు

- కార్తికేయ గుమ్మకొండ



"ఇప్పుడున్న నా ఇమేజ్‌కు సరైన మూవీ 'భజే వాయు వేగం'. హీరో అంటే మనం పోల్చుకునేలా ఉండాలి. అతనికి ఎదురయ్యే సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు ఎంచుకునే మార్గాలు స్ఫూర్తిదాయకంగా ఉండాలని భావిస్తాను. అప్పుడే అతన్ని ప్రేక్షకులు హీరోలా చూస్తారు. హీరోగా నాకు కొంచెం సామాజిక బాధ్యత ఉంది. అది నేను చేసే పాత్రల మీద రిఫ్లెక్ట్ అవుతుంటుంది'' అని హీరో కార్తికేయ గుమ్మకొండ అన్నారు. ప్రశాంత్ రెడ్డి దర్శకత్వంలో కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన చిత్రం 'భజే వాయు వేగం'. 'హ్యాపీ డేస్' ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్ర చేశారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రం రేపు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ– ''లాక్ డౌన్ టైమ్‌లో 'భజే వాయు వేగం' కథ వినిపించాడు ప్రశాంత్ రెడ్డి. ఈ కథ వినగానే కార్తీ హీరోగా నటించిన 'ఖైదీ' టైపులో ఊహించుకున్నాను. 'ఖైదీ'లో ఉన్నంత యాక్షన్ ఉండదు కానీ, హీరోయిజం, యాక్షన్, సెంటిమెంట్, ఎమోషన్, లవ్ అన్నీ కుదిరాయి. యూవీ క్రియేషన్స్‌లో సినిమా అనగానే మేకింగ్, పోస్ట్ ప్రొడక్షన్, రిలీజ్ అన్నీ సరిగ్గా జరుగుతాయనే నమ్మకం వచ్చింది. 'భజే వాయు వేగం'లో ఫస్టాఫ్‌లో ఎమోషన్ ఉన్న హీరోను చూస్తారు. సెకండాఫ్‌లో ఆ ఎమోషన్ వల్ల ఎలాంటి స్టెప్స్ తీసుకున్నాడనేది చూపించాం. ఈ సినిమా క్రెడిట్ వంద శాతం దర్శకుడిదే. హీరోగా చేస్తున్న టైమ్‌లో 'గ్యాంగ్ లీడర్, వలిమై' చిత్రాల్లో విలన్‌గా నటించినందుకు ఫీల్ అవడం లేదు. ఆ సినిమాల ద్వారా నాకు అమెరికాలో, తమిళ పరిశ్రమలో గుర్తింపు దక్కింది. 'గ్యాంగ్ లీడర్' తర్వాత తెలుగు, తమిళంలో విలన్‌గా చాన్స్ వచ్చినా పాత్రలు నచ్చక చేయలేదు. నా తర్వాతి సినిమాని కూడా ప్రశాంత్ రెడ్డితోనే చేయాలనుకుంటున్నాను'' అన్నారు.




● సిద్ధార్థ్, రకుల్ ప్రీత్

నీ రాకతో జయం...

'చెంగల్వ చేయందేనా... చెలికాని చేరేనా..' అంటూ సాగే 'చెంగల్వ..' పాట 'భారతీయుడు 2' చిత్రంలోనిది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇండియన్' ('భారతీయుడు'). ఈ సినిమాకు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' కమల్‌హాసన్–శంకర్ కాంబినేషన్‌లోనే రూపొందాయి. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్‌పై సుభాస్కరన్ నిర్మించిన 'ఇండియన్ 2' తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా జూలై 12న విడుదల కానుంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రల్లో నటించారు. ఇక 'ఇండియన్ 2' సినిమాలోని మరో పాటను బుధవారం తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల చేశారు. 'చెంగల్వ చేయందేనా...' అంటూ మొదలయ్యే తెలుగు వెర్షన్ పాట 'సమీప దూరాల నిర్ణయం.. గతాల గాయం.. ఈవేళ నీ రాకతో జయం నిరంతరాయం..' అంటూ సాగుతుంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను అబ్బి, శ్రుతికా సముద్రాల పాడారు. సిద్ధార్థ్, రకుల్ కాంబినేషన్‌లో ఈ పాట ఉంటుంది. ఇక 'ఇండియన్ 2' విడుదలైన ఆరు నెలలకు 'ఇండియన్ 3' విడుదలయ్యే అవకాశం ఉంది.


లక్కీ భాస్కర్ డేట్ ఫిక్స్

థియేటర్స్‌లోకి 'లక్కీ భాస్కర్' వచ్చే సమయం ఖరారైంది. దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా పీరియాడికల్ ఫిల్మ్ 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమాను ఈ ఏడాది సెప్టెంబరు 27న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఈ సినిమా కొత్త పోస్టర్‌ను కూడా బుధవారం విడుదల చేశారు మేకర్స్. ''1980- 1990 కాలంలో నాటి బొంబాయి (ముంబై) నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఓ సాధారణ బ్యాంకు క్యాషియర్ అయిన లక్కీ భాస్కర్ అసాధారణ ప్రయణాన్ని ఆసక్తికరంగా చూపిస్తున్నాం. ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: నిమిష్ రవి.



● దుల్కర్ సల్మాన్

'గాడ్ ఫాదర్' నిర్మాత ఆల్బర్ట్ కన్నుమూత



హాలీవుడ్ ప్రముఖ నిర్మాత ఆల్బర్ట్ ఎస్. రడ్డీ (94) కన్నుమూశారు. లాస్ ఏంజెల్స్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఇటీవల తుది శ్వాస విడిచారు. కెనడాలోని మాంట్రియల్‌లో ఆయన 1930 మార్చి 28న జన్మించారు. పెరిగింది, చదువుకున్నది అమెరికాలో. డిగ్రీ పూర్తి చేశాక సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 1965లో వచ్చిన హాలీవుడ్ చిత్రం 'వైల్డ్ సీడ్'కు ఓ నిర్మాత ఆల్బర్ట్. ఇదే సినిమాకు ఆయన లిరిక్స్ అందించారు. ఆ తర్వాత హాలీవుడ్ ఐకానిక్ హిట్ ఫిల్మ్ 'గాడ్‌ఫాదర్' (1972)తో నిర్మాతగా మంచి పేరు సంపాదించుకున్నారు. 2004లో విడుదలైన ఆస్కార్ విన్నింగ్ ఫిల్మ్ 'మిలియన్ డాలర్ బేబీ'కూ ఆల్బర్ట్ ఓ నిర్మాత. ఉత్తమ చిత్రం విభాగంలో 'ఆస్కార్' అవార్డు అందుకున్న రెండు సినిమా (గాడ్‌ఫాదర్, మిలియన్ డాలర్ బేబీ)లను నిర్మించిన అతి కొద్దిమంది హాలీవుడ్ నిర్మాతల్లో ఆల్బర్ట్ ఒకరు. 'ది గాడ్‌ఫాదర్ సాగ', 'మ్యారీడ్ టు ఏ స్ట్రేంజర్' వంటి టీవీ సిరీస్‌లనూ నిర్మించారు. 'హోగన్స్ హీరోస్' అనే టెలివిజన్ షోకు కో రైటర్‌గా ఆల్బర్ట్‌కు మంచి పేరొచ్చింది. ఇక నటుడిగా పొలిటికల్ కామెడీ డ్రామా 'రన్నింగ్ మేట్స్' (2000) చేశారు. 'క్రై మాచో' (2021) తర్వాత ఆల్బర్ట్ మరో సినిమా నిర్మించలేదు. ఆల్బర్ట్ మృతిపట్ల పలువురు హాలీవుడ్ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
668	183
74,503	22,705

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,977	▽	4
డోజోన్స్	38,509	▽	344
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,183	▽	71
డాక్స్	18,473	▽	205
షాంఘై	3,111	△	1
నికాయ్	38,557	△	298

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,413	△	222
బంగారం (99.5 స్వచ్ఛత)	72,123	△	221
వెండి (కేజీ)	94,118	△	3,307

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.82	83.84
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.97	107.52
€	యూరో	ఒకటి	89.22	91.58
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	52.39	53.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.45	56.38
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.63	63.86
SAR	సౌదీ రియాల్	[illegible]	21.34	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.81	23.58
¥	చైనా యువాన్	[illegible]	10.36	12.36

వెండే బంగారమాయెగా..

- న్యూఢిల్లీల్లో కేజీ రూ.97,100
- కొన్ని నగరాల్లో రూ.లక్ష పైకి..!



న్యూఢిల్లీ: వెండి ధర దేశంలో సరికొత్త రికార్డులను చూస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో కేజీ ధర క్రితం ముగింపుతో పోల్చితే బుధవారం రూ.1,150 ఎగిసి రూ.97,100కి ఎగసింది. ఆర్థిక రాజధాని ముంబైలో రూ. 3,707 ఎగసి రూ.94,118కి చేరింది. చెన్నైసహా పలు నగరాలు, కొన్ని పట్టణాల స్పాట్ మార్కెట్లలో ఏకంగా రూ.లక్ష దాటినట్లు కూడా సమాచారం అందుతోంది. గడచిన పది రోజుల్లో వెండి ధర దాదాపు రూ.11,000 పెరిగింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం భయాలు విలువైన మెటల్స్ ధర పెరగడానికి కారణమన్న విశ్లేషణలు ఉన్నాయి. ఢిల్లీలో పసిడి 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత ధర క్రితంతో పోల్చితే రూ.250 పెరిగి రూ.73,200కు చేరగా, ముంబైలో రూ.222 ఎగసి రూ.72,413కి చేరింది.

హైదరాబాద్‌లో కంట్రోల్‌ఎస్ మూడో డేటా సెంటర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంట్రోల్‌ఎస్ డేటా సెంటర్స్ సంస్థ హైదరాబాద్‌లో తాజాగా మూడో డేటాసెంటర్‌ను ప్రారంభించింది. బీఎస్ఈ ఎండీ సుందరరామన్ రామమూర్తి దీన్ని ప్రారంభించారు. సుమారు రూ. 500 కోట్లు పైగా ఇన్వెస్ట్‌మెంట్‌తో దీన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

రేపు 2023-24 జీడీపీ గణాంకాలు



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో 6.1-6.7% పరిధిలో వృద్ధి చెందుతుందని పలువురు ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7.6-7.8% శ్రేణిలో ఉంటుంది. ఆర్‌బీఐ అంచనా 7 శాతంగా ఉంది. క్యూ4 సహా మొత్తం ఆర్థిక సంవత్సరం వృద్ధి గణాంకాలు 31వ తేదీన విడుదల కానున్నాయి.

భారత్ అవుట్‌లుక్.. పాజిటివ్

- 'స్టేబుల్' నుంచి అప్‌గ్రేడ్ చేసిన ఎస్అండ్‌పీ
- మరో రెండేళ్లలో రేటింగ్ కూడా అప్‌గ్రేడ్ చేసే వీలుందని సూచన
- ఆర్థిక నిర్వహణ బాగుందని విశ్లేషణ
- 6 బ్యాంకుల బ్యాంకుల రేటింగ్ అవుట్‌లుక్ కూడా పెంపు



న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు భరోసా ఇస్తూ పది సంవత్సరాల విరామం తర్వాత అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం- ఎస్అండ్‌పీ గ్లోబల్ భారతదేశ సార్వభౌమ (సావరిన్) రేటింగ్ అవుట్‌లుక్‌ను 'స్టేబుల్' నుంచి 'పాజిటివ్'కు మెరుగుపరిచింది. గత ఐదు సంవత్సరాలలో ప్రభుత్వ వ్యయ నిర్వహణ బాగుందని, ద్రవ్య విధానాల్లో సంస్కరణలు విస్తృత స్థాయిలో కొనసాగుతాయని భావిస్తున్నామని ఎస్అండ్‌పీ ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అంతా బాగుంటే రెండేళ్లలో సావరిన్ రేటింగ్‌నూ పెంచుతామని పేర్కొంది. కాగా, ఆరు బ్యాంకులు- ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండియన్ బ్యాంకులు సహా ప్రభుత్వ రంగ సంస్థలు ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, పవర్‌గ్రిడ్‌లకు సంబంధించీ ఇదే అవుట్‌లుక్ పెంపు నిర్ణయం తీసుకోవడం జరిగింది.

ఇమామీ లాభం ప్లస్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఇమామీ క్యూ4 నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 147 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం 7 శాతం పుంజుకుని రూ. 891 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు 7 శాతం పెరిగి రూ. 680 కోట్లను తాకాయి.పూర్తి ఏడాదికి ఇమామీ కన్సాలిడేటెడ్ నికర లాభం 15 శాతంపైగా ఎగసి రూ. 724 కోట్లను దాటింది. 2022-23లో రూ. 627 కోట్ల లాభం ప్రకటించింది. మొత్తం ఆదాయం 5 శాతం బలపడి రూ. 3,578 కోట్లను తాకింది.

ఇమామీ షేరు ఎన్ఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 516 వద్ద ముగిసింది.

టాటా స్టీల్ డీలా



న్యూఢిల్లీ: టాటా స్టీల్ క్యూ4 కన్సాలిడేటెడ్ నికర లాభం 65 శాతం క్షీణించి రూ. 555 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం రూ. 63,131 కోట్ల నుంచి రూ. 58,863 కోట్లకు తగ్గింది. వ్యయాలు సైతం రూ. 59,918 కోట్ల నుంచి రూ. 56,497 కోట్లకు వెనకడుగు వేశాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 3.6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

నిధుల సమీకరణ

దశలవారీగా లేదా ఒకేసారి ఎన్‌సీడీల జారీ(ప్రయివేట్ ప్లేస్‌మెంట్) ద్వారా రూ. 3,000 కోట్ల సమీకరణకు బోర్డు అనుమతించినట్లు టాటా స్టీల్ పేర్కొంది. అంతేకాకుండా ఈ ఏడాది విదేశీ అనుబంధ సంస్థ టీ స్టీల్ హోల్డింగ్స్ ఈక్విటీ షేర్ల సబ్‌స్క్రిప్షన్ ద్వారా 211 కోట్ల డాలర్ల(రూ. 17,405 కోట్లు) పెట్టుబడులు అందించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలియజేసింది. నిధులను విదేశీ అనుబంధ సంస్థల రుణ చెల్లింపులకు వినియోగించనుంది. టాటా స్టీల్ యూకే పునర్వ్యవస్థీకరణ వ్యయాలకు సైతం నిధులు వెచ్చించనుంది. టీఎస్‌హెచ్‌పీలో కంపెనీకిగల 56.5 కోట్ల డాలర్ల(రూ. 4,661 కోట్లు) రుణ సెక్యూరిటీలను ఈక్విటీగా మార్పు చేసేందుకు బోర్డు ఓకే చెప్పింది. మార్చికల్లా కంపెనీ నికర రుణ భారం రూ. 77,550 కోట్లుగా నమోదైంది.

టాటా స్టీల్ షేరు బీఎస్ఈలో స్వల్ప నష్టంతో రూ. 174 వద్ద ముగిసింది.

ఇంటీరియర్స్‌కూ ఎల్అండ్‌టీ ఫైనాన్స్ రుణాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గృహరుణాలతో పాటు ఇంటీరియర్స్, గృహోపకరణాల అవసరాల కోసం కూడా రుణాలు అందిస్తున్నట్లు ఎల్అండ్‌టీ ఫైనాన్స్ (ఎల్‌టీఎఫ్) సీఈవో (అర్బన్ ఫైనాన్స్) సంజయ్ గర్యాలీ తెలిపారు. తీసుకున్న గృహ రుణం మొత్తంలో 15 శాతం వరకూ, పదేళ్ల దాకా కాలవ్యవధితో వీటిని పొందవచ్చని పేర్కొన్నారు. వడ్డీ రేటు 10.75 శాతం నుంచి ఉంటుందని బుధవారమిక్కడ జరిగిన కార్యక్రమంలో చెప్పారు. గృహ రుణాలను సమగ్రంగా అందించేందుకు ది కంప్లీట్ హోమ్ లోన్ సర్వీసులను ప్రవేశపెట్టినట్లు గర్యాలీ వివరించారు. డిజిటల్ విధానంలో రుణ ప్రక్రియ, ప్రత్యేక రిలేషన్‌షిప్ మేనేజర్, హోమ్ డెకార్ ఫైనాన్స్ అన్నీ ఇందులో ఉంటాయన్నారు. తమ గృహ రుణాల పోర్ట్‌ఫోలియో రూ. 18,500 కోట్లుగా ఉండగా, ఇందులో తెలంగాణ వాటా దాదాపు ఆరు శాతం ఉందని పేర్కొన్నారు. రిటైల్ రుణాల పోర్ట్‌ఫోలియో రూ. 80,037 కోట్లని తెలిపారు.



సంజయ్ గర్యాలీ

డల్లాస్‌లో జోయాలుక్కాస్ షోరూం ప్రారంభం

ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ అమెరికాలోని డల్లాస్‌లో మొదటి షోరూంను ప్రారంభించింది. కొత్త షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ జాయ్ అలుక్కాస్, కౌంటీ కమీషనర్ సుసాన్ ఫ్లెచర్, డిప్యూటీ మేయర్ టోనీ సింగ్, కౌన్సిల్ విమెన్ టమ్మీ మీనర్ షగెస్‌లు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



రామ్‌కీ లాభం రూ.57 కోట్లు



వై.ఆర్.నాగరాజ, ఎన్.ఎస్.రావు (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ నిర్మాణ సంస్థ రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.1,077 కోట్ల నుంచి రూ.57 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా 15 శాతం ఎగసి రూ.138 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.601 కోట్ల నుంచి రూ.624 కోట్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నికరలాభం రూ.1,140 కోట్ల నుంచి రూ.308 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.1,866 కోట్ల నుంచి రూ.2,320 కోట్లను తాకింది. ఈపీఎస్ రూ.44.48 నమోదైంది. ఆర్డర్ బుక్ ప్రస్తుతం రూ.9,300 కోట్లు ఉందని రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ వై.ఆర్.నాగరాజ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. ఈ ప్రాజెక్టులు 3 నుంచి 15 ఏళ్లలో పూర్తి అవుతాయని చెప్పారు. కొత్త ప్రాజెక్టుల కోసం ఆరు నెలల్లో రూ.280 కోట్ల నిధులు సమీకరిస్తామని రామ్‌కీ గ్రూప్ సీఎఫ్‌వో ఎన్.ఎస్.రావు వెల్లడించారు.

రామ్‌కీ షేరు ధర బీఎస్ఈలో బుధవారం 7.66% ఎగసి రూ.527.85 వద్ద స్థిరపడింది.

ప్రెస్టీజ్ ఎస్టేట్స్ లాభం డౌన్

న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 70 శాతం పతనమై రూ. 140 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో రూ. 468 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,938 కోట్ల నుంచి రూ. 2,236 కోట్లకు క్షీణించింది. అయితే పూర్తి ఏడాదికి కంపెనీ నికర లాభం రూ. 942 కోట్ల నుంచి రూ. 1,374 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం ఆదాయం రూ. 8,772 కోట్ల నుంచి రూ. 9,425 కోట్లకు బలపడింది. ఈ కాలంలో 22 శాతం వృద్ధితో రూ. 11,954 కోట్ల వసూళ్లు అందుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. 34 శాతం అధికంగా 20.25 మిలియన్ చదరపు అడుగులమేర అమ్మకాల బుకింగ్స్ పరిమాణాన్ని సాధించినట్లు పేర్కొంది. ఒక్కో చదరపు అడుగుకు రూ. 10,410 చొప్పున సగటు ధరను సాధించినట్లు తెలియజేసింది. ఇవన్నీ రికార్డులని పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ప్రెస్టీజ్ ఎస్టేట్స్ షేరు బీఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 1,506 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-5-2024 ఫామ్ ధర...

విశాఖ	500-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.65

75,000 దిగువకు సెన్సెక్స్

- 23,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు
- సూచీలకు నాలుగో రోజూ నష్టాలే



ముంబై: స్టాక్ సూచీలు నాలుగోరోజూ నష్టాలతో ముగిశాయి. మే డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు ముగింపు(గురువారం), ఏడో విడత పోలింగ్ (శనివారం), సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడి(జూన్ 4న)కి ఇన్వెస్టర్లు ముందు అప్రమత్తత వహించారు. భారీ అమ్మకాలతో సెన్సెక్స్ 668 పాయింట్లు పతనమై 74,503 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 183 పాయింట్లు నష్టపోయి 22,705 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 716 పాయింట్లు తగ్గి 74,455 వద్ద, నిఫ్టీ 203 పాయింట్లు పతనమై 22,685 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి.

- అదానీ గ్రూప్ కొనుగోలు చేస్తుందన్న వార్తలతో పేటీఎం షేర్ బీఎస్ఈలో 5% పెరిగి రూ.359కి చేరింది. కాగా, ఈ వార్తలను ఆ సంస్థలూ ఖండించాయి.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఐఎన్‌లో 44 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(నిన్).. టెక్నికల్ అసిస్టెంట్, ల్యాబొరేటరీ అటెండెంట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 44
» పోస్టుల వివరాలు: టెక్నికల్ అసిస్టెంట్-8 పోస్టులు, టెక్నీషియన్ 1-14 పోస్టులు, ల్యాబొరేటరీ అటెండెంట్ 1- 22 పోస్టులు
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: టెక్నికల్ అసిస్టెంట్‌కు నెలకు రూ.35,400 -రూ.1,12,400, టెక్నీషియన్‌కు రూ.19,900 - రూ.63,200, ల్యాబొరేటరీ అటెండెంట్‌కు రూ.18,000 -రూ.56,900 వేతనం అందుతుంది.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: 23.05.2024
» ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 16.06.2024
» పరీక్ష తేది: 2024, జూలైలో ఉంటుంది.
» వెబ్‌సైట్: www.nin.res.in

ఎన్ఐసీహెచ్‌డీఆర్‌లో కొలువులు

న్యూఢిల్లీలోని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ (ఎన్ఐసీహెచ్‌డీఆర్).. ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 4
» పోస్టుల వివరాలు: సైంటిస్ట్-సి: 01, అసిస్టెంట్(మల్టీపర్పస్): 01, టెక్నీషియన్-సి(ల్యాబ్ టెక్నీషియన్): 01, డేటా ఎంట్రీ ఆపరేటర్: 01.
» అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు సైంటిస్ట్ పోస్టుకు రూ.67,000, అసిస్టెంట్‌కు రూ.31,000, టెక్నీషియన్‌కు రూ.20,000, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.20,000.
» జాబ్ లొకేషన్: పంజాబ్, న్యూఢిల్లీ.
» దరఖాస్తు చివరి తేదీ: 16.06.2024
» దరఖాస్తు పంపాల్సిన చిరునామా: nip.mrhrubhunga@gmail.com
» వెబ్‌సైట్: https://main.icmr.nic.in

హైదరాబాద్ డిఫెన్స్ ల్యాబొరేటరీస్ స్కూల్‌లో 15 పోస్టులు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ ల్యాబొరేటరీస్ స్కూల్, ఆర్‌సీఐ.. అడ్‌హాక్ ప్రాతిపదికన టీచింగ్, అడ్మిన్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15

పోస్టుల వివరాలు

» ప్రైమరీ టీచర్ (మ్యాథ్స్, ఈవీఎస్, ఇంగ్లిష్, మ్యూజిక్, డ్యాన్స్): 05 పోస్టులు.
» ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) (మ్యాథ్స్, సోషల్, ఇంగ్లిష్, ఫిజిక్స్, సంస్కృతం): 05 పోస్టులు.
» ల్యాబ్ ఇంచార్జ్ (ఏటీఎల్ ల్యాబ్ ఇంచార్జ్)-01 పోస్టు, ఏఐ టీచర్ (టీజీటీ)-01 పోస్టు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్-02పోస్టులు, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్-01 పోస్టు.
» అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమా, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, టెట్, సీటెట్ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ భాష, కంప్యూటర్ పరిజ్ఞానం, పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్/ పోస్టు/కొరియర్ ద్వారా దరఖాస్తులు స్కూలు చిరునామాకు పంపించాలి.
చిరునామా: డిఫెన్స్ ల్యాబొరేటరీస్ స్కూల్, విజ్ఞానకంచ, ఆర్‌సీఐ, హైదరాబాద్.
» దరఖాస్తు చివరి తేదీ:10.06.2024
» వెబ్‌సైట్: https://www.dlsrci.in

ప్రిలిమ్స్.. సక్సెస్ మంత్ర!

సివిల్ సర్వీసెస్ పరీక్ష.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత స్థాయి పోస్టుల భర్తీకి నిర్వహించే ఎంపిక ప్రక్రియ! మూడు దశల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో.. అత్యంత కీలకమైంది తొలిదశ ప్రిలిమినరీ పరీక్ష! దేశవ్యాప్తంగా దాదాపు అయిదు లక్షల మంది హాజరయ్యే ప్రిలిమ్స్‌లో నెగ్గితేనే.. మలిదశ మెయిన్స్‌కు అర్హత లభిస్తుంది!! సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2024కు సంబంధించి తొలిదశ ప్రిలిమ్స్ జూన్ 16న జరుగనుంది. ఈ నేపథ్యంలో.. ప్రిలిమ్స్‌లో విజయానికి ప్రిపరేషన్ టిప్స్..



» జూన్ 16న సివిల్స్-2024 ప్రిలిమ్స్
» రెండు పేపర్లుగా 400 మార్కులకు పరీక్ష
» అయిదు లక్షల మంది హాజరయ్యే అవకాశం
» రివిజన్‌తోపాటు ప్రాక్టీస్ కీలకమంటున్న నిపుణులు
» ఈజీ టు డిఫికల్ట్ విధానంలో సమాధానాలు ఇవ్వాలి.

సివిల్స్ ప్రిలిమ్స్‌ను వడపోత పరీక్ష అని చెప్పొచ్చు. ఎందుకంటే.. దాదాపు ఐదు లక్షల మంది పరీక్ష రాస్తే.. అందులో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపికయ్యే వారి సంఖ్య సుమారు 13 వేలు మాత్రమే! లక్షల మంది పోటీ పడే ప్రిలిమ్స్ నుంచి వేల సంఖ్యలోని జాబితాలో చోటు సంపాదించి మలి దశకు అర్హత పొందాలంటే.. అత్యంత మెరుగైన ప్రిపరేషన్‌తోనే సాధ్యం.

21 సర్వీసులు.. 1,056 పోస్టులు

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 ద్వారా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా మొత్తం 21 సర్వీసుల్లో 1,056 పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రిలిమినరీ పరీక్షను జూన్ 16న నిర్వహించనున్నారు. ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు.. పేపర్ 1 జనరల్ స్టడీస్(200 మార్కులు), పేపర్ 2 సీశాట్(200 మార్కులు) ఉంటాయి. పేపర్1లో వచ్చిన మార్కులు మెయిన్స్‌కు ఎంపికలో అత్యంత కీలకం. పేపర్ 2 అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో 33 శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది.

సమయ పాలన

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో అభ్యర్థులు నిత్యం పునశ్చరణ, ప్రాక్టీస్‌తో తమ ప్రిపరేషన్‌కు మరింత పదును పెట్టుకోవాలి. మెయిన్స్ ఎంపికకు నిర్ణయాత్మకమైన పేపర్-1 జనరల్ స్టడీస్‌కు సంబంధించి అన్ని ముఖ్యమైన టాపిక్స్‌ను తరచూ రివైజ్ చేసుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. అందుకోసం ప్రతి రోజు కనీసం ఎనిమిది నుంచి పది గంటల సమయం కేటాయించుకోవాలి. దీంతోపాటు ప్రతి వారం సెల్ఫ్ టెస్టులు, మాక్ టెస్టులు రాయడం ఉపయుక్తంగా ఉంటుంది.

సమకాలీనంతో సమ్మిళితం

ఇటీవల కాలంలో ప్రిలిమ్స్ ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ సమ్మిళితంగా ఉంటున్నాయి. కాబట్టి ఈ ఏడాది మే ముందు నుంచి ఏడాది, ఏడాదిన్నర కాలంలోని ముఖ్యమైన కరెంట్ ఈవెంట్స్‌పై దృష్టిపెట్టాలి. వాటిని సంబంధిత సబ్జెక్ట్ స్టాటిక్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. నేపథ్యం, ప్రభావం, ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అంచనా..వంటి అంశాలను విశ్లేషించుకుంటూ చదవాలి.

రెండుసార్లు పునశ్చరణ

ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు ఆయా సబ్జెక్టులను అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. ఎకానమీ-పాలిటీ, ఎకానమీ-జాగ్రఫీ, జాగ్రఫీ-ఎకాలజీ; జాగ్రఫీ-సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే.. ప్రిపరేషన్ పరంగా కొంత సమయం కలిసొస్తుంది. ప్రిలిమ్స్ అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకొని ఉంటారు. కాబట్టి ప్రస్తుత సమయంలో వారు పూర్తిగా రివిజన్‌కు సమయం కేటాయించుకోవాలి. కనీసం రెండుసార్లు రివిజన్ చేసేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఎక్కువ మంది అభ్యర్థులు రివిజన్‌కు ఉపకరించే విధంగా ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్‌నోట్స్ సిద్ధం చేసుకుంటారు.

సొంత నోట్స్ ఎంతో మేలు

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు సబ్జెక్ట్ వారీగా ముఖ్యాంశాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇందుకోసం ఇప్పటికే వారు రాసుకున్న సొంత నోట్స్‌ను అనుసరించాలి. ప్రిపరేషన్‌లో భాగంగా సొంతంగా రాసుకున్న నోట్స్‌ను తరచూ తిరగేస్తూ ఉండాలి. ముఖ్య టాపిక్స్‌కు సంబంధించి హెడ్డింగ్స్, సబ్ హెడ్డింగ్స్, అండర్‌లైన్ చేసినవి సాధ్యమైనన్ని ఎక్కువసార్లు చూసుకోవాలి. ఇది ఆయా అంశాలను పరీక్ష సందర్భంగా అవసరమైన సమయంలో గుర్తుకు తెచ్చుకునేందుకు దోహదపడుతుంది. వీటితోపాటు సొంతంగా సిద్ధం చేసుకున్న నోట్స్‌లో ఉన్న ఫ్లోచార్ట్స్, న్యూమానిక్స్, గ్రాఫ్స్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ సబ్జెక్ట్‌ను ఆకళింపు చేసుకునే ప్రయత్నం చేయాలి.

ప్రీవియస్ పేపర్స్ ప్రాక్టీస్

గత ఐదారేళ్ల పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయాలి. ప్రీవియస్ కొశ్చన్ పేపర్స్ ప్రాక్టీస్ సందర్భంగా ప్రశ్న-సమాధానం గుర్తించడం అనే విధానం కాకుండా.. ఆయా ప్రశ్నలకు ఆప్షన్లుగా ఇచ్చిన వాటిపైనా దృష్టిపెట్టాలి. ఎందుకంటే.. సివిల్స్ ప్రిలిమ్స్‌లో ప్రశ్నలు యథాతథంగా రిపీట్ అవడం అరుదుగా జరుగుతుంది. కాని థీమ్స్‌పై ప్రశ్నలు రిపీట్ అవుతుంటాయి. ఉదాహరణకు ఇన్‌ఫ్లేషన్, ఫారిన్ ట్రేడ్, ఎల్ నినో, లా నినో, బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ యాక్ట్స్‌పై వివిధ కోణాల్లో ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

కీలక గణాంకాలు

హిస్టరీ నుంచి ఎకానమీ వరకూ ఆయా సబ్జెక్టుల్లో కొన్ని కీలకమైన గణాంకాలను గుర్తుపెట్టుకోవడం మేలు చేస్తుంది. ఇందుకోసం ప్రతి సబ్జెక్టు నుంచి ముఖ్యమైన ఫ్యాక్టువల్ డేటాను గుర్తించి.. ఒక ప్రత్యేకమైన నోట్స్‌లో రాసుకుని.. వాటిని పరీక్షకు ముందు రోజు వరకూ తరచూ రివైజ్ చేసుకుంటూ ఉండాలి. ఇలా అత్యంత కీలకమైన డేటాను గుర్తుపెట్టుకోవడం ప్రశ్నలకు సమాధానాలను గుర్తించడంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు హిస్టరీలో ముఖ్యమైన రాజ వంశం, వారి పాలనా కాలం, రాజధాని, ముఖ్యమైన రాజు పాలనాకాలం; ముఖ్యమైన రచయితలు-వారి గ్రంథాలు; ముఖ్యమైన విదేశీ యాత్రికులు-వారు ఎవరి కాలంలో భారత్‌ను సందర్శించారు,వారి గ్రంథాలు వంటివి. ఎకానమీలో రెపో రేటు,తాజా వృద్ధి రేట్లు, ఫిజికల్ డిఫిసిటీ, కరెంట్ అకౌంట్ డెఫిసిటీ, విదేశీ మారక ద్రవ్య నిల్వలు, ఆహార ధాన్యాల ఉత్పత్తి తదితరాలను తప్పనిసరిగా గుర్తుపెట్టుకోవాలి.

పేపర్-2కు కూడా సమయం

అభ్యర్థులు పేపర్-2 (సీశాట్)కు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. దీన్ని అర్హత పేపర్ గానే పేర్కొన్నప్పటికీ.. ఇందులో 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్-1 మూల్యాంకన చేస్తారు. కాబట్టి పేపర్-2లో అర్హత మార్కులు సాధించేందుకు ప్రధానంగా మ్యాథమెటిక్స్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

సబ్జెక్ట్ వారీగా దృష్టిపెట్టాల్సినవి

కరెంట్ అఫైర్స్-ఎన్విరాన్‌మెంట్

అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న గాజా-ఇజ్రాయెల్, రష్యా-ఉక్రెయిన్, నాటో, జీ 20, బ్రిక్స్, దక్షిణ చైనా సముద్రం, ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రం, బ్లాక్ సీ, చాబహార్ పోర్టు వంటి వాటితోపాటు ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ నివేదికలు, వివిధ అంతర్జాతీయ ఇండెక్స్‌లపైనా దృష్టిపెట్టాలి. అదేవిధంగా వార్తల్లో ఉన్న జంతువులు, పక్షులు.. ఉదాహరణకు చీతా, టైగర్, డాల్ఫిన్, ఎలిఫెంట్, గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ వంటి వాటి ఐయూసీఎన్' స్టేటస్, అవి ఏ ప్రాంతంలో ఎక్కువగా లభిస్తాయి, వాటి సెన్సెస్,వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, పర్యావరణ చట్టాలు వంటి వాటిని తెలుసుకోవాలి. ప్రభుత్వ స్కీమ్స్‌తోపాటు కరెంట్ అఫైర్స్‌కు సోర్స్ కూడా ముఖ్యమే. ఇందుకోసం పీఐబీతోపాటు ప్రామాణిక దిన పత్రికలు, వెబ్‌సైట్స్‌ను అనుసరించవచ్చు.

చరిత్ర

ప్రాచీన చరిత్రలో సింధూ నాగరికత, బౌద్ధం, జైన మతాలు, మౌర్యులు, గుప్తుల పాలన, శాసనాలు, ముఖ్య ఘట్టాలపై దృష్టి పెట్టాలి. అదేవిధంగా మధ్యయుగంలో ఢిల్లీ సుల్తానులు, మొఘలులు, విజయనగర సామ్రాజ్యం కాలంలో జరిగిన కీలక పరిణామాలను గుర్తుపెట్టుకోవాలి. ప్రాచీన, మధ్య యుగ చరిత్రకు సంబంధించి సాహిత్యం, కళలు, మత ఉద్యమాలు, రాజకీయ-సామాజిక-ఆర్థిక అంశాలను రివైజ్ చేసుకోవాలి. ఆధునిక చరిత్రలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన -పరిపాలన విధానాలు; బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు-ఉద్యమాలు(గిరిజన ఉద్యమాలు, రైతాంగ ఉద్యమాలు), సంస్కరణోద్యమాలు, జాతీయోద్యమం-గాంధీ,అంబేద్కర్ తదితరుల పాత్ర కీలకంగా నిలుస్తాయి.

పాలిటీ

రాజ్యాంగ పరిషత్, రాజ్యాంగ సవరణ ప్రక్రియ, పీఠిక, తాజా రాజ్యాంగ సవరణలు -వాటికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణలు, పార్లమెంటరీ వ్యవస్థ, రాష్ట్రపతి, గవర్నర్, పార్లమెంట్, రాష్ట్ర శాసన సభలు, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్నికల కమిషన్, ఆర్థిక కమిషన్, అటార్నీ జనరల్, అడ్వకేట్ జనరల్, పంచాయతీ రాజ్ వ్యవస్థ, 5వ, 6వ షెడ్యూల్స్, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, మహిళా రిజర్వేషన్ చట్టం, తాజా సుప్రీం కోర్టు తీర్పులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానాలపైనా దృష్టిపెట్టాలి.

సైన్స్ అండ్ టెక్నాలజీ


గత ఏడాది కాలంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు; చంద్రయాన్-3, గగన్‌యాన్, ఆదిత్య,రక్షణ రంగంలో కొత్త మిస్సైల్స్ ప్రయోగాలు, అగ్ని-5, ఇటీవల కాలంలో సంభవిస్తున్న వ్యాధులు-కారకాలు, వ్యాక్సిన్‌లు, సైబర్ సెక్యూరిటీ,ఏఐ,సోలార్ ఎనర్జీ,సస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్స్, బయోఫ్యూయల్స్ తదితరాల గురించి తెలుసుకోవాలి.

జాగ్రఫీ


ఇండియా ఫిజికల్ ఫీచర్స్, నదీ వ్యవస్థ, భౌగోళిక వనరులు, సహజ వనరులు, సెన్సెస్ 2011, సార వ్యవస్థ, భూమి అంతర్ నిర్మాణం, శిలలు, రుతుపవనాలు, పంటలు, ప్రపంచ పవనాలు, చక్రవాతాలు, భూకంపాలు, సునామీలు, మన దేశ పరిస్థితుల నేపథ్యంలో నగరీకరణ, జలాల పంపిణీ-వివాదాలు, ముఖ్యమైన ప్రాజెక్టులు వంటి వాటిపై దృష్టిపెట్టాలి.



పాలపుంత చిత్రం ఎప్పుడూ అద్భుతంగానే ఉంటుంది. ఇదిగో ఈ చిత్రంలాగా.. ఈ ఫొటోను న్యూజిలాండ్‌లోని మౌంట్ కుక్ నేషనల్ పార్కులో కవన్ చే అనే ఫొటోగ్రాఫర్ తీశారు.



- ఆధారం : యూరోమానిటర్ ఇంటర్నేషనల్ నివేదిక



భారత్‌లో ఏఐ జోరు

కృత్రిమ మేధను వినియోగిస్తున్న 92% మంది

ఏఐని వినియోగించుకోవడంపై 91% మంది ఆసక్తి

ఏఐ స్కిల్క్ ఉన్నవారి వైపే 80% కంపెనీల మొగ్గు

మైక్రోసాఫ్ట్-లింక్డ్‌ఇన్ వర్క్ ట్రెండ్ ఇండెక్స్ సర్వే వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సాంకేతికత - విజ్ఞానం ఆధారిత ఉద్యోగాలు చేస్తున్న భారతీయుల్లో 92 శాతం మంది కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ను వినియోగిస్తున్నారని వర్క్ ట్రెండ్ ఇండెక్స్-2024 అధ్యయనం వెల్లడించింది. మైక్రోసాఫ్ట్, లింక్డ్ ఇన్ సంయుక్త ఆధ్వర్యంలో 31 దేశాలలో 31 వేల మందిపై చేపట్టిన ఈ సర్వే పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దాదాపు 91 శాతం మంది భారతీయులు తమ రంగాల్లో పోటీతత్వాన్ని కొనసాగించడానికి కృత్రిమ మేధను వినియోగించుకోవడానికి ఆసక్తిగా ఉండగా, 54 శాతం మంది ఉద్యోగులు వారి ఆఫీస్‌లలో ఏఐ ప్రణాళికలు లేకపోవడం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు.

ఏఐ అవగాహన లేకపోతే కష్టమే

రానున్న ఏడాదిలో ఏఐ ఉద్యోగస్తుల ప్రతిభ, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపించనుంది. భారత్‌లోని 75 శాతం సంస్థలు ఏఐ పరిజ్ఞానంపై అవగాహన లేనివారికి ఉద్యోగాలు ఇవ్వడానికి నిరాసక్తతతో ఉన్నాయని, ఈ సూచీ ప్రపంచ వ్యాప్తంగా 66 శాతం మాత్రమే ఉందని సర్వే ఫలితాలు తెలిపాయి. ముఖ్యంగా 80 శాతం సంస్థలు అనుభవం తక్కువ ఉన్నా సరే ఏఐ స్కిల్స్ ఉంటే చాలని, అవి లేకుండా ఎంత అనుభవమున్నా తమకొద్దని తేల్చి చెబుతున్నాయి. మరోవైపు దేశంలోని ఉద్యోగుల్లో ఏఐ వినియోగంపై ఆసక్తి విపరీతంగా పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా 75 శాతం మంది ఉద్యోగులు వారి వృత్తిలో భాగంగా ఏఐని వాడుతుంటే, భారత్‌లో 92 శాతం మంది వినియోగించడం విశేషం. ఇది సమయాన్ని ఆదా చేయడంతో పాటు సృజనాత్మకతను పెంచుతుందని భారతీయులు భావిస్తున్నారు. ఏఐ వినియోగం కోసం 72 శాతం మంది భారతీయులు సొంత ఏఐ సాధనాలను ఆఫీస్‌లకు తీసుకువెళుతుండటం గమనార్హం. ముఖ్యంగా ఉద్యోగులు కోపైలెట్, చాట్ జీపీటీ వంటి ఏఐ నైపుణ్యాలను వారి ప్రొఫైల్‌లో జోడిస్తూ అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్నారు. ఈ స్కిల్స్ పెంచుకునే క్రమంలో లింక్డ్ ఇన్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ నేర్చుకునే వారి సంఖ్య 160 శాతం పెరిగిందని అధ్యయనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ ఇండియా-దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ ఇరినా ఘోష్ మాట్లాడుతూ.. 'వర్క్ ట్రెండ్ ఇండెక్స్ అందించిన సమాచారం ప్రకారం కృత్రిమ మేధ అన్ని రంగాల్లో భాగమైంది. ముఖ్యంగా భారత్ ఇతర దేశాల కన్నా అత్యధికంగా 92 శాతం ఆసక్తి రేటుతో ఉత్తమ భవిష్యత్‌ను నిర్మించుకుంటోంది. ఇది దాదాపు అన్ని రంగాలలో విస్తరించడం గమనించాం..' అని చెప్పారు.

రూ.3.5 కోట్లు కాజేసిన కస్టోడియన్

- ఏటీఎంలలో జమ చేయాల్సిన నగదు చోరీ
- సీసీఎస్‌లో ఫిర్యాదు.. నిందితుని కోసం గాలింపు

సాక్షి, హైదరాబాద్: ఏటీఎంలలో జమ చేయాల్సిన నగదును స్వాహా చేసిన కస్టోడియన్‌పై సీసీఎస్‌లో బుధవారం కేసు నమోదైంది. సికింద్రాబాద్‌కు చెందిన సెక్యూర్ వాల్యూ ఇండియా లిమిటెడ్(ఎస్‌వీఐఎల్) సంస్థ రెగ్యులర్‌గా ఎస్‌బీఐ ఏటీఎంలలో నగదు జమ చేయిస్తుంది. ఇదే సంస్థలో ఫరూఖ్‌నగర్‌కు చెందిన తల్లపల్లె లక్ష్మణ్‌బాబు కస్టోడియన్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు కేటాయించిన రూట్ నంబర్ 79 (ఎల్బీనగర్)లో మొత్తం 33 ఏటీఎంలు ఉన్నాయి. ఆ రూట్‌లో ప్రతి రోజూ వెహికిల్‌తో వెళ్లి నగదు జమ చేయాల్సి ఉండగా, ఏకంగా రూ.3.5 కోట్లు కాజేశాడు. కానీ ఏటీఎంల్లో జమ చేసినట్లు సంస్థ రికార్డుల్లో చూపించాడు. ఆ సంస్థ తరఫున రెగ్యులర్ ఆడిటింగ్‌లో భాగంగా ఆడిటర్ రాజేష్ ఈ నెల 23న రూట్ నంబర్ 79లో తనిఖీకి సిద్ధమయ్యాడు. ఆయన వెంట వెళ్లాల్సిన కస్టోడియన్ లక్ష్మణ్‌బాబు అల్పాహారం కోసమని వెళ్లి పరారయ్యాడు. కొన్ని గంటలు ఎదురు చూసినా ఎంతకీ రాలేదు. ఆయన ఫోన్‌తో పాటు ఆయన భార్య ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అయింది. దీంతో ఆడిటర్ 23, 24 తేదీల్లో ఆ రూట్లో ఉన్న ఏటీఎంలను ఆడిట్ చేశారు. 27 ఏటీఎంలలో ఉండాల్సిన దానికంటే తక్కువ నగదు జమ చేసినట్లు గుర్తించారు. మొత్తంగా రూ.3.5 కోట్ల కొట్టేసిన లక్ష్మణ్ బాబుపై సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పరారీలో ఉన్న నిందితుని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వ్యాధి నిరోధకతకు ఏఐ సహకారం

సీసీఎంబీ-సీఎస్ఐఆర్‌తో అగనిత ఫార్మా ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: మలేరియా, క్షయ, నాడీ సంబంధిత రుగ్మతల సమస్యలను పరిష్కరించేందుకు సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయోలజీ-కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీసీఎంబీ-సీఎస్ఐఆర్) నడుంబిగించాయి. ఈ మేరకు ఫార్మా కంపెనీ అగనితతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహకారంతో తొలి దశలోనే వ్యాధులను గుర్తించేందుకు, న్యూరాలజీ పరిశోధనలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఒప్పందం తోడ్పడనుంది. ఈమేరకు సీఎస్ఐఆర్- సీసీఎంబీ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 2024లోనూ మలేరియాను రూపుమాపేందుకు పోరాడుతూనే ఉన్నామని, ఔషధాలు, వ్యాక్సిన్ల కొరత ఇప్పటికీ ఉందని సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త పురణ్‌సింగ్ చెప్పారు. ఈ కొరతను అధిగ మించేందుకు ఏఐ సహకారంపై పరిశోధనలు అవసరమన్నారు. వ్యాధి నిరోధకతను పెంచడమే లక్ష్యంగా చేసుకున్న ఈ ఒప్పందం ఆదర్శవంతంగా నిలువనుందని అగనిత ఎండీ ప్రసాద్ పేర్కొన్నారు.

3 నుంచి బడిబాట

- నేడు అన్ని జిల్లాకేంద్రాల్లో సమావేశాలు
- మార్గదర్శకాలు జారీ చేసిన విద్యాశాఖ




సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఏ రోజున ఎవరేం చేయాలనే మార్గదర్శకాలను బుధవారంరాత్రి విద్యాశాఖ విడుదల చేసింది. నిర్ణయించిన తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఉపాధ్యాయులు తమ పరిధిలోని గ్రామాలు, శివారు గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. చదువుకోని పిల్లలను గుర్తించి, వారిని సమీపంలోని అంగన్‌వాడీలు, స్కూళ్లలో చేర్పించడం, ప్రభుత్వ స్కూళ్లల్లో ప్రవేశాలు పెంచడం, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించడం బడిబాట ఉద్దేశం. ఈ క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక బృందాలు, ఎన్జీఓల తోడ్పాటు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. 3 నుంచి 19వ తేదీ వరకు ఏ రోజు ఏం చేయాలనే వివరాలతో కూడిన షెడ్యూల్‌ను కూడా విద్యాశాఖ ప్రకటించింది.

కలెక్టర్ల నేతృత్వంలో కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో డీఈఓలు, ఎంఈఓలు, స్కూల్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఈ నెల 30వ తేదీన వివిధ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహిస్తారు. బడిబాట కార్యక్రమ ప్రణాళిక ఖరారు చేస్తారు. జూన్ 10వ తేదీ నాటికి ప్రభుత్వ స్కూళ్లల్లో నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్, యూనిఫాం పంపిణీకి సిద్ధం చేస్తారు.
- సామాజిక సేవాసంస్థలు, ఎన్జీఓలు వివిధ వర్గాలను డీఈఓలు సమన్వయపరిచి, బడిబాటను ముందుకు తీసుకెళ్లాలి. ఎంఈఓలు, హెచ్‌ఎంలకు, టీచర్లకు బడిబాట దిశానిర్దేశం చేస్తారు. కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పిస్తారు. మండలపరిషత్ అధికారులు, ఎస్ఐ, వివిధ వర్గాల నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు చేస్తారు.
- మండలస్థాయి కమిటీలను ఎంఈఓలు ఏర్పాటు చేస్తారు. ఏరోజు ఏం చేయాలనే కార్యాచరణను మండల పరిధిలో ఎంఈఓలు రూపొందిస్తారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు.
- గ్రామస్థాయిలో కమిటీలు, బడిబాటపై అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని స్కూల్ హెచ్‌ఎంలు నిర్వహిస్తారు. స్థానిక నేతల భాగస్వామ్యాన్ని తీసుకోవడంలో కీలక భూమిక పోషిస్తారు. బడిబాట ద్వారా గుర్తించిన విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ చేపడతారు.

హైదరాబాద్ టాలెంట్ హబ్!

- నైపుణ్యం, విభిన్న ప్రతిభకు కేంద్రంగా మన నగరం
- ఈ లిస్టులో నవీ ముంబై, పుణే నగరాలు కూడా..
- సులభతర వ్యాపారాలకు వీలు
- కేపీఎంజీ టాలెంట్ ఫీజిబిలిటీ నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: దేశంలోని కీలక నగరాల్లో హైదరాబాద్ డైనమిక్ టాలెంట్ హబ్‌గా నిలిచింది. హైదరాబాద్‌తో పాటు నవీ ముంబై, పుణే కూడా మంచి నైపుణ్యం, విభిన్న ప్రతిభకు కేంద్రాలుగా అభివృద్ధి చెందాయని ప్రముఖ కేపీఎంజీ సంస్థ తమ టాలెంట్ ఫీజబులిటీ నివేదికలో వెల్లడించింది. క్లిష్టమైన నైపుణ్యాలు, విభిన్న ప్రతిభను కోరుకునే రిక్రూటర్ల డిమాండ్లను తీర్చే విధంగా ఈ హబ్‌లు ఎదిగాయని తెలిపింది. ముంబై, ఢిల్లీ, బెంగళూరు నగరాలు వివిధ పరిశ్రమలకు అవసరమైన ప్రతిభను ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. జీవన నాణ్యత, ప్రయాణ సమయం, భద్రత, కనెక్టివిటీ, ఆరోగ్య సంరక్షణ, మెరుగైన గాలి నాణ్యత అంశాల్లో ఈ మూడు నగరాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయని వివరించింది. చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లో జీవన వ్యయ సూచికలు తక్కువగా ఉన్నాయని.. బెంగళూరు, గుర్గావ్, పుణే నగరాలు స్థానికంగా అధిక కొనుగోలు శక్తిని అందిస్తున్నాయని పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో దేశంలోని 10 రంగాలకు చెందిన 40కిపైగా కంపెనీలు, హెచ్‌ఆర్ ప్రతినిధులు, నియామక బృందాలతో కలసి ఈ అధ్యయనం చేసినట్టు తెలిపింది.

సులభతర వ్యాపారానికి వీలు..

నవీ ముంబై, హైదరాబాద్, చెన్నై నగరాల్లో వాణిజ్య లీజు ధరలు అందుబాటులో ఉన్నాయని.. ఇది సులభతర వ్యాపారానికి వీలు కల్పిస్తుందని కేపీఎంజీ నివేదిక పేర్కొంది. దీనితో ఈ నగరాల్లో కార్యకలాపాలపై సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని తెలిపింది. అయితే పన్ను రాయితీలు, సరళీకృత విధానాలు, ఇతర అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రతిభ, ప్రభుత్వ మద్దతు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, జీవన నాణ్యత, వ్యయాలు వంటి అంశాలు సంస్థల ఏర్పాటుకు, అత్యుత్తమ ప్రతిభను ఆకర్షించడానికి కీలకమని పేర్కొంది.

పోలియో బాధితుడికి గుండె మార్పిడి..

దేశంలోనే తొలిసారిగా కామినేనిలో శస్త్రచికిత్స నిర్వహణ



కామినేని వైద్యులతో భాస్కర్

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే తొలిసారి పోలియో బాధితుడికి విజయవంతంగా గుండె మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించామని కామినేని ఆసుపత్రి వైద్యుల బృంద సభ్యులు డా.విశాల్, వి.ఖంటే, రాజేశ్ దేశ్‌ముఖ్‌లు పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్‌కు గుండె సరిగా కొట్టుకోకపోవడం వల్ల రక్తం సరఫరా తగినంతగా లేకపోయింది. ఫలితంగా గత మూడేళ్లుగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయన ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించగా గుండె మార్పిడి అవసరం అని గుర్తించారు. ఇటీవల బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి గుండెను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. దీంతో ఆ గుండెను భాస్కర్‌కు అమర్చేందుకు వైద్యులు ఏర్పాట్లు చేశారు. దాదాపు 5 గంటల పాటు కష్టపడి అత్యంత కచ్చితత్వంతో రక్తనాళాలను గుండెతో అనుసంధానం చేశారు. ఇకపై భాస్కర్ సాధారణ జీవితం గడపవచ్చని వైద్యుల బృందం తెలిపింది. కామినేని ఆసుపత్రుల సీఈఓ డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు కిడ్నీ, కాలేయ మార్పిడి చికిత్సలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న కామినేని ఆసుపత్రులు తాజాగా గుండె మార్పిడిని విజయవంతంగా చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.



'ప్లాస్టిక్‌ఫ్రీ జోన్'గా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్

- జూలై చివరినాటికి మార్చాలని సీఎస్ శాంతికుమారి ఆదేశం
- ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధం, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించాలి
- పంచాయతీరాజ్, అటవీశాఖ, పీసీబీ అధికారులతో సీఎస్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను జూలై ఆఖరులోగా పూర్తి ప్లాస్టిక్ రహిత జోన్‌గా మార్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నిషేధం అమలు చేయాలన్నారు. బుధవారం సచివాలయంలో అటవీ, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎస్ మాట్లాడారు. కాగితపు సంచులు, జనపనార సంచులు, విస్తరాకులు మొదలైన పర్యావరణ అనుకూల ఉత్పత్తుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడానికి అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో అదనపు చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. టైగర్ రిజర్వ్‌లో ప్లాస్టిక్ నిషేధం గురించి హైవే వెంట ఉన్న స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ రిజర్వ్ పరిధిలోని నాలుగు ఆవాసాల్లో నివాసముంటున్న ప్రజలను తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. హరిత నిధి కింద ఉన్న నిధులను సంబంధిత ఆర్థిక సంవత్సరంలోనే వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, మహబూబ్‌నగర్ జిల్లాలోని మైసమ్మ ఆలయంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పీసీసీఎఫ్ డోబ్రియాల్, పీసీబీ సభ్య కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, ఎండోమెంట్స్ కమిషనర్ హనుమంత రావు పాల్గొన్నారు.



జొన్నగిరిలో రూ.1.75 లక్షల వజ్రం లభ్యం

తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో పేదలను వజ్రాలు వరిస్తున్నాయి. జొన్నగిరిలో పొలాల్లోకి వెళ్లిన ఓ వ్యక్తికి మంగళవారం వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఈ వజ్రాన్ని రూ.1.75 లక్షలు, జత కమ్మలు ఇచ్చి ఓ వజ్రాల వ్యాపారి కొనుగోలు చేసినట్లు తెలిసింది.



'స్కూటీ' అంటే పాప.. 'బైక్' అంటే బాబు

- కోడ్ భాషలో పసికందుల విక్రయాలు
- ఉత్తరాది రాష్ట్రాల్లో హైదరాబాద్ పోలీసుల తనిఖీలు
- ఢిల్లీ, యూపీ, పుణే నగరాల్లోని ముఠాపై ఆరా

సాక్షి, న్యూఢిల్లీ: పసికందుల విక్రయానికి అంతర్రాష్ట్రముఠా కోడ్ భాష వినియోగించినట్టు రాచకొండ పోలీసులు గుర్తించారు. పాపను 'స్కూటీ'గా, బాబును 'బైక్'గా పిలుస్తూ ఇలా కోడ్ భాష ఎంచుకున్నట్లు స్పష్టమైంది. చిన్నారులను రాష్ట్రాలు దాటించి పిల్లలు లేని దంపతులకు అమ్ముతున్న అంతర్రాష్ట్రముఠా గుట్టును రాచకొండ పోలీసులు భగ్నం చేసిన విషయం విదితమే. ఈ వ్యవహారంలో పోలీసులు మరింత దూకుడుగా ముందుకెళుతున్నారు. బుధవారం ఢిల్లీతోపాటు పుణే, యూపీ, నోయిడా, హరియాణాల్లోని పలు సిటీల్లో రాచకొండ పోలీసులు బృందాలుగా తనిఖీలు చేశారు. స్థానిక పోలీసుల సహకారంతో కొందరిని అదుపులోకి తీసుకొని విచారించినట్టు తెలుస్తోంది.

వాట్సాప్‌లో మెసేజ్‌లు

పాప కావాలి అంటే 'స్కూటీ' కావాలా?, బాబు కావాలి అంటే మీకు 'బైక్' కావాలా అని ముఠా సభ్యులు వాట్సాప్‌లో పిల్లలు లేని దంపతులకు మెసేజ్‌లు పంపేవారు. డైరెక్టుగా పాప కావాలా లేదా బాబు కావాలా అని మెసేజ్‌లు చేస్తే పోలీసులకు దొరికిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ముఠాసభ్యులు ఈ కోడ్ భాషను వినియోగించినట్టు పోలీసులు గుర్తించారు. ఎవరైనా తెలియక పాప లేదా బాబు కావాలి అని మెసేజ్ చేస్తే వారికి వాట్సాప్ కాల్ చేసి మరీ ఈ కోడ్ భాష గురించి చెప్పేవారని, అనంతరం పిల్లలు లేని దంపతులు కూడా కోడ్ భాషను వినియోగించే వారని తెలిసింది. ఈరకంగా పలు ప్రాంతాల్లో పసికందులను విక్రయించినట్టు సమాచారం. ప్రస్తుతం రాచకొండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన వారి వివరాలతోపాటు వీరికి సంబంధించిన ప్రతి ఒక్క కదలికలపై నిఘా పెంచారు. కొంతకాలంగా వీరు ఎవరెవరితో మాట్లాడుతున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు. వీటితో పాటు వాట్సాప్/టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా చాట్ చేసిన వివరాలు సేకరించారు. ఈ చాటింగ్‌లలో పోలీసులకు క్లూ లభించినట్టు తెలుస్తోంది. ఈ క్లూతోనే ఢిల్లీ, పుణే, హర్యానా వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు కొందరికి నోటీసులు కూడా జారీ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

ఆ చిన్నారులు మా వద్ద క్షేమంగా ఉన్నారు

పెంపుడు తల్లిదండ్రులకు పిల్లలను ఇచ్చేది లేదు: కాంతి వెస్లీ



వెంగళరావునగర్(హైదరాబాద్): రాచకొండ పోలీసులు 11 మంది చిన్నారులను శిశువిహార్‌కు అప్పగించారని, వారంతా తమ వద్ద క్షేమంగా ఉన్నారని మహిళ,శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ చెప్పారు. బుధవారం కొందరు తల్లిదండ్రులు, మీడియా మహిళ, శిశు సంక్షేమశాఖ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అయితే దాదాపు రెండు గంటలపాటు ఎదురుచూసినా ఎవరినీ లోపలకు అనుమతించలేదు. ఆ తర్వాత కాంతి వెస్లీ బయటకు వచ్చి మీడియాకు పలు విషయాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను విక్రయించడం, కొనడం చట్టరీత్యా నేరం.. వారికి కఠినశిక్షలు పడతాయని హెచ్చరించారు. ఆ విధంగా తీసుకొని పెంచుకోవడం కూడా తప్పేనన్నారు. చిన్నారులను కొని పెంచిన వారు ఇప్పుడు వచ్చి మా పిల్లలను మాకివ్వండి అని అడుగుతున్నారని, వారికి పిల్లలను ఇవ్వడం ఎట్టి పరిస్థితుల్లో కుదరదని తేల్చిచెప్పారు. అలాంటి తల్లిదండ్రులు ఎవరూ ఇక్కడకు రావొద్దని పేర్కొన్నారు. సంతానం లేనివారు ఎవరైనా పిల్లలు కావాలంటే మా వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకుంటే విచారణ అనంతరం దత్తత ఇస్తామన్నారు. పెంపుడు తల్లిదండ్రులు దత్తత కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి ఈ పిల్లలను మ్యాచ్ చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోండి

- చిన్నారుల అక్రమరవాణా అంశంపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్

సాక్షి, హైదరాబాద్: చిన్నారుల అక్రమ రవాణా అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధుల్యపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులను బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. చిన్నారుల అక్రమ రవాణా, దత్తత విషయంలో మీడియాలో వచ్చిన వార్తలపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరిస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే 16 మంది పిల్లలను రక్షించి శిశు విహార్‌కు తరలించినట్లు కమిషన్ తెలిపింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని సూచించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.